ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
7-10-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 248 పేజీలు: 10+4 వెల: 6.50
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
fb.com/vaartha Digital

గాఢ నిద్రపోతే రూ.12 లక్షల బహుమతి
హార్ముజ్ జలసంధిలో మళ్లీ పెరిగిన దాడులు
5

## ఐఎఎఫ్ చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్
29వ అధిపతిగా ఎంపిక
31న బాధ్యతల స్వీకారం



**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** భారత వైమానిక దళానికి కొత్త అధిపతిగా ఆశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. భారత వైమానిక దళానికి 29వ అధిపతిగా ఎంపికయ్యారు. పదవీ విరమణ చేయనున్న >>2

## జిడిపి వృద్ధి అంచనా 7.1%
3



## ఉప ఎన్నికల్లో భారీ పోలింగ్
రెజినగర్‌లో 78.42 %, నందిగ్రామ్‌లో 79.39 %

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** దేశంలోని మూడు రాష్ట్రాలపరిధిలో ఉన్న ఐదు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలు అత్యంత ఉత్కంఠ భరితంగాసాగాయి. పశ్చిమబెంగాల్, తమిళనాడు, అస్సాంలతో పాటు పుదుచ్చేరి కేంద్రపాలితప్రాంతాల్లో ఈ ఎన్నికలు జరిగాయి. అస్సాంలో ఒక లోక్‌సభ స్థానానికి కూడ ఆఉప ఎన్నికజరిగింది. ఇపుడు అందరికళ్లు కూడా బెంగాల్‌లోని రెజినగర్,నందిగ్రామ్‌స్థానాలపైనే ఉన్నాయి. అలాగే తమిళనాడులో ఇటీవలే టివికె ప్రభుత్వం >>2

## ఢిల్లీలో ఇం'ఢీ'




ఢిల్లీలో రాహుల్, ప్రియాంకలను తరలిస్తున్న పోలీసులు

# రాహుల్, ప్రియాంక అరెస్టు

'సర్' ఆందోళనల్లో ఇండియా కూటమి ఎంపీలను పెద్ద సంఖ్యలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
ఆకాశవాణి భవన్ వద్ద హోరెత్తిన నిరసనలు
బారికేడ్లు ఎక్కి జెండా ఎత్తిన రాహుల్
సిఇసిని కలిసేదాకా కదిలేది లేదన్న విపక్ష ఎంపీలు
జ్ఞానేశ్ రాజీనామా చేయాలని డిమాండ్
తొమ్మిదిగంటలు పైగా కొనసాగిన ఆందోళన

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా నిరసనకు దిగారు. ఆకాశవాణి భవన్ వద్ద వారు చేపట్టిన ధర్నా సందర్భంగా ఢిల్లీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికలసంఘం నిర్ణయాల్లో, ముఖ్యంగా స్పెషల్ఇంటెన్సివ్‌రివిజన్ ప్రక్రియలో >>2

### నిబంధనలకు విరుద్ధంగా అడిగారు..
అయినా వినతిపత్రం తీసుకొంటామని చెప్పాం: ఇసి

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** ఎన్నికల సంఘం కార్యాలయం వద్దకు వచ్చిన రాజకీయ పార్టీలు మంగళవారం సాయంత్రం నాలుగు గంటలవరకూ కూడా ఏ ఒక్కరూ తమ ప్రతినిధులతో ఎన్నికల సంఘం >>2



### మోడీ, అమిత్‌షా, మోహన్ భగవత్ తప్పించుకోలేరు: రాహుల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనాయా చేయాలని మంగళవారం కాంగ్రెస్, ప్రతిపక్ష నేతలు ఎన్నికల ప్రధాన కార్యాయాన్ని >>2

## ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు ఫిజిక్స్ నోబెల్
ఖగోళ న్యూట్రినోలపై విశేష పరిశోధన
ఐస్‌క్యూబ్ అబ్జర్వేటరీ ఏర్పాటుకు కృషి



**స్టాక్‌హోమ్, అక్టోబరు 6:** భౌతిక శాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతిని ఈ ఏడాది అమెరికాలోని విస్కాన్సిన్ మాడిసన్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్ గెలుచుకున్నారు. దక్షిణ ధ్రువంలో ఐస్క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ ఏర్పాటుకు ఆయన చేసిన విశేష కృషి, అత్యంత శక్తిమంతమైన ఖగోళ న్యూట్రినోలను కనుగొన్నందుకు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. న్యూట్రినోలు అనేవి విశ్వమంతా వ్యాపించి ఉండే అతి >>2

# ఆ 45 ఎకరాలు ఎక్కడ?
ఎర్రవల్లిలో భూమి ఏమైందో తేల్చాలని అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్



కెసిఆర్ కుటుంబానికి రెవెన్యూ రికార్డులపై నోటీసులు
ఆ భూముల్లో తెలంగాణ అమరవీరుల కాలనీ ఏర్పాటు
వెలికట్టలో యంగ్ ఇండియా స్కూల్, ఎడ్యుకేషన్ హబ్
ఎర్రవల్లి, వెంకటాపురం భూములపై సమీక్ష జరిపిన సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు6:** సిద్దిపేట జిల్లా మర్క్యూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలో 45 ఎకరాల భూముల ఆచూకీ లభ్యం కానుందున, వాటి గుర్తింపునకు వెంటనే సర్వే నోటిఫికేషన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. 22ఏపై శాసనసభలో గత నెల 16వ తేదీన నిర్వహించిన చర్చలో ఆ భూములపై విచారణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆ విచారణ పురోగతిపై ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధీ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, భూ అక్రమాలపై విచారణకు వేసిన కమిటీ, ధరణి అక్రమాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచారణ పురోగతిపై సీఎం కమిటీ సభ్యులను ప్రశ్నించారు. ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉందని, కానీ తాజా సర్వేలో 343 ఎకరాల భూమి మాత్రమే ఉన్నట్లు గుర్తించామని సీఎంకు అధికారుల వివరించారు. రికార్డులో ఉన్న భూమికి, వాస్తవంగా ఉన్న భూమికి మధ్య 45 ఎకరాల వ్యత్యాసం ఉందని అధికారులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆ 45 ఎకరాల భూమిని తేల్చేందుకు ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వేకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సర్వే నెంబర్ 325 సమీపంలోనే మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు,ఆయన కుటుంబసభ్యులకు భూములుఉన్నందున, వారిభూముల రికార్డులను >>7

### జ్ఞానేశ్ రాజీనామా చేసే దాకా విశ్రమించం
ముఖ్యమంత్రి రేవంత్ స్పష్టీకరణ
రాహుల్, ప్రియాంక ప్రభృతుల అరెస్టులను ఖండించిన సిఎం

**హైదరాబాద్,అక్టోబరు6,ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటంతో కేంద్ర ప్రభుత్వం వణికిపోతోందని >>2



మంగళవారం పులిచింతల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలిస్తున్న డి.సిఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌కుమార్ తదితరులు

## 'కోత'లుండవు..
20 వేల మె.వాకు పెరిగిన విద్యుత్ డిమాండ్
జలవిద్యుత్ 4 వేల మె.వా తగ్గుదల: డి.సిఎం భట్టి

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డిమాండ్ భారీగా పెరగడమే కాకుండా, జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పటికీ ప్రజలకు ఎక్కడా కోతలు లేకుండా నిరంతరాయ విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పులిచింతల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని మంగళవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ పీక్ డిమాండ్ 15 వేల మెగావాట్లు ఉండగా, ప్రస్తుతం దాదాపు 20 వేల మెగావాట్లకు చేరిందన్నారు. వర్షాభావ పరిస్థితులతో నదులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో >>2

## జీరో యాక్సిడెంట్ రోడ్లు నిర్మిద్దాం
2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలు 50 శాతం తగ్గించాలి
గుజరాత్ చింతన్ శిబిర్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు6,ప్రభాతవార్త:** స్వీడన్ అమలు చేస్తున్న విజన్ జీరో యాక్సిడెంట్ విధానం నుంచి మనం ఎంచుకొని ఆదిశలో రోడ్డునిర్మాణం పనులు చేపట్టాలని 2030కి వరకు రోడ్లపై మరణాలను సగానికి సగం తగ్గించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉద్బోధించారు.గుజరాత్ రాష్ట్రం నర్మద జిల్లాలోని ఎక్తానగర్‌లో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న చింతన్ శివిర్-2026 మంగళవారం రెండో రోజు కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సురక్షిత రహదారుల రూపకల్పన - ప్రమాణాల నుంచి అమలు వరకు" అనే అంశంపై జరిగిన ప్రత్యేక సెషన్‌కు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా మంత్రి కీలకోపన్యాసం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు క్రమం తప్పకుండా >>2



మంగళవారం గుజరాత్ చింతన్ శిబిర్‌లో ప్రసంగిస్తున్న మంత్రి కోమటిరెడ్డి



## ఐటీఎల్ఎ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఓకే
ఎంఎస్ఎంఇలకు భారీ ప్రోత్సాహం
రూ.10వేల కోట్లతో వృద్ధి నిధి
ప్రధాని మోడీ 25 యేళ్ల పాలనాకాలాన్ని ప్రశంసిస్తూ 'స్టాండింగ్ ఒవేషన్'తో తీర్మానం

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎస్ఎంఎస్ఇలకు) వృద్ధి ఆధారిత మూలధనాన్ని అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసేందుకు, రూ.10వేల కోట్లతో ఎస్ఎంఇ వృద్ధి నిధికి కేంద్రం కేటాయింపులకు ఆమోదం తెలిపింది. తయారీ, సేవలు, టెక్నాలజీ, ఆవిష్కరణల ఆధారిత రంగాలు, వ్యూహాత్మక విలువ గొలుసుల వంటి వివిధ రంగాలలో అగ్రగామి భారతీయ సంస్థలు ఆవిర్భవించేలా చేయడమే ఈనిధి లక్ష్యం. మొత్తం ఎంఎస్ఎంఇ వ్యవస్థకు ఈక్విటీ, ద్రవ్యలభ్యత, వృత్తిపరమైన మద్దతు అందించడంపై దృష్టి సారిస్తూ, కేంద్ర బడ్జెట్ 2026-27లో చేసిన సమగ్ర ప్రకటనలలో >>2

## 'సూర్యో'దయం
ఫ్లీట్ సపోర్ట్ షిప్‌ను ప్రారంభించిన రక్షణమంత్రి రాజ్‌నాథ్
45వేల డిడబ్ల్యుటి వరకు నౌకల నిర్మాణానికి స్లిప్‌వే-4 అభివృద్ధి

**విశాఖపట్నం, అక్టోబర్ 6, ప్రభాతవార్త:** విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)లో స్వదేశీ నౌకా నిర్మాణ సామర్థ్యానికి మరింత ఊతమిచ్చే కీలక కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్ (ఎఫ్ఎస్ఎస్-1) 'సూర్య'ను ప్రారంభించడంతో పాటు ఐదో ఫ్లీట్ సపోర్ట్ షిప్ (ఎఫ్ఎస్ఎస్-5)కు కీల్ వేశారు. అలాగే అభివృద్ధి చేసిన స్లిప్‌వే-4, 300 టన్నుల గోలియత్ క్రేన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ "ఎఫ్ఎస్ఎస్-1 ప్రారంభం సాధనకు ప్రతీక.. ఎఫ్ఎస్ఎస్-5కు కీల్ వేయడం సంకల్పానికి ప్రతీక.. కొత్త స్లిప్‌వే పెరుగుతున్న సామర్థ్యానికి ప్రతీక" అని పేర్కొన్నారు. హెచ్ఎస్ఎల్ నౌకా నిర్మాణ సామర్థ్యాన్ని పెంచుకోవడంతో పాటు దేశ సముద్ర శక్తికి పునాదులను మరింత బలోపేతం చేస్తోందన్నారు. >>2



విశాఖలో ఫ్లీట్ సపోర్ట్ షిప్‌ను ప్రారంభించిన అనంతరం జవాన్లతో రక్షణమంత్రి రాజ్‌నాథ్



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌తో భేటీ అయిన స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్

# అశుతోష్ దీక్షిత్

>> ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ స్థానంలో ఈనెల 31 మధ్యాహ్నం ఆశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆశుతోష్ దీక్షిత్ భారత వైమానిక దళంలో ప్రస్తుతం వైస్ చీఫ్‌గా పనిచేస్తున్న ఆయనకు దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సేవా అనుభవం ఉంది. 1986 డిసెంబర్ 6న భారత వైమానిక దళంలోని ఫైటర్ స్ట్రీమ్‌లో నియమితులయ్యారు. 1966 డిసెంబర్ 9న జన్మించిన ఆశుతోష్ దీక్షిత్ ఎక్స్‌పెరిమెంటల్ టెస్ట్ పైలట్, క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేశారు. వివిధ రకాల యుద్ధ విమానాలు, ఇతర విమానాలపై ఆయనకు 3,500 గంటలకు పైగా ఫ్లయింగ్ అనుభవం ఉంది. మిరాజ్2000, మిగ్ సిరీస్ విమానాలు, కిరణ్, జాగ్వార్,ఐఎల్78, హాక్, తేజస్ తదితర విమానాలను ఆయన నడిపారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, ఆపరేషన్ సిందూర్ వంటి కీలక ఆపరేషన్లలో కూడా ఆయనకు అనుభవం ఉంది. దీక్షిత్ తన కెరీర్‌లో పలు కీలక కమాండ్ బాధ్యతలు నిర్వహించారు. మిరాజ్2000 స్క్వాడ్రన్‌కు కమాండింగ్ ఆఫీసర్‌గా పనిచేయడంతో పాటు పశ్చిమ సెక్టార్‌లోని ఫ్రంట్‌లైన్ ఫైటర్ ఎయిర్‌బేస్, దక్షిణ సెక్టార్‌లోని ఫైటర్ ట్రైనింగ్ బేస్‌కు కూడా నాయకత్వం వహించారు. అలాగే సదరన్ ఎయిర్ కమాండ్‌లో ఎయిర్ డిఫెన్స్ కమాండర్‌గా, సౌత్ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌లో సీనియర్ ఎయిర్ స్టాఫ్ ఆఫీసర్‌గా కూడా పనిచేశారు.

ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో డిప్యూటీ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ బాధ్యతలు కూడా నిర్వహించారు. వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆశుతోష్ దీక్షిత్ సెంట్రల్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్‌ఇన్‌చీఫ్‌గా పనిచేశారు. అనంతరం చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్మన్‌కు చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

# 'సూర్యో'దయం

>> హెచ్‌ఎస్‌ఎల్ స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మిస్తున్న తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్‌కు 'సూర్య' అని నామకరణం చేశారు. నేవీ వైవ్స్ వెల్‌నెస్ అసోసియేషన్ అధ్యక్షురాలు లైలా స్వామినాథన్ సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం నౌక బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. ఫ్లీట్ సపోర్ట్ షిప్‌లు సముద్రంలో సుదీర్ఘకాలం కార్యకలాపాలు నిర్వహించే నౌకాదళానికి అవసరమైన ఇంధనం, సరఫరాలు, నిర్వహణ సహకారాన్ని అందించనున్నాయి. అధునాతన సరకు, ద్రవ పదార్థాల నిల్వ సామర్థ్యంతో పాటు నౌకలోనే ప్రాథమిక నిర్వహణ వర్క్‌షాపులు, బహుళ ప్రయోజన హెలికాప్టర్ల నిర్వహణకు అనువైన డెక్,స్వీయరక్షణ వ్యవస్థలుఉంటాయనిరక్షణ శాఖ తెలిపింది.

**45 వేల డిడబ్ల్యుటి నౌకల నిర్మాణానికి సిద్ధం**

హెచ్‌ఎస్‌ఎల్‌లోని స్లిప్‌వే-4ను విస్తరించి, బలోపేతం చేశారు. దీంతో 45 వేల డిడబ్ల్యుటి వరకు భారీ నౌకలను నిర్మించి, నీటిలోకి దించే సామర్థం హెచ్‌ఎస్‌ఎల్‌కు లభించింది. స్లిప్‌వే-3, 4లపై ఏర్పాటు చేసిన 300 టన్నుల గోలియత్ క్రేన్ భారీ నౌకా భాగాలను వేగంగా, కచ్చితంగా తరలించేందుకు ఉపయోగపడనుంది. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఎల్‌అండ్‌టి జియోస్ట్రక్చర్, కోనేక్రేన్స్ ఆధ్వర్యంలో ఈ క్రేన్‌ను రూపొందించారు. ఆధునిక నియంత్రణ వ్యవస్థలు, రిమోట్ డయాగ్నస్టిక్స్, కండిషన్ మానిటరింగ్ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయి.

ఈ కార్యక్రమంలో నౌకాదళాధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి, విశాఖ ఎంపి శ్రీభరత్ మాథుకుమిల్లి, రక్షణ ఉత్పత్తుల శాఖ కార్యదర్శి సంజీవ్ కుమార్, తూర్పు నౌకాదళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, హెచ్‌ఎస్‌ఎల్ సిఎండి రియర్ అడ్మిరల్ సి.రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

# 'కోత'లుండవు..

>> జలవిద్యుత్ ఉత్పత్తి సుమారు 4 వేల మెగావాట్లు తగ్గిందని చెప్పారు. దీంతో మొత్తంగా 8 వేల మెగావాట్ల అదనపు భారం ఏర్పడినప్పటికీ రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాయని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రాత్రి వేళల్లో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను థర్మల్ పవర్ ద్వారా అధిగమిస్తున్నామని వెల్లడించారు. నీటి వినియోగంలో జాగ్రత్త అవసరం ఉందని, రాబోయే రోజుల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోతే నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. తదుపరి వర్షాకాలం వరకు అందుబాటులో ఉన్న నీటిని మనుషులు, పశువులు, పక్షుల తాగునీటి అవసరాలకు జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. తాగునీటిని భవిష్యత్ కోసం నిల్వ చేసుకోవడం సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు.

# ఉప ఎన్నికల్లో భారీ పోలింగ్

>> అధికారంలోకి రావడం ఆపై ఉప ఎన్నికలకు రావడం కూడా ఆపార్టీకి మరింత ప్రతిష్టాత్మకంగా నిలిచింది. అస్సాంలోని నాగాంవ్ లోక్‌సభ నియోజకవర్గంలో ముక్కోణపుపోటీ నిలిచింది. బిజెపి, కాంగ్రెస్ ఎఐయుడిఎఫ్‌లమధ్యే పోటీ ఉంటున్నది. ప్రద్యూత్ బోర్డోలోయి రాజీనామాతో ఉప ఎన్నిక అనివార్యం అయింది. బెంగాల్‌లో ఉప ఎన్నిక సమయం ముగిసేనాటికి రెజినగర్‌లో 78.42శాతం, నందిగ్రామ్‌లో 79.39శాతంచొప్పున పోలింగ్ నమోదయింది. మొత్తం బారులుతీరిన ఓటర్లందరూ ముగిస్తే 80శాతానికిపైగా నమోదుకాగలదని నేతల అంచనా. అలాగే అస్సాంలోని నాగాంవ్‌లోక్‌సభ స్థానంలో 76శాతం పోలింగ్ నమోదయినట్లు తేలింది. మదురాంతకంలో 85.98శాతం, ధరాపురంలో 80.30శాతం చొప్పున నమోదయితే కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలోని తట్టంచావిడిఓ 80.81శాతం నమోదయింది. అస్సాంలోని నాగాంవ్ స్థానంలో శాంతియుతంగా ముగిసింది. ఇక సీఎం రాజీనామాచేసిన మేదినిపూర్‌జిల్లా నందిగ్రామ్‌స్థానంలో 79.39శాతంగా ఉంది. ముర్షిదాబాద్ జిల్లాలోని రెజినగర్‌స్థానంలో 78.42శాతం వరకూ సాయంత్రం ఐదుగంటలు దాటినతర్వాత నమోదయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నందిగ్రామ్ కాంగ్రెస్ అభ్యర్థి మిలన్‌ప్రధాన్ మాట్లాడుతూ ఓట్‌లూట్ జరుగుతోందని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, పోలీస్; భద్రతా దళాలు అధికార పార్టీకి తొత్తులుగా మారాయని ఆరోపించారు. ఇక తమిళనాడులో డిఎంకె పార్టీ సభ్యులు టివికె ఏజెంట్‌సమక్షంలోనే పోలింగ్‌ప్రక్రియను అడ్డుకునేందుకు యత్నించారు.

### ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు

# ఫిజిక్స్ నోబెల్

>> సూక్ష్మమైన కణాలు. ఇవి మనల్ని, మన భూమిని కూడా దాటుకొని నిరంతరం ప్రయాణిస్తూనే ఉంటాయి. కానీ, వీటిని గుర్తించడం చాలా కష్టం. ఎందుకంటే ఇవి దేనితోనూ సులభంగా చర్య జరపవు. అరుదుగా ఏదైనా అణు కేంద్రకంతో ఢీకొన్నప్పుడు మాత్రమే వీటి ఉనికిని పసిగట్టడం సాధ్యమవుతుంది. విశ్వంలో జరిగే అతి శక్తిమంతమైన ప్రక్రియల నుంచి ఈ న్యూట్రినోలు పుడతాయి. ఇతర కణాల్లా కాకుండా, న్యూట్రినోలు తమ దిశను మార్చుకోకుండా, శక్తిని కోల్పోకుండా నేరుగా మనల్ని చేరతాయి. అందువల్ల, విశ్వంలోని రహస్యాలను ఛేదించడానికి ఇవి కీలక సమాచారాన్ని అందిస్తాయి. దక్షిణ ధ్రువంలోని స్వచ్ఛమైన మంచును ఉపయోగించి న్యూట్రినోలను పట్టుకోవచ్చనే అద్భుతమైన ఆలోచనను ఫ్రాన్సిస్ హాల్జెన్ తొలిసారిగా 1988లో ప్రతిపాదించారు. మంచులో న్యూట్రినో అణు కేంద్రకంతో ఢీకొన్నప్పుడు ఒక కాంతి వెలువడుతుందని,ఆ కాంతిని సెన్సార్ల ద్వారా గుర్తించవచ్చని ఆయన భావించారు. భూకంపాలు లేని స్థిరమైన భౌగోళిక ప్రాంతం కావడం, ఇతర జోక్యాలు తక్కువగా ఉండటంతో దక్షిణ ధ్రువం ఈ ప్రయోగానికి అత్యంత అనువైనదిగా నిరూపితమైంది. కొద్దికాలంలోనే ఆయన ఆలోచనకు ఇతర శాస్త్రవేత్తల మద్దతు లభించింది. అత్యంత శక్తిమంతమైన న్యూట్రినోలు చాలా అరుదుగా కనిపిస్తాయి కాబట్టి, వాటిని గుర్తించడానికి భారీపరిమాణంలో మంచు అవసరం. ఈ క్రమంలోనే ఒక క్యూబిక్ కిలోమీటరు విస్తీర్ణంలో సెన్సార్లతో కూడిన ఖఐస్క్యూబ్ అబ్జర్వేటరీఖని 2011లో పూర్తిచేశారు. కొద్ది కాలంలోనే పరిశోధకులు తొలిసారిగా అధిక శక్తి కలిగిన న్యూట్రినోలను గుర్తించారు. సౌర వ్యవస్థకు ఆవల నుంచి వస్తున్న న్యూట్రినోల ఆవిష్కరణను ప్రకటించి, విశ్వంలోని న్యూట్రినో మూలాలను వెతికే అన్వేషణకు మార్గం సుగమం చేశారు. ఫ్రాన్సిస్ హాల్జెన్ ఒక అంతర్జాతీయ బృందానికి నాయకత్వం వహించి మనకు ఒక అద్భుతమైన పరికరాన్ని అందించారు. ఆయన పట్టుదల, శాస్త్రీయ దార్శనికత ఖగోళ శాస్త్రంలో ఒక కొత్త శకానికి దారితీశాయని నోబెల్ కమిటీ ఫర్ ఫిజిక్స్ చైర్మన్ మార్క్ పియర్స్ ప్రశంసించారు. ఐస్క్యూబ్ ద్వారాలభించేసమాచారంవిశ్వంలోని భయంకరమైన ప్రక్రియల గురించి కొత్త విషయాలను వెల్లడించడమే కాకుండా, మునుపెన్నడూ తెలియని ఖగోళ రహస్యాలను కూడా బహిర్గతం చేయగలదని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు.

## వారం - వర్జ్యం

07-10-2026, బుధవారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్తకార్తె
తి.ద్వాదశి రా.11.18,
న. మఖ రా.9.42,
వ.ఉ.10.00- ఉ.11.34,2)తె.5.35 -ఉ.7.10.
దు.ఉ.11.31 - మ.12.19,
రాహు. మ.12.00- మ.1.30,
శుభ. స. లేదు.

## వార్తాఫలం

**మేషం :** చిన్నచిన్న అవసరాలకు గాను అధికంగా శ్రమించవలసి రావడం వలన వత్తిడి అధికంగా ఉంటుంది.

**వృషభం :** మీ పరపతిని ఉపయోగించి అతిముఖ్యమైన వ్యవహారాలను సానుకూల పరచుకోగలుగుతారు.

**మిథునం :** రచనా వ్యాసంగాల పట్ల ఆసక్తిని కనబరుస్తారు. హోదాలను పెంచే ఒకానొక సంస్థలో సభ్యత్వాన్ని పొందుతారు.

**కర్కాటకం :** మొహమాటాలకు పోయి కొన్ని కార్యక్రమాలను నిర్వహించవలసి వస్తుంది. చేబదుళ్ళను అధికంగా చేస్తారు.

**సింహం :** ఉన్నతాధికారులకు బహుమతులను అందించడానికి గాను చిన్నపాటి కొనుగోళ్ళను సాగిస్తారు.

**కన్య :** చెవి, ముక్కుగొంతు సంబంధిత ఇబ్బందులను ఎదుర్కొన వలసి వస్తుంది. ఉన్నతాధికారుల మెప్పును సాధిస్తారు.

**తుల :** ఉత్తర ప్రత్యుత్తరాల వలన శుభవార్తలను అందుకోగలుగుతారు. స్వల్పమైన అభివృద్ధిని సాధించగలుగుతారు.

**వృశ్చికం :** అవసరాలను పరిగణలోనికి తీసుకుని ఇష్టం లేకపోయినా కొన్ని కార్యక్రమాలను చేపడతారు.

**ధనుస్సు :** కాంట్రాక్టుదారులకు శ్రమ మీద ఫలితాలుసానుకూల పడతాయి. స్పెక్ క్యూలేషన్లు దూరంగా ఉంటారు.

**మకరం :** యదార్థవాది లోక విరోధి అన్న నానుడి మీ అనుభవం లోనికి వస్తుంది. సామాజిక సేవలో పాల్గొంటారు .

**కుంభం :** అదృష్టానికి దగ్గరగా రోజులు నడుస్తున్నట్లు భావిస్తారు. ఆలోచనలు ప్రణాళికలు ప్రధాన ప్రస్తావనాంశాలవుతాయి.

**మీనం :** ప్రజా సంబంధాలు పెంచుకొనడానికి గాను చేసే ప్రయత్నాలు సూత్రప్రాయంగా ఉంటాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాహుల్, ప్రియాంక అరెస్టు

>> అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ప్రతిపక్ష పార్టీలు ఈ మార్చ్‌ను చేపట్టాయి. ఎన్నికల సంఘం కార్యాలయం వైపు సాగిన ప్రతిపక్షాల మార్చ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా తదితరులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల సంఘం కార్యాలయం వైపు మార్చ్‌ను అడ్డుకోవడంతో పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్ వద్దే నిరసన కొనసాగించారు. దాదాపు ఎనిమిది గంటల తర్వాత వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాహుల్ గాంధీని ఢిల్లీ పోలీసులు లాక్కుని వెళుతూ అదుపులోకి తీసుకుంటున్న వీడియోను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ వీడియోకు ప్రతిదీ గుర్తుండిపోతుంది అనే వ్యాఖ్యను జత చేసింది. ఇదిలా ఉంటే నిర్వాచన్‌సదన్‌కు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో రాహుల్‌ప్రియాంక వేణుగోపాల్ తదితరులు బారికేడ్లవద్దనే నిలిచి నిరసన తెలిపారు.ఎన్నికల కమిషన్ విపక్షాలకు భయపడుతోందని, ఎన్డీయేపక్షం పోలీసుల మద్దతుతో సర్‌ప్రక్రియపై నిరసనను అడ్డుకుంటున్నదంటూ ఆరోపించారు. బారికేడ్లు ఎక్కి మరీ రాహుల్ తన నిరసన తెలిపారు. ఎన్నికల సంఘ కార్యాలయానికి సమీపంలోనే ఉన్న ఆకాశవాణి వద్ద కాంగ్రెస్ శ్రేణులు గుమికూడి బైఠాయింపునిరసన తెలిపాయి. ఇండియా కూటమి ఎంపిలు అత్యధికసంఖ్యలో ఈనిరసనలో పాల్గొన్నారు. ఒకదశలో అదుపులోకి తీసుకున్న తర్వాత రాహుల్ గాంధీ బస్సు నుంచి బయటకు దిగేందుకు కూడా విఫల యత్నంచేసారు. ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. వీరంతా కలిసి ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. మన దేశానికి జరిగింది దేశద్రోహం. ఎవరూ తప్పించుకోలేరని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఓట్ల చోరీ ద్వారా మోడీ, అమిత్ షా, మోహన్ భగవత్ దేశాన్ని హైజాక్ చేశారని ఆరోపించారు. ఈ ప్రక్రియకు జ్ఞానేష్ కుమార్ సహకరించారని విమర్శించారు. బీజేపీని ఎదుర్కోవడమే తమ లక్ష్యం కాదని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాడుతున్నామని అన్నారు. వారిని ఓడిస్తామంటూ బీజేపీకి వార్నింగ్ ఇచ్చారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా ఓటర్లను తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈసీ కార్యాలయానికి కాంగ్రెస్ , ఇతర ప్రతిపక్షాలు ర్యాలీగా వెళ్లి ముట్టడించే ప్రయత్నం చేశాయి. ఆకాశవాణి భవన్ సమీపంలో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వీరిద్దరూ రోడ్డుపైనే కూర్చుని నిరసన తెలిపారు. ప్రతిపక్ష ఎంపీలు సీఈసీని కలవాలని అనుకుంటున్నారని, కానీ పోలీసులు ఇక్కడే నిలిపేశారని, కానీ జ్ఞానేష్ కుమార్ భయపడుతున్నారని రాహుల్ గాంధీ అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, టీఎంసీ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, డెరిక్ ఓబ్రెయిన్ సహా పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.




మంగళవారం న్యూఢిల్లీలో ఆందోళన చేస్తున్న ఖర్గే, రాహుల్, ప్రియాంక ఇతర ఎంపీలు

# నిబంధనలకు విరుద్ధంగా అడిగారు..

>> సమావేశంకోసం అపాయింట్‌మెంట్ కోరలేదని భారత ఎన్నికల సంఘం స్పష్టంచేసింది. సిఇసి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్న విపక్ష ఎంపిల నిరసన నేపథ్యంలో ఎన్నికలసంఘం డిప్యూటీ డైరెక్టర్ పవన్ పేరిట ప్రకటన విడుదలయింది. చేపట్టిన మార్చ్ నేపథ్య మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఏ రాజకీయ పార్టీ కూడా తమ ప్రతినిధుల ద్వారా ఎన్నికల సంఘంతో సమావేశం కోసం అపాయింట్‌మెంట్ కోరలేదని ఈసీఐ స్పష్టం చేసింది. అనంతరం సుమారు 4 గంటల సమయంలో, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఎంపీల ప్రతినిధి బృందం ఎన్నికల సంఘాన్ని కలిసి వినతిపత్రం సమర్పించాలనుకుంటున్నట్లు ఢిల్లీ పోలీసుల ద్వారా సమాచారం అందిందని తెలిపింది. రాజకీయ పార్టీలతో సమావేశాలకు సంబంధించి 2025లో ఎన్నికల సంఘం ఒక విధానాన్ని రూపొందించిందని, ఈ విధానం గురించి అన్ని రాజకీయ పార్టీలకు సమాచారం అందించామని ఈసీఐ పేర్కొంది. సాధారణంగా ఒక రాజకీయ పార్టీ ప్రతినిధి బృందం లేదా పలు పార్టీల సంయుక్త ప్రతినిధి బృందం ఎన్నికల సంఘాన్ని కలవాలనుకుంటే, ఆ పార్టీ లేదా పార్టీల అధికారికంగా నియమిత ప్రతినిధి ద్వారా అపాయింట్‌మెంట్ కోరాల్సి ఉంటుందని తెలిపింది. అనంతరం ఇరు పక్షాలకు అనుకూలమైన సమయాన్ని పరస్పర అంగీకారంతో నిర్ణయించి సమావేశం నిర్వహిస్తామని వివరించింది. అయితే, 4 గంటల తర్వాత ఎంపీలతో సమావేశంపై ఎన్నికల సంఘం పరిశీలన జరుపుతున్న సమయంలో, సుమారు 240 మంది ఎంపీలతో కూడిన బృందం సమావేశం కావాలని కోరుకుంటున్నట్లు, అలాగే సమావేశం పార్లమెంట్ హౌస్ అనెక్స్‌లో నిర్వహించాలని ప్రతిపాదించినట్లు ఢిల్లీ పోలీసుల డీసీపీ ద్వారా సమాచారం అందిందని ఈసీఐ తెలిపింది. ఈ అభ్యర్థన తమ సాధారణ విధానానికి భిన్నంగా ఉన్నందున అంగీకరించలేకపోయామని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈసీఐ ప్రోటోకాల్ ప్రకారం ఇటువంటి సమావేశాలు ఎన్నికల సంఘం ప్రాంగణంలోనే నిర్వహిస్తామని స్పష్టం చేసింది. అయితే ఎంపీలు వినతిపత్రాన్ని సమర్పించేందుకు వీలుగా, ఎన్నికల సంఘం తరఫున విధుల్లో ఉన్న అత్యున్నత స్థాయి అధికారిని సమావేశం జరుగుతున్న ప్రదేశానికి పంపి వినతిపత్రాన్ని స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రతిపాదించామని తెలిపింది. ఇది కూడా ఇప్పటివరకు అనుసరించని అసాధారణ చర్యేనని ఈసీఐ పేర్కొంది. అయితే ఈ ప్రతిపాదనను కూడా ఎంపీలు తిరస్కరించినట్లు తెలిపింది. దేశంలోని పార్లమెంటరీ, ప్రజాస్వామ్య ప్రక్రియలను ఎన్నికల సంఘం గౌరవిస్తుందని, అదే సమయంలో తన సొంత ప్రోటోకాల్‌లు, సంప్రదాయాలకు కూడా అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఈసీఐ స్పష్టం చేసింది. ఏ రాజకీయ పార్టీ అయినా ఎప్పుడైనా ఎన్నికల సంఘంతో సమావేశం కోసం అభ్యర్థించవచ్చని, సమయం, షెడ్యూల్‌ను పరిగణనలోకి తీసుకుని కమిషన్ సమావేశానికి తేదీ, సమయాన్ని నిర్ణయిస్తుందని ఎన్నికలసంఘం డిప్యూటీ డైరెక్టర్ పవన్‌పేరిట ప్రకటన విడుదలచేసింది.

# మోడీ, అమిత్‌షా, మోహన్ భగవత్ తప్పించుకోలేరు

>> ముట్టడించే ప్రయత్నం చేశాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులకు, ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలకు మధ్య తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ఈ నిరసనల్లో పాల్గొన్న లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈసీని విమర్శిస్తూ కేంద్రాన్ని టార్గెట్ చేశారు. ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. వీరంతా కలిసి ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మన దేశానికి జరిగింది దేశద్రోహం. ఎవరూ తప్పించుకోలేరని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఓట్ల చోరీ ద్వారా మోడీ, అమిత్ షా, మోహన్ భగవత్ దేశాన్ని హైజాక్ చేశారని ఆరోపించారు. ఈ ప్రక్రియకు జ్ఞానేష్ కుమార్ సహకరించారని విమర్శించారు. బీజేపీని ఎదుర్కోవడమే తమ లక్ష్యం కాదని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాడుతున్నామని అన్నారు. వారిని ఓడిస్తామంటూ బీజేపీకి వార్నింగ్ ఇచ్చారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా ఓటర్లను తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈసీ కార్యాలయానికి కాంగ్రెస్ , ఇతర ప్రతిపక్షాలు ర్యాలీగా వెళ్లి ముట్టడించే ప్రయత్నం చేశాయి.

# కేంద్ర కేబినెట్ ఓకే

>> ఇది కూడా ఒక భాగమని కేబినెట్ భేటీ అనంతరం మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈక్విటీ మద్దతును అందించే నిధులు ఇప్పటికే ఉన్నప్పటికీ, వాటిలో అధికశాతం ప్రారంభ దశలోని సంస్థలపై దృష్టి సారిస్తాయి. ప్రధానంగా సూక్ష్మ పరిశ్రమలకే పరిమితమవుతాయి. దీనివల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఈక్విటీ వృద్ధి మూలధనం విషయంలో ఒక నిర్మాణాత్మక అంతరం ఏర్పడుతుంది.

**'ఐటిఎల్‌ఏ ఏర్పాటుకు ఆమోదం**

దేశంలో రవాణా, లాజిస్టిక్ రంగాల సమగ్ర అభివృద్ధి, పరిశోధన అలాగే వివిధ రవాణా మార్గాల అనుసంధానానికి నేషనల్ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేందుకు కేంద్రం ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్టు అండ్ లాజిస్టిక్స్ అథారిటీ (ఐటిఎల్‌ఎ) ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ అథారిటీ ద్వారా రైల్వేలు, రోడ్లు, పోర్టులు, విమానయాన రంగాలు మరింత మెరుగైన పద్ధతిలో అనుసంధానం కానున్నాయి. దేశవ్యాప్తంగా చేపడుతున్న భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల ప్రణాళిక, వాటి అమలును పర్యవేక్షి ంచడంలో ఈ అథారిటీ అత్యంత కీలక పాత్ర పోషించనుంది. రవాణా ప్రణాళిక కోసం ఒక ఏకీకృత చట్రాన్ని సృష్టించే లక్ష్యంతో, దీర్ఘకాలిక రవాణా ప్రణాళికలను రూపొందించడానికి, ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అంచనా వేయడానికి, అలాగే రోడ్లు, రైల్వేలు, పోర్టులు, విమానయానం, జలమార్గాలు, పట్టణ రవాణా రంగాల నుండి డేటాను ఏకీకృతం చేయడానికి సమీకృత రవాణా, లాజిస్టిక్స్ అథారిటీ (ఐటిఎల్‌ఏ) దోహదపడనుంది. "లాజిస్టిక్స్ అవసరం పెరుగుతోంది. వాస్తవానికి, జిడిపి 7శాతం పెరిగితే, లాజిస్టిక్స్ అవసరం 10శాతం పెరుగుతుంది" అని మంగళవారం కేబినెట్ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల ప్రణాళిక ఉండేలా చూసేందుకు ఈ అథారిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వైష్ణవ్ తెలిపారు.

**"స్టాండింగ్ ఒవేషన్ తో తీర్మానం**

ప్రభుత్వ అధినేతగా ఒక కార్యనిర్వాహక పదవిలో 25యేళ్ల పాటు నిరంతర నాయకత్వంలో మైలురాయిని చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అభినందనలు తెలుపుతూ ఆయన విశిష్ట నాయకత్వాన్ని ప్రశంసిస్తూ కేంద్ర మంత్రివర్గం మంగళవారం ఒక తీర్మానాన్ని ఆమోదించి, నిలబడి చప్పట్లు కొట్టింది.

గుజరాత్‌లో మూడుసార్లు అఖండ మెజారిటీతో, వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికలలో లభించిన మద్దతుతో ఇది సాధ్యమైందని, ఇది ప్రధాని మోడీపై ప్రజలు ఉంచిన అచంచలమైన విశ్వాసానికి నిదర్శనమని మంత్రివర్గ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాతో అన్నారు.

"ప్రపంచంలోని అతి కొద్ది దేశాల్లో మాత్రమే ప్రజలు ఒక నాయకుడికి నిరంతరం మద్దతు ఇస్తారు" అని ప్రధాని మోడీ సాధించిన ఘనతను విశిష్టమైనదిగా అభివర్ణిస్తూ వైష్ణవ్ అన్నారు.

"ఆ విశ్వాసం ఆయన పనితీరు, సరైన విధానాలు, స్వచ్ఛమైన ఉద్దేశాల నుండి వచ్చింది" అని పేర్కొన్నారు.

### జీరో యాక్సిడెంట్

# రోడ్లు నిర్మిద్దాం

>> రోడ్డు సేఫ్టీ సమావేశాలు నిర్వహించి ప్రమాదాలను విశ్లేషించాలని, బ్లాక్ స్పాట్లను గుర్తించి జిల్లా స్థాయిలో తగిన నివారణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. రహదారిపై ఒక్క మరణం లేదా తీవ్ర గాయం కూడా ఆమోదయోగ్యం కాదన్న ఆలోచనను భారత పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఆస్ట్రేలియా అనుసరిస్తున్న సేఫ్ సిస్టమ్ విధానం మానవ తప్పిదాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, వాహనాలు, వేగ పరిమితులను రూపొందిస్తోందని చెప్పారు. అమెరికా ఫెడరల్ హైవే అడ్మినిస్ట్రేషన్ అనుసరిస్తున్న రోడ్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్‌లు, సాంకేతిక మార్గదర్శకాలను కూడా భారత రహదారుల పరిస్థితులకు అనుగుణంగా స్వీకరించవచ్చన్నారు.

కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ నిర్దేశించిన విధంగా 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించే జాతీయ లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని రాష్ట్రాలు కలిసి పనిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. దేశంలో రోడ్డు ప్రమాద మరణాలు ఆందోళనకరం మారాయని అన్నారు. 2023లో దేశవ్యాప్తంగా 1,72,890 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని మంత్రి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 23,652 మంది, తమిళనాడులో 18,347 మంది, మహారాష్ట్రలో 15,366 మంది, మధ్యప్రదేశ్‌లో 13,798 మంది, కర్ణాటకలో 12,321 మంది మరణించారని చెప్పారు.తెలంగాణలో 2023లో 7,660 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, ఇది దేశవ్యాప్తంగా నమోదైన మరణాల్లో 4.4 శాతంగా ఉందన్నారు. దేశంలోని మొదటి పది రాష్ట్రాల్లోనే దాదాపు 74 శాతం రోడ్డు ప్రమాద మరణాలు నమోదవుతున్నాయని తెలిపారు.హైదరాబాద్ విజయవాడ విబీ 65 రహదారి పై నిత్యం జరుగుతున్న ప్రమాదాలపై ఈ సమావేశంలో మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 17బ్లాక్ స్పాట్స్ గుర్తించి ఫ్లై ఓవర్లు నిర్మాణం జరుగుతున్నా... ప్రస్తుతం ఉన్న 4 లేన్ రహదారిపై ట్రాఫిక్ లోడ్ విపరీతంగా పెరిగిందన్నారు. 6+2 లేన్ల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రహదారి విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉన్నదని మంత్రి పేర్కొన్నారు. ఈ రోజు మనం నిర్మించే ప్రతి కిలోమీటర్ రహదారి.. రాబోయే తరాలకు కూడా సురక్షితంగా ఉండాలి. ప్రమాణాల నుంచి అమలుకు.. అమలు నుంచి మెరుగైన పనితీరుకు మన ప్రయాణం కొనసాగాలి" అని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ ఐఎస్ , చీఫ్ ఇంజినీర్ (నేషనల్ హైవేస్) ధర్మారెడ్డి, చీఫ్ ఇంజినీర్ వసంత్ నాయక్, చీఫ్ ఇంజినీర్‌బి. వెంకటేశ్వరరావు,పలువురు అధికారులు పాల్గొన్నారు.

# విశ్రమించం

>> ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. అస్తవ్యస్తంగా మారిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సర్ రద్దు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు కాంగ్రెస్ పార్టీ విశ్రమించబోదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టులా మారిన .. సర్.. రద్దు కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ..ఓటు బచావో, దేశ్ బచావో(ఓటును రక్షి ద్దాం.. దేశాన్ని రక్షి ద్దాం).. ఉద్యమంలో భాగంగా అహింసాయుతంగా ఆందోళన చేస్తున్న విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్, ఇండియా కూటమి ఎంపీలను ఢిల్లీలో అరెస్టు చేయడాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య, చట్ట విరుద్ధమైన ఈ అరెస్టులు బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శమని సీఎం పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనూ స్వల్ప కారణాలకే మహాత్మా గాంధీ, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ పటేల్ వంటి నేతలను నాటి వలస ప్రభుత్వం అరెస్టు చేసేదని, ఇప్పుడు బ్రిటిష్ జనతా పార్టీ (బీజేపీ) కూడా అలానే రాహుల్ గాంధీని అరెస్టు చేసిందని సీఎం విమర్శించారు.అక్రమ అరెస్టులు, జైళ్లు కాంగ్రెస్ నేతలకు కొత్త కాదని సీఎం అన్నారు. ప్రతి ఒక్కరి ఓటు హక్కును, దేశ ప్రజాస్వామిక వ్యవస్థను, దేశ భవిష్యత్తును రక్షి ంచుకునేందుకు ప్రజలు, యువత రాహుల్ పోరాటంలో స్వచ్ఛందంగా భాగస్వాములవుతున్నారనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని సీఎం హెచ్చరించారు. అక్రమ అరెస్టులు, జైళ్లు, లాఠీఛార్జీలు కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న ఉద్యమాన్ని అణిచివేయలేవని, తమ పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తాయని సీఎం తెలిపారు.

## ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్‌కృష్ణారెడ్డికి బెయిలు, విడుదల

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** సహచర మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిని లైంగికంగా వేధించిన ఘటనలో అరెస్టయి 70 రోజులపాటు చంచల్‌గూడ జైల్లో రిమాండులో ఉన్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణా రెడ్డికి ఎట్టకేలకు బెయిల్ మంజూరు చేసింది. రూ. 25 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలను సమర్పించాలని ఆదేశిస్తూ ఉప్పర్ పల్లి కోర్టు అతనికి మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. దీంతోపాటు ప్రతీ ఆదివారం ఈ కేసు విచారణ చేస్తున్న అత్తాపూర్ పోలీసుల ఎదుట హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. రాత్రి ఆయన విడుదలయ్యారు. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారం గురించి తెలిసిందే. ఎపిలోని ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి కానిస్టేబుల్‌గా ఉద్యో గం చేస్తూనే యుపిఎస్‌సి పరీక్షలు రాసి ఐపిఎస్‌కు ఎంపికవడంతో దేశ వ్యాప్తంగా అతని పేరు మారుమోగింది. ఈ నేపథ్యంలో అతన్ని ఎపి సిఎం చంద్రబాబుసహా పలువురు అభినందించారు. 2025 బ్యాచ్‌కు చెందిన ఉదయ్ కృష్ణారెడి శివార్లలోని జాతీయ పోలీసు అకాడమిలో శిక్షణలో ఉం డగా కర్ణాటకకు చెందిన సహచర మహిళా ఐపిఎస్ అధికారిని లైంగికంగా వేధించడంతోపాటు అసభ్య మెసేజ్‌లు పంపడం, ఆమె భర్తకు కొన్ని ఫొటో లు పంపడంతో బాధితురాలు గత జూలై నెల 18న అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు దరిమిలా ఉదయ్ కృష్ణారెడ్డిని అకాడమి నుంచి సస్పెండ్ చేయగా మరుసటిరోజు అతను హైదరా బాద్‌లోని ఎస్ఆర్‌నగర్‌లో తన స్నేహితుడి ఇంట్లో అతిగామద్యం తాగి అనారోగ్యానికి గురవడంతో ఆసుపత్రి పాలయ్యాడు. దీని తరువాత అతను వున్నట్లుండి అజ్ఞాతంలో వెళ్లగా జూలై 28న పోలీసులు అరెస్టు చేసి మరుసటిరోజు కోర్టులో హాజరు పరిచి చంచ ల్‌గూడ జైలుకు రిమాండుకు తరలించారు. అప్పటి నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి జైల్లో వుండగా అతని తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్లు డిస్మిస్ అయ్యాయి. ఇదే సమయంలో రెండుసార్లు అతన్ని పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారణచేసి లైంగిక వేధింపులపై వివరాలు సేకరించారు.



దోపిడీకి గురైన ఏటిఎం వద్ద ఆధారాలను సేకరిస్తున్న పోలీసులు

## శంషాబాద్‌లో ఏటిఎం చోరీ

### 30 లక్షలకుపైగా నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

**శంషాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త :** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని శాతంరాయి వద్ద యాక్సిస్ బ్యాంక్ ఏటిఎంలో భారీ చోరీ జరిగింది. అర్ధరాత్రి సమయంలో ఏటీఎం కేంద్రంలోకి చొరబడిన గుర్తుతెలియని దుండగులు గ్యాస్ కట్టర్లతో మిషన్‌ను ధ్వంసం చేసి అందులోని రూ.30 లక్షలకు పైగా నగదును ఎత్తుకెళ్లినట్లు ప్రాథమికంగా సమాచారం. చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన బ్యాంకు అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో శంషాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. ఏటిఎం వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరి శీలిస్తున్నారు. దుండగులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**పగటిపూట మాత్రమే సెక్యూరిటీ**

సాతంరాయిలో గల యాక్సిస్ బ్యాంకు ఏటిఎంలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. అయితే ఏటిఎం వద్ద జరిగిన ఘటనపై సెక్యూరిటీ గార్డ్ మాట్లాడారు. తాను ఉ.8:30 గంటలకు విధుల్లోకి వచ్చానని, ఈ ఘటన రాత్రి 12 తర్వాత జరిగిందని తెలిపారు. పగటిపూట మాత్రమే సెక్యూరిటీ ఉంటుందని, అనేకమంది వస్తుంటారని పేర్కొన్నారు.

## ఎసిబికి పట్టుబడిన నలుగురికి రిమాండు

### చంచల్‌గూడ జైలుకు తరలింపు

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** లంచం తీసుకుంటూ ఎసిబికి సోమవారం సాయంత్రం వేళ పట్టుబడ్డ నలుగురు సర్కారీ విభాగాల అ ధికారులకు నాంపల్లి ఎసిబి కోర్టు రిమాండు విధించింది. వీరిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్‌ఓ డాక్టర్ స్వర్ణ కుమారి, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాస్, కారు డ్రైవర్ కృష్ణయ్యలు శివార్లలోని శివరాంపల్లిలో గల డిఎంహెచ్ ఓ కార్యాలయంలో అనధికారికం గా ఫిజియోథెరఫీ నిర్వహిస్తున్న వ్యక్తి నుంచి లక్ష రూపాయల లంచం తీసుకుంటూ దొరికి పోవడం తెలిసిందే. మరో ఘటనలో మెహదీపట్నం వద్ద గోల్కొండ జోన్ బల్దియా టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీత అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణదారుడి నుంచి నాలుగు లక్షల రూపా యలతో పట్టుబడడం విదితమే. ఆమె కారులో లెక్కలోలేని మరో రెండున్నర లక్షల రూపాయలు కూడా పట్టుబడ్డాయి. రెండు ఘటనల్లో అరెస్ట యిన నలుగురిని ఎసిబి అధికారులు సోమవారం రాత్రి వరకు నాంపల్లిలోని ఎసిబి కార్యాలయంలో విచారించి అనంతరం ఎసిబి కోర్టు న్యాయ మూర్తి ఇంటి ఎదుట హాజరు పరిచారు. ఈ కేసులను విచారించిన న్యాయమూర్తి నలుగురికి రిమాండు విధించారు. అనంతరం నలుగురిని చం చల్ గూడ జైలుకు తీసుకువెళ్లిన ఎసిబి అధికారులు స్వర్ణలతను మహిళా జైలుకు మిగతా ముగ్గురిని సాధారణ జైలుకు తరలించారు.




మీడియాతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ అధికార ప్రతినిధి, సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిషాంక్

## మన్నె క్రిషాంక్ అరెస్ట్

### రిమాండ్ తిరస్కరించిన కోర్టు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), అక్టోబరు 6, ప్రభాతవార్త:** సికిందరాబాద్ సంగీత్ చౌరస్తాలోని మెడికవర్ ఆసుపత్రి వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుమార్తె, అల్లుడికి సంబంధించిన పలు సంస్థల్లో 13 వేల కోట్ల ఆస్తులలో వాటాలు ఉన్నాయని బ్యానర్లు వెలిశాయి. దీంతో గోపాలపురం పోలీసులు, బిఆర్ఎస్ అధికారప్రతినిధి సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిషాంక్‌పై కేసులు నమోదు చేసి క్రిషాంక్‌ను మంగళవారం సికింద్రాబాద్ కోర్టులో హాజరు పరిచారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేలు, పద్మారావు గౌడ్, వివేకానంద్, పాడి కౌశిక్ రెడ్డి, బాల్క సుమన్, ఎమ్మెల్సీ దాసోజ్ శ్రావణ్, మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్, బిఆర్ఎస్ నేతలు తలసాని సాయికిరణ్, యాదవ్, రామేశ్వర్ గౌడ్, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్జెల నాగేశ్, టీ.ఎన్.శ్రీనివాస్, షర్వీన్, నారాయణ, దేవులపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నెక్రిషాంక్‌ను కోర్టులో హాజరు పర్చడంతో విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు పెద్ద సంఖ్యలో సికిందరాబాద్ కోర్టుకు వచ్చి క్రిషాంక్‌కు సంఘీభావం తెలిపారు.

# జిడిపి వృద్ధి అంచనా 7.1 శాతం

### మొదటి త్రైమాసికంలో అంచనాలకు మించి వృద్ధి నమోదు

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** భారత్ ఆర్థిక వ్యవస్థపై ప్రపంచ బ్యాంక్ సానుకూల అంచనాను వెల్లడించింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత్ స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటు 7.1 శాతంగా ఉండవచ్చని అంచనా వేసింది. గత ఏప్రిల్‌లో ప్రకటించిన 6.6 శాతం అంచనాను తాజాగా 0.5 శాతం పెంచింది. మొదటి త్రైమాసికంలో అంచనాలకు మించి వృద్ధి నమోదు కావడం, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగడం వంటి అంశాలు వృద్ధి అంచనాను పెంచడానికి ప్రధాన కారణాలని ప్రపంచ బ్యాంక్ తన తాజా ఇండియా డెవలప్‌మెంట్ అప్‌డేట్‌లో పేర్కొంది. వాణిజ్య, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు ఉన్నప్పటికీ ఆర్థిక వృద్ధి అంచనాల కంటే మెరుగ్గా కొనసాగుతోంది. అందుకే వృద్ధి అంచనాను 6.6 శాతం నుంచి 7.1 శాతానికి పెంచామని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. భారత్ ఆర్థిక వృద్ధి 2025లో నమోదైన 7.2 శాతం నుంచి 2026లో 7.8 శాతానికి పెరిగింది. బలమైన పెట్టుబడులు, స్థిరమైన ప్రైవేట్ వినియోగం ఇందుకు ప్రధానంగా దోహదపడ్డాయి. అనుకూల విధానాలు, మెరుగైన రుణ లభ్యత వాణిజ్యపరమైన ఉద్రిక్తతల ప్రభావాన్ని అధిగమించేందుకు ఆర్థిక వ్యవస్థకు తోడ్పడ్డాయని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. బలమైన దేశీయ డిమాండ్, ఎగుమతుల్లో మెరుగుదల భవిష్యత్తులో భారత ఆర్థిక వృద్ధికి కీలకంగా మారనున్నాయని నివేదిక తెలిపింది. తాజా అంచనాల నేపథ్యంలో ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ తన బలమైన స్థానాన్ని కొనసాగించనుంది. అయితే భారత్ ఆర్థిక వ్యవస్థకు కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయని ప్రపంచ బ్యాంక్ హెచ్చరించింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు భారీగా పెరగడం, ఎల్‌నినో ప్రభావం, స్టాక్ మార్కెట్లలో పతనం వంటి అంశాలు ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపింది. ఈ పరిణామాలు విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయ మూలధన ప్రవాహాల్లో హెచ్చుతగ్గులకు దారి తీయవచ్చని పేర్కొంది. వృద్ధి అంచనాలు మెరుగుపడినప్పటికీ, అంతర్జాతీయ పరిస్థితులను నిశితంగా పరిశీలించడం అవసరమని సూచించింది. జూలై నుంచి సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవడంతో రుతుపవనాల లోటు కొంత తగ్గిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. అయితే మొత్తం నైరుతి రుతుపవనాల కాలంలో వర్షపాతం లోటు వ్యవసాయ రంగం అంచనాలను బలహీనపరిచిందని పేర్కొంది. కృత్రిమ మేధస్సు భారత్‌కు భవిష్యత్తులో కొత్త వృద్ధి ఇంజిన్‌గా మారే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. ఏఐను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్న ప్రపంచంలోని టాప్10 అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో భారత్ ఒకటిగా ఉందని నివేదిక పేర్కొంది. భారత్‌లో ప్రైవేట్ రంగ ఏఐ పెట్టుబడులు వేగంగా పెరుగుతున్నాయి. 2024లో 1.2 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ పెట్టుబడులు 2025లో 4.1 బిలియన్ డాలర్లకు చేరాయి. అంటే ఒక్క ఏడాదిలో మూడు రెట్లకు పైగా పెరిగాయి. అదే సమయంలో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లలో పనిచేస్తున్న నిపుణుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2024లో 19 లక్షలుగా ఉన్న వారి సంఖ్య 2025లో 23.6 లక్షలకు చేరినట్లు ప్రపంచ బ్యాంక్ తెలిపింది.




## మున్సిపల్ శాఖలో 886 ఉద్యోగాలు

### కొత్త పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** మున్సి పల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ పరిధిలోని నూతన పురపాలికల్లో పరిపాలనా వ్యవస్థను పటిష్టం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో 886 ఉద్యోగాల భర్తీకి కసరత్తు ప్రారంభించింది. ఇందుకుగాను దీనికి సంబంధించిన కొత్త పోస్టుల ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి కార్యాలయం సైతం అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలో కొత్తగా 24 మున్సిపాలిటీలను ఏర్పాటు చేసింది. వీటితో పాటు, కొన్ని పాత మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ చేసింది. అయితే, ఈ కొత్త పట్టణ స్థానిక సంస్థల్లో సరిపడా శాశ్వత సిబ్బంది లేకపోవడంతో ప్రస్తుతం ఇతర శాఖల ఉద్యోగులను డెప్యుటేషన్‌పై తీసుకొచ్చి పాలన కొనసాగిస్తున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అధికారులు సమగ్ర నివేదిక రూపొందించి 886 పోస్టుల అవసరాన్ని సంబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో ఈ ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ ఒకే చెప్పింది. ఆర్థిక శాఖ అనుమతించిన ఈ పోస్టుల్లో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలకు 11 డిప్యూటీ కమిషనర్ల పోస్టులు, 86 జూనియర్ అసిస్టెంట్లు, 56 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, 40 హెల్త్ అసిస్టెంట్లు, 40 జూనియర్ అకౌంటెంట్లు, 40 సీనియర్ అకౌంటెంట్లు పోస్టులు ఉన్నాయి. అలాగే వీటితో పాటు, సాంకేతిక, పరిపాలనా విభాగాల్లోని పలు ఇతర పోస్టులు కూడా ఈ రిక్రూట్‌మెంట్‌లో ఉన్నాయి. కాగా రానున్న మంత్రివర్గ సమావేశంలో ఈ ఉద్యోగాల ప్రతిపాదనలపై అధికారికంగా చర్చించి తుది ఆమోదం తెలపనున్నారు. క్యాబినెట్ ఆమోదం లభించిన వెంటనే అధికారులు రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఆ జాబితాను పంపనున్నారు. అన్ని ప్రక్రియలు వేగంగా పూర్తి చేసి, వచ్చే జనవరిలో సమగ్ర ఉద్యోగ నోటిఫికేషన్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆర్థిక శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

## ప్రజా సమస్యలు గాలికొదిలేసారు

### బిఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఆస్తుల చిట్టాలు బయట పెట్టుకుంటున్నారు

### బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్య



**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పరిణామాలను చూస్తుంటే కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలేశాయని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు ఎంత దోచుకున్నారంటూ ఇరు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు ఆస్తుల చిట్టాలు బయటపెట్టుకుంటుంటే ప్రజలు నివ్వెర పోతున్నారని ఆయన పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన దోపిడీ, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న లక్షల కోట్ల రూపాయల భూదోపిడీపై భారతీయ జనతా పార్టీ ఆది నుంచీ రాజీలేని పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు. అసెంబ్లీ సాక్షి గా మంత్రులు, విప్‌లు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు బిజెపి నేతలపైకి దూసుకొచ్చి అడ్డుకున్నా, మైకులు కట్ చేసినా, చివరకు సభను వాయిదా వేసే పరిస్థితి తెచ్చినా సరే బిజెపి ప్రజాపక్షాన గళమెత్తి వాస్తవాలను బయట పెట్టిందని గుర్తుచేశారు. ప్రొహిబిటెడ్ లిస్ట్ 22ఏ, ధరణి, భూభారతి పేర్లతో గత, ప్రస్తుత ప్రభుత్వాలు సాగించిన భూదోపిడీ కుంభకో ణాలను అ సెం బ్లీలో ఆధారాలతో సహా నిలదీ యడంతోనే చివరకు సిఎం, మంత్రులు సమాధానం చెప్పుకోలేక చేతులెత్తేశారని ఆయన విమర్శించారు. రామాయణం, భాగవతం కంటే పెద్ద కథలుగా చెప్పుకునేలా గత బిఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాల అవినీతి బాగోతం సాగిందని మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. ధరణిపై చేపట్టిన ఫారెన్సిక్ ఆడిట్ రిపోర్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు తొక్కిపెట్టిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ దోపిడీని బయటపెడితే తమ అవినీతి బండారం ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతోనే రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నివేదికను తొక్కిపెట్టిందని ఆరోపిం చారు. గత ప్రభుత్వ పాపాలను కప్పిపుచ్చుతూ, చీకటి ఒప్పందాలు, లోపాయికారీ అవగాహన లతోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. బిఆర్ఎస్ నేతలు సీఎం కుటుంబ ఆస్తుల చిట్టాను బయటపెడితే, ముఖ్యమంత్రి స్వయంగా కెటిఆర్ ఆస్తుల చిట్టాను బయటపెట్టారని, అయితే వీరు పరస్పరం బయటపెట్టుకున్నది అసలు దోపిడీలో కేవలం ఒక శాతం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. లక్షల కోట్ల రూపాయల భూకుంభకోణాల పూర్తి నిజాలు వెలుగులోకి రావాలంటే తక్షణమే ఫారెన్సిక్ ఆడిట్ రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టి, ప్రజా బాహుళ్యంలో ఉంచాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ముఖ్యమంత్రి చిన్న చిన్న మెమోలు జారీ చేస్తూ.. 22ఏ నిషేధిత జాబితా నుంచి కొన్ని కాలనీలను, భూములను బయటకు తీశామని, రిజిస్ట్రేషన్ల వెసులుబాటు కల్పించామని ప్రగల్భాలు పలుకుతున్నారని దుయ్యబట్టారు. నాలుగు కాలనీలకు మెమోలిచ్చి సమస్య పరిష్కారమైందని చేతులు దులుపుకుంటే సరిపోదని, లక్షల ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు అన్యాక్రాంతమైన ఈ సమగ్ర వ్యవహారంలో బాధితులకు శాశ్వత న్యాయం జరగాలంటే గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల భూకుంభకోణాలపై తక్షణమే కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వంలో భూమాఫియా విచ్చలవిడిగా బరితెగించిందని, రెండు రోజుల క్రితం కూకట్‌పల్లి సర్వే నంబర్ 1007లో రూ.50 వేల కోట్ల విలువైన భూమిని కాజేయడానికి అధికార పార్టీ బినామీ కంపెనీ ప్రహరీ గోడ కట్టే దుస్సాహసానికి ఒడిగట్టిందని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు.

## గ్రేటర్ పరిధిలో మెడికల్ షాప్‌లపై టిజి సేఫ్ దాడులు

### భారీగా అక్రమాల గుర్తింపు

### వైద్యుల సిఫార్సు లేకుండా మందుల విక్రయం

### 111 మందుల దుకాణాలకు నోటీసులు

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** కల్తీ ఆహార వస్తువులతో పాటు నకిలీ మందులపై ఉక్కుపాదం మోపేందుకు సర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) మంగళవారం నాడు గ్రేటర్ పరిధిలో పెద్ద సంఖ్యలో మెడికల్ షాపులపై దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా అనేకచోట్ల భారీగా అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించగా వైద్యుల సిఫార్సు లేకుండా కీలక డ్రగ్స్ అమ్ముతున్నట్లు తేలింది. చార్మినార్, మెహదీపట్నం, టోలిచౌకి, మలక్‌పేట్, గోషామహల్ జోన్ల పరిధుల్లో ఈ దాడులు జరిగాయి. ఈ దాడుల్లో టిజి సేఫ్ అధికారులతో పాటు స్థానిక పోలీసులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రెమ డోల్, టపెంటడోల్, నిట్రాజాపం, ప్రెగ పిన్, జోల్‌పిడెన్, అల్ప్రాజోలం మాత్రలతో పాటు కొడైన్ సిరప్‌ను వైద్యుల సిఫార్సు లేకుండా ఇష్టం వచ్చినంతగా అమ్ముతున్నట్లు తేలింది. మె దడు సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ మందులను వైద్యుల సిఫార్సు మేరకు కొంతమేర అమ్మాల్సి వుండగా నిర్వాహకులు ఇ ష్టం వచ్చినట్లు, తమకు నచ్చిన వారికి ఎంత కావాలంటే అంత అమ్మేస్తున్నారు. తీవ్రమైన దగ్గుతో బాధపడే వారు కొంతమేరకే వాడాల్సిన కొడై న్ సిరప్‌ను మందు బాబులకు, డ్రగ్స్ వ్యసనపరులకు అమ్ముతున్నారు. దీనికి సంబంధించి మొత్తం 111 మెడికల్ షాపులకు టిజి సేఫ్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అక్రమాలతో పాటు అక్రమంగా విక్రయిస్తున్న ఔషధాలపై వెంటనే వివరణ ఇవ్వాలని అందులో కోరారు. వివరణ స రిగ్గా లేకుంటే లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న టిజి సేఫ్ అధికారులు

## క్యూర్ ప్రాంతంలో ప్రకటనలపై సర్కార్ కొత్త నిబంధనలు

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) ప్రాంతంలో తాత్కాలిక, హైపర్ లోకల్ (యాడ్స్) ప్రకటనలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నిబంధనల ప్రకారం ప్రతి వార్డుకు ఒక అడ్వర్టైజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్‌ను నియమించనున్నారు. తాత్కాలిక ప్రకటనలకు గరిష్ఠంగా 3 రోజులు మాత్రమే అనుమతి ఇవ్వనున్నారు. అలాగే హైపర్ లోకల్ ప్రకటనలకు గరిష్ఠంగా 7 రోజులపాటు అనుమతి ఉండనుంది. మైక్యూర్ లేదా అడ్వర్టైజింగ్ యాప్ ద్వారా 7 రోజు ముందే స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఒక మొబైల్ నంబర్‌తో ఒక సమయంలో ఒకే స్లాట్ మాత్రమే బుక్ చేయడానికి అనుమతి ఉంటుంది. బుక్ చేసిన ప్రతి ప్రకటన కుడి దిగువన క్యూర్ కోడ్, ఎడమ దిగువన ప్రింటర్ ఐడీ తప్పనిసరిగా ముద్రించాలి. నోడల్ అధికారి వీటిని స్కాన్ చేసి ధ్రువీకరించిన తర్వాత ఆ వివరాలను సంబంధిత పోలీసులకు పంపుతారు.

5 నుంచి 10 హైపవర్ లోకల్ ప్రకటనల కోసం 25 నుంచి 50 స్థలాలను గుర్తిస్తారు. ఈ స్థలాలను సంబంధిత సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పరిశీలించి ఆమోదిస్తారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసే యాడ్స్‌ను వెంటనే తొలగించడంతో పాటు జరిమానా విధించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. పబ్లిక్ ప్రాపర్టీ, చెట్లు, విగ్రహాలు, వారసత్వ కట్టడాలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లపై ప్రకటనలు ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. అదేవిధంగా ట్రాఫిక్, పాదచారుల మార్గాలు, సిగ్నల్స్, సీసీటీవీ ఉన్న ప్రదేశంలో ఆటంకం కలిగించేలా యాడ్స్ పెట్టరాదని ఆదేశించింది.

అనుమతి లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసే ప్రకటనలను మున్సిపల్, పోలీస్, హైడ్రా అధికా రులు వెంటనే తొలగిస్తారు. ఉల్లంఘనలకు పాల్పడితే చలాన్‌తో పాటు తొలగింపు ఖర్చులను కూడా దరఖాస్తుదారుడి నుంచే వసూలు చేస్తారు.

నిబంధనలను మళ్లీ మళ్లీ ఉల్లంఘించే ఏజెన్సీలు లేదా వ్యక్తులను బ్లాక్‌లిస్ట్ చేసే అవకాశం కూడా ఈ కొత్త మార్గదర్శకాల్లో పొందుపరిచారు. కొత్త మార్గదర్శకాల అమలు బాధ్యతలను జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎమ్ఎమ్‌సీ కమిషనర్లకు తెలంగాణ ప్రభుత్వం అప్పగించింది.

## భీంగల్ బంద్ ప్రశాంతం

### టీ స్టాల్ యజమాని ఆత్మహత్యకు నిరసన

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి గృహనిర్బంధం

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో టీ స్టాల్ యజమాని సుధాకర్ ఆత్మహత్యకు నిరసనగా బిఆర్ఎస్ పిలుపు మేరకు మంగళవారం జరిగిన భీంగల్ పట్టణ బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని గృహనిర్బంధం చేయగా, భీంగల్‌లో ఆందోళన నిర్వహించిన బిజెపి నేతలను పోలీసులు అడ్డుకు న్నారు. మరోవైపు టీ స్టాల్ యజమాని ఆత్మహత్యకు ఎస్ఐ తిరుపతి కారణమని, దీనిపై విచారణ చేయాలని బిఆర్ఎస్ నేతలతోపాటు మృతుడి కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు.

భీంగల్ పాత బస్టాండు వద్ద టీ స్టాల్ నిర్వహించే సుధాకర్‌కు అర్ధరాత్రి వరకు వ్యాపారం చేసినందుకు పోలీసులు పెటికేసు కింద జరిమానా విధించగా, దీనికి నిరసనగా అతను సోమవారం ఉదయం భీంగల్ పోలీసు స్టేషన్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడడం తెలిసిందే. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపడం విదితమే. సుధాకర్‌ను కాపాడేందుకు పోలీసులు విఫలయత్నం చేశారు. ఆసుపత్రిలో అతను చనిపోగా దీనిపై బిఆర్ఎస్ నేతలు భగ్గుమన్నారు. పోలీసుల వేధింపుల కారణంగానే సుధాకర్ ఆత్మ హత్యకు పాల్పడ్డాడని వారు ఆరోపించారు. భీంగల్ ఎస్ఐ తిరుపతి ఇదంతా చేసినట్లు వారు తెలిపారు.

ఈ ఘటనకు నిరసనగా మంగళవారం భీంగల్ బంద్‌కు పిలుపునిచ్చిన బిఆర్ఎస్ నేతలు ఇందుకు అందరు సహకరించాలని కోరారు. దీంతో పోలీసులు అప్రమత్తమై స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని గృహనిర్బంధం చేశారు. దీంతో పాటు భీంగల్‌లో బిజెపి నేతలు నిరసనకు దిగగా వారిని నిలువరించారు. అయినప్పటికీ బిఆర్ఎస్ స్థానిక నేతలు సుధాకర్ ఫొటోను ప్రదర్శనగా ఉంచి పోలీసుల తీరును నిరసిస్తూ ఆందోళన చేశారు. సుధాకర్ కుటుం బానికి న్యాయం చేయాలని బిఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని వారు కోరారు. మరోవైపు భారీ బందోబస్తు మధ్య సుధాకర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా ఈ ఘటనపై నిజామా బాద్ కమిషనర్ సాయిచైతన్య మీడియాతో మాట్లాడుతూ సుధాకర్ ఆత్మహత్య చేసుకోవడంలో తమ సిబ్బంది ప్రమేయం ఏమీలేదని తెలిపారు.

## అన్ని పథకాలకు డిజిటల్ క్రాప్ బుకింగ్

### ఖరీఫ్‌లో 128.18 లక్షల యూరియా సరఫరా

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ రంగంలో అన్ని పథకాలకూ డిజిటల్ క్రాప్ బుకింగ్‌ను అమలు చేయనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో భవిష్యత్తులో ఈ సర్వే ఆధారంగానే పంటల కొనుగోళ్లు, యాంత్రీకరణ, సబ్సిడీపై విత్తనాల పంపిణీ వంటి అన్ని పథకాలు వర్తింప చేస్తామని చెప్పారు. పంటల సాగు, విస్తీర్ణానికి సంబంధించి ఖచ్చితమైన సమాచారం డిజిటల్ విధానంలో అందుబాటులో ఉంటే, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులైన రైతులకు మరింత సమర్థవంతంగా అందించవచ్చన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత రాకుండా పంపిణీ చేశామని తెలిపారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా ముందస్తుగానే స్టాక్స్‌ను పొజిషన్ చేయడంతో పాటు, షిప్‌యార్డుల వద్ద అధికారులను నియమించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేశామని చెప్పారు. కేంద్రం తెచ్చిన ఫెర్టిలైజర్ యాప్ ద్వారా ఎరువుల నిల్వ, బుకింగ్, కొనుగోలు తదితర వివరాలను పర్యవేక్షి ంచే అవకాశం ఏర్పడిందన్నారు.

జాతీయ ఫెర్టిలైజర్ యాప్ ప్రారంభ దశలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తాయన్నారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాల మ్యాపింగ్ పూర్తిగా అందుబాటులో లేకపోవడం వల్ల అక్కడక్కడా ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. యాప్ ద్వారా యూరియా మరియు ఎరువులు పంపిణీ చేయడంతో బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు తగ్గి, గత సీజన్ కంటే 35 వేల టన్నుల యూరియాను తక్కువగా వాడినట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2.33 లక్షల టన్నుల యూరియా నిల్వ ఉండగా, గత ఏడాది ఇదే సమయంలో కేవలం 50 వేల టన్నులు మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఈ నెలలో 2 లక్షల టన్నుల యూరియా సరఫరా లక్ష ్యం కాగా ఇప్పటివరకు 18 వేల టన్నులు సరఫరా అయినట్లు వివరించారు.

రైతులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని డిజి టల్‌గా అందుబాటులోకి తీసుకు రావడంలో తెలంగాణ ముం దంజలో ఉందన్నారు. ఖరీఫ్‌కు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వేలో ఇప్పటివరకు 1,93,25,309 వ్యవసాయ క్షేత్రాలను సర్వేకు కేటాయించగా, 1,46, 67,370 క్షేత్రాల సర్వే పూర్తయిందని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘ కార్యాలయము :: భువనగిరి
కొటేషన్ నోటీసు ప్రకటన
ఫైల్ నెం. ఇ1/19/2026-27, తేది: 06.10.2026
భువనగిరి పురపాలక సంఘం యందు స్టేడియం ఫ్లడ్ లైట్లు (Foundation, Rectangular Frame with lights and Spare parts etc.) ఏర్పాటు చేయించుటకు అంచనాలు తయారు చేయవలసియున్నది మరియు భువనగిరి పురపాలక సంఘమునకు సంబంధించిన ఆటోలు, ట్రాక్టర్ల బాడీ వెల్డింగ్ (మేజర్/మైనర్) పనులు చేయించవలసియున్నది. అందుకుగాను అథరైజ్డ్ డీలర్లు/సరఫరాదారులు/ఏజెన్సీలు/వెల్డింగ్ షాపుల యజమానుల నుండి ధరల వివరముల కొటేషన్లు కోరబడుచున్నవి. ఆసక్తి గల వారు తమ కొటేషన్లను తేది: 07.10.2026 నుండి 09.10.2026 వరకు భువనగిరి పురపాలక సంఘ కార్యాలయము యందు కార్యాలయ పనివేళలలో సమర్పించగలరు. పూర్తి వివరముల కొరకు మునిసిపల్ ఇంజనీర్: 9391634492/7780293683ను సంప్రదించగలరు.
DIPR.No.11284-PP/CL/Advt/1/2026-27, తేది: 06.10.2026 సం/- కమిషనర్, భువనగిరి మునిసిపాలిటీ

తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
ఇరిగేషన్ సర్కిల్, హిల్ కాలనీ, నల్లగొండ జిల్లా
నల్లగొండ జిల్లా, హిల్ కాలనీ, ఇరిగేషన్ సర్కిల్ నుండి టెండర్లు ఆహ్వానించుచున్నారు. టెండర్ నోటీసు నెం. 10SE/ICHC/ 2026-27, తేది: 05.10.2026, (3వ పిలుపు). పని పేరు: నల్గొండ జిల్లాలోని NSLBCపై 1.890 కి.మీ నుండి 73.800 కి.మీ వరకు వాలు ప్రాంతాలలో అడవిని తొలగించడం మరియు గుంతలను పూడ్చడం. అంచనా విలువ: రూ. 70,80,475/-. తేది: 07.10.2026 నుండి 14.10.2026 మ.3.00 గం. వరకు దరఖాస్తులు లభిస్తాయి మరియు చివరి తేది: 14.10.2026 సా.5.00 గం. వరకు స్వీకరిస్తారు. తదుపరి సమాచారము కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్‌ను సంప్రదించగలరు.
సం/- B.V. మల్లికార్జునరావు, పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, హిల్ కాలనీ
DIPR.No.11193-PP/CL/Advt/1/2026-27, తేది: 05.10.2026

వార్త

మేధావిలా ఆలోచిస్తూ, మాట్లాడినంత సహజంగా రాయగలిగినవాడే మంచి రచయిత.

- సోమర్‌సెట్ మామ్

# ఇసి విశ్వసనీయత పెంచుకోవాలి

ప్రజాస్వామ్యంలో ఓటు ఒక సాధారణ గుర్తుకాదు. అది ప్రజల సార్వభౌమాధికారానికి ప్రతీక. ఒక ఓటు విలువను రాజ్యాంగం గుర్తించింది. ఆ ఓటు ఎవరిది, ఎక్కడ నమోదు అయింది, ఎందుకు తొలగించబడింది, తిరిగి ఎలాపొందవచ్చు అనేఅంశాల్లో ఎటువంటి అయోమయానికి అవకాశం ఉండకూడదు. ఎన్నికలసంఘంపై విశ్వాసం తగ్గుతున్నదనే భావన ఏర్పడితే దాన్ని కేవలం రాజకీయ విమర్శగా చూడటం ప్రమాదకరం. ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం ఒకసారి దెబ్బతింటే దాన్ని తిరిగి నిర్మించడంచాలా కష్టం. అందుకే సమగ్ర ఆత్మపరిశీలన అవసరం.నియామక విధానం నుంచి ఓటర్ల జాబితాల నిర్వహణవరకు, నోటీసుల నుంచి అప్పీళ్ల పరిష్కారం వరకు, సాంకేతిక వ్యవస్థల నుంచి ప్రజాపారదర్శకత వరకు ఎన్నికల వ్యవస్థలోని ప్రతి అంశాన్ని సమీక్షించాల్సిన సమయం వచ్చింది. ఎన్నికల సంఘం బలంగా ఉండాలి. కానీ దాని బలం కేవలం చట్టబద్ధమైన అధికారాల్లో ఉండకూడదు. ప్రజల విశ్వాసంలో ఉండాలి.

తిప్పర్తి శ్రీనివాస్

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కేవలం ఓటు వేసే ప్రక్రియ కాదు. ప్రజలు తమ పాలకులను ఎన్నుకునే అత్యంత పవిత్రమైన రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ. ఆ ప్రక్రియను నిష్పాక్షికంగా, పారదర్శకంగా, విశ్వసనీయంగా నిర్వహించాల్సిన బాధ్యత భారత ఎన్నికల సంఘంపై ఉంది. ఎన్నికల ఫలితాలు ఏ పార్టీకి అనుకూలంగా వచ్చినా, ప్రతికూలంగా వచ్చినా, ఆ ఫలితాల వెనుక ఉన్న ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండటం అత్యంత అవసరం. ఆ విశ్వాసమే దెబ్బతింటే ఎన్నికల ఫలితాలకే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థ విశ్వసనీయతకు కూడా ముప్పు ఏర్పడుతుంది. ఇటీవలి కాలంలో ఓటర్ల జాబితాల సవరణ, ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన, ఓటర్ల పేర్ల తొలగింపు, ధ్రువీకరణకు సంబంధించిన పత్రాలు, నోటీసుల జారీ వంటి అంశాలపై ఎన్నికల సంఘం తీవ్ర చర్చకు కేంద్రంగా మారింది. ఓటర్ల జాబితాలో అనర్హుల పేర్లు ఉండకూడదు. మరణించిన వారి పేర్లు, నకిలీ నమోదులు, ఒకే వ్యక్తికి పలుచోట్ల నమోదులు వంటి లోపాలను తొలగించడం ఎన్నికల సంఘం బాధ్యతే. అయితే అదే సమయంలో అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించబడకూడదు. ప్రజాస్వామ్యంలో అనర్హుడి పేరును తొలగించడం ఎంత ముఖ్యమో, అర్హుడైన పౌరుడి ఓటు హక్కును కాపాడటం అంతకంటే ముఖ్యమైన బాధ్యత. ఇక్కడే ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసం అనే ప్రశ్న ముందుకువస్తుంది. ఒక సాధారణ పౌరుడి పేరు ఓటర్ల జాబితా నుంచి ఎందుకు తొలగించబడిందో అతనికే తెలియకపోతే, ఏ ఆధారంతో తన పేరు అనుమానాస్పదంగా గుర్తించబడిందో స్పష్టత లేకపోతే, తన హక్కును తిరిగి పొందేందుకు ఎక్కడికి వెళ్లాలో తెలియకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థపై అతనికి ఎలా విశ్వాసం కలుగుతుంది? ఎన్నికల సంఘం నిర్ణయం సరైనదేనని చెప్పడం మాత్రమే సరిపోదు. ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత కూడా ఉంది. ఇటీవల ఓటర్ల జాబితాల పునఃపరిశీలన సందర్భంగా పెద్ద సంఖ్యలో నోటీసులు జారీకావడం, వాటి వెనుక ఉన్న కారణాలపై ప్రశ్నలు తలెత్తడం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ఒక వ్యక్తి తన ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి వచ్చినప్పుడు, ఆ నిర్ణయం కేవలం ఒక అధికారిక నమోదు మార్పుగా చూడలేం. అది అతని రాజ్యాంగ బద్ధమైన హక్కుకు సంబంధించిన విషయం. పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితాల పునఃపరిశీలన అనంతరం తొలగించబడిన లక్షలాది మంది ఓటర్లు తిరిగి తమ పేర్లు చేర్చాలని కోరుతూ విజ్ఞప్తులు చేయడం కూడా వ్యవస్థలో ఏర్పడిన సమస్యల పరిమాణాన్ని తెలియజేస్తోంది. పెద్ద సంఖ్యలో అభ్యర్థనలు వచ్చినప్పుడు వాటిని త్వరగా పరిశీలించి, అర్హులైన వారి పేర్లను ఎన్నికలకంటే ముందే పునరుద్ధరించే వ్యవస్థ ఉండాలి. ఎన్నిక పూర్తయిన తర్వాత ఒకరి ఓటు హక్కును పునరుద్ధరించడం ద్వారా జరిగిన నష్టాన్ని పూర్తిగా భర్తీ చేయలేం. అందువల్ల ఎన్నికల సంస్కరణ అంటే కేవలం ఓటర్ల జాబితాలను శుద్ధి చేయడం కాదు. తప్పు జరిగితే దాన్ని గుర్తించడం, బాధితుడికి వెంటనే సమాచారం ఇవ్వడం, తన వాదన వినిపించే అవకాశం కల్పించడం, తప్పు జరిగిందని తేలితే వెంటనే సరిచేయడం కూడా ఎన్నికల సంస్కరణలో అంతర్భాగమే. ఎన్నికల సంఘం స్వతంత్రతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం కూడా ఉంది. ఎన్నికల సంఘం ఏ ప్రభుత్వానికీ, ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా లేదా ప్రతికూలంగా పని చేస్తుందనే అనుమానం కూడా ప్రజల్లో కలగకూడదు. ఎన్నికల కమిషనర్ల నియామక విధానంపై మరింత పారదర్శకత, విస్తృతమైన సంస్థాగత భాగస్వామ్యం ఉండాలి. నియామక ప్రక్రియపై ప్రజలకు స్పష్టత ఉంటే సంస్థపై



విశ్వాసం మరింత పెరుగుతుంది. అదే విధంగా ఎన్నికల సంఘం తీసుకునే కీలక నిర్ణయాలకు కారణాలు స్పష్టంగా నమోదు చేయాలి. ఒక ఓటరు పేరు తొలగిస్తే ఎందుకు తొలగించారు? ఒక వ్యక్తికి నోటీసు జారీచేస్తే దాని ఆధారం ఏమిటి? ఒక అభ్యంతరాన్ని తిరస్కరిస్తే దానికి కారణం ఏమిటి?వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి. లోపం ఉంది, సమాచారంలో వ్యత్యాసం ఉంది, వంటి అస్పష్టమైన కారణాలు ప్రజల అనుమానాలను మరింత పెంచుతాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎన్నికల ప్రక్రియలో విస్తృతంగా ఉపయోగించడం అవసరమే. అయితే సాంకేతిక వ్యవస్థను అంతిమ నిర్ణయాధికారిగా మార్చకూడదు. ఒక కంప్యూటర్ విధానం ఒక ఓటరును అనుమానాస్పదంగా గుర్తించవచ్చు. కానీ ఆ వ్యక్తి ఓటు హక్కును తొలగించే ముందు మానవ పరిశీలన తప్పనిసరిగా ఉండాలి. ఒక చిన్న సమాచార తప్పిదం ఒక పౌరుడి ఓటు హక్కును హరించే స్థాయికి వెళ్లకూడదు. మరో ముఖ్యమైన అంశం అప్పీల్ వ్యవస్థ. ఓటర్ల జాబితాలో పేరు తొలగించినవెంటనే సంబంధిత వ్యక్తికి సమాచారం అందాలి. తన పేరుఎందుకు తొలగించబడిందో తెలుసుకునే హక్కు ఉండాలి. తగిన ఆధారాలు సమర్పించుకునే అవకాశం ఉండాలి. నిర్ణయంతప్పుగా ఉంటే ఎన్నికలకు ముందే పేరు పునరుద్ధరించాలి. ఎన్నికల తర్వాత పరిష్కారం లభిస్తే అది ఆలస్యమైన న్యాయంగా మిగిలిపోతుంది. ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలతో పాటు పౌర సమాజ సంస్థలు, న్యాయ నిపుణులు, ఎన్నికల పరిశోధకులు, సమాచార సాంకేతిక నిపుణులు, ఓటర్ల హక్కుల పరిరక్షణ సంస్థలతో కూడా విస్తృతంగా చర్చలు జరపాలి. ఎన్నికల ప్రక్రియ ప్రజలది. అందువల్ల దాని రూపకల్పనలో ప్రజల అనుభవాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే ఎన్నికల సంఘంపై వచ్చే ప్రతి ఆరోపణను నిజమని అంగీకరించడం కూడా సరైన విధానం కాదు. రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా లేదా ప్రతికూలంగా వచ్చిన నిర్ణయాలను ప్రశ్నించడం సహజం. కానీ ఏ ఆరోపణ నిజమో, ఏది రాజకీయ విమర్శో నిర్ణయించేది ఆధారాలు, పారదర్శకత, న్యాయపరమైన పరిశీలనకావాలి. అందుకే ఎన్నికల సంఘం తన నిర్ణయాలను ఎంత స్పష్టంగా, ఆధారాలతో వివరిస్తే అంతగా అనుమానాలకు తావు తగ్గుతుంది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘం కేవలం ఎన్నికలు నిర్వహించే సంస్థకాదు. అది ప్రజల ఓటు హక్కుకు కాపలాదారు. ప్రభుత్వం మారవచ్చు. రాజకీయ పార్టీలు మారవచ్చు. అధికారంలో ఉన్న నాయకులు మారవచ్చు. కానీ ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం మాత్రం నిలకడగా ఉండాలి. ఎన్నికల ఫలితాలను ప్రతి ఒక్కరూ తమకు నచ్చినట్లుగా స్వీకరించాల్సిన అవసరం లేదు. కానీ ఎన్నికల ప్రక్రియ న్యాయంగా జరిగిందనే కనీస విశ్వాసం మాత్రం ఉండాలి. ఓడిపోయిన అభ్యర్థి కూడా ఫలితం తనకు అనుకూలంగా లేకపోయినా ప్రక్రియపై నమ్మకం ఉంచగలగాలి. గెలిచిన అభ్యర్థి కూడా తన విజయం ప్రజల తీర్పు వల్లనే వచ్చిందనే నమ్మకంతో ఉండాలి. ఇదే ప్రజాస్వామ్యానికి నిజమైన బలం. ఎన్నికల సంఘం పనితీరుపై ప్రజలకు సందేహాలు తలెత్తుతున్నప్పుడు వాటిని కొట్టిపారేయడం కంటే,ఆ సందేహాలకు పారదర్శకమైన సమాధానాలు ఇవ్వడం సంస్థాగత పరిపక్వతకు నిదర్శనం. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక సాధారణ గుర్తుకాదు. అది ప్రజల సార్వభౌమాధికారానికి ప్రతీక. ఒక ఓటు విలువను రాజ్యాంగం గుర్తించింది. ఆ ఓటు ఎవరిది,ఎక్కడ నమోదు అయింది, ఎందుకు తొలగించబడింది, తిరిగి ఎలా పొందవచ్చు అనే అంశాల్లో ఎటువంటి అయోమయానికి అవకాశం ఉండకూడదు. ఎన్నికల సంఘంపై విశ్వాసం తగ్గుతున్నదనే భావన ఏర్పడితే దాన్ని కేవలం రాజకీయ విమర్శగా చూడటం ప్రమాదకరం. ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం ఒకసారి దెబ్బతింటేదాన్ని తిరిగి నిర్మించడంచాలా కష్టం. అందుకే సమగ్ర ఆత్మపరిశీలన అవసరం. నియామక విధానం నుంచి ఓటర్ల జాబితాల నిర్వహణ వరకు, నోటీసుల నుంచి అప్పీళ్ల పరిష్కారం వరకు, సాంకేతిక వ్యవస్థల నుంచి ప్రజా పారదర్శకత వరకు ఎన్నికల వ్యవస్థలోని ప్రతి అంశాన్ని సమీక్షించాల్సిన సమయం వచ్చింది. ఎన్నికల సంఘం బలంగా ఉండాలి. కానీ దాని బలం కేవలం చట్టబద్ధమైన అధికారాల్లో ఉండకూడదు. ప్రజల విశ్వాసంలో ఉండాలి. ●

## ప్రజాస్వామ్యానికి చేటు కాలం!

భారత ప్రజాస్వామ్యానికి ఆలంబనగా నిలిచిన వేదిక. నిరసన తెలిపే హక్కుకు చివరి చిరునామా అదే జంతర్ మంతర్ వేదికపై జరిగిన శాంతియుత ఆందోళనపై ఢిల్లీ పోలీసులు ప్రదర్శించిన తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికే మాయని మచ్చ. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శనివారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల సందర్భంగా ముగ్గురు మహిళా జర్నలిస్టులపై పోలీసులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి.. ఈ ఘటనపై 'ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' తీవ్ర దిగ్భ్రాంతి, ఆందోళన వ్యక్తం చేసింది. 'ప్రజాస్వామ్యంలో ఇలాంటి ప్రవర్తనను సాధారణ విషయంగా పరిగణించలేం. జర్నలిస్టులు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తమ విధులను నిర్వర్తించేలా చూడాలి. దేశ రాజధాని నడిబొడ్డున ఇలాంటి ఘటనలు జరగడం మీడియా స్వేచ్ఛకు మంచిది కాదు' అని పీసీఐ నిర్ద్వందంగా ఖండించింది. ప్రశ్నించే హక్కును కాలరాయడం అంటే ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమే.! బాధితురాళ్లలో ఒకరైన మహిళా జర్నలిస్ట్, ఓ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ తనతో అనుచితంగా ప్రవర్తించారని, లైంగికంగా వేధించారని ఆరోపించారు. తాను పోలీసుల చర్యలను వీడియో తీస్తుండగా, ఆ అధికారి తనను అసభ్యంగా తాకి పక్కకు నెట్టేశారని ఆమె వాపోయారు. ఘటన అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, వెంటనే కేసు నమోదు చేయడానికి నిరాకరించారు. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ఢిల్లీ పోలీసులు ఆ ఫిర్యాదులను నిష్పక్షపాత విచారణ కోసం క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. మీడియా ప్రతినిధులు బెదిరింపులు లేకుండా పని చేసే వాతావరణం కల్పించాలని పాత్రికేయలోకం గొంతెత్తి నినదించింది. 'ఒక మహిళా జర్నలిస్ట్ పోలీస్ అధికారిపై ఆరోపణలు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనే డిమాం డ్‌తో వందలాది మంది జర్నలిస్టులు గంటల తరబడి అక్కడే కూర్చున్నారు. కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దారుణం' అని ఆయన 'ఎక్స్' వేదికగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన నిరసన తెలిపే హక్కును, శాంతియుతంగా తమ నిరసనను వ్యక్తం చేసే స్వేచ్ఛను అణచివేయడానికి అభేద్యమైన బారికేడ్లు, కఠినఆంక్షలు, అంతర్జాల సేవ నిలిపివేత ,ముందస్తు అరెస్టులను ఆశ్రయించడం ప్రజాస్వా మ్య వ్యవస్థకు ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. నిరసన ప్రదర్శనపై పోలీసులు వ్యవహరించిన తీరు రాజ్యాంగబద్ధ మైన ప్రజాస్వామ్య సూత్రాలను తీవ్రంగాప్రశ్నిస్తోంది. ప్రజా స్వామ్య ప్రక్రియలపై పౌరులు, విద్యార్థి లోకం తమ గళాన్ని విప్పడం, కేవలం పోలీసు బలగాలను ఉపయోగించి శాంతి యుత ఉద్యమాలను అణచివేయాలని చూడడం బాధ్యతా రాహిత్యమైన చర్య. జంతర్ మంతర్ పరిసరాల్లో వేలాది మంది భద్రతా బలగాలను మోహరించి, మెట్రో సేవలు నిలిపివేసి సాధారణ ప్రజలకు నరకం చూపించడం ఏ విధమైన ప్రజాస్వామ్య పరిపాలన అనిపించుకుంటుంది?శాంతి భద్రతలను కాపాడడం పోలీసుల ప్రాథమిక విధి. ఒకవేళ ఆందోళన తీవ్ర రూపం దాల్చకుండా నివారించడమే లక్ష్యమైతే,దానికి పారదర్శక పద్ధతులు ఉంటాయి. కానీ, విద్యార్థులు, ఉద్యమ నాయకులను రోడ్లపై ఈడ్చుకెళ్లడం, మహిళా నిరసనకారులతో నిరంకుశంగా వ్యవహరించడం, వందలాది మందిని నిర్బంధించడం వంటి చర్యలు విధి నిర్వహణ పరిధి దాటి తీవ్ర నిరంకుశత్వానికి దారితీస్తాయి. ముంబై లాంటి ఇతర నగరాల్లో ఇలాంటి నిరసనల పట్ల పోలీసులు చూపిన సమయస్ఫూర్తికి, ఢిల్లీ పోలీసులవైఖరికి మధ్య ఉన్న వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ సంఘటనలో జరిగిన పోలీసుల అతిక్రమణలు,గాయపడిన పౌరుల ఆరోపణలపై పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. నిరసన తెలియజేసే హక్కును అణచివేయకుండా, పౌరుల రాజ్యాంగ హక్కులకు తగిన రక్షణ కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ప్రతిపక్షాలు ,విద్యార్థి ప్రతినిధులు లేవనెత్తుతున్న అంశాలకు పాలకులు సున్నితంగా, పారదర్శకంగా సమాధానం చెప్పాలి. తుపాకులు, లాఠీల ద్వారా భావప్రకటన స్వేచ్ఛను నలిపివేయవచ్చనే భావన తాత్కాలికమే. ప్రజాస్వామ్యం నిలబడేది బలవంతపు అణచివేతపై కాదు, పౌరుల గొంతుకకు ఇచ్చే గౌరవంపైనే. ఆరోజు బయటకు వచ్చిన వీడియోలుపోలీసు వాదనను తూట్లు పొడుస్తున్నాయి. ఒక పోలీసు అధికారి నిరసనకారుడి ముఖంపై పిడిగుద్దులు కురిపిస్తున్న దృశ్యం, మహిళా జర్నలిస్టుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారన్న ఆరోపణలు, విచక్షణారహితంగా లాఠీలు ఝుళిపించడం, 60 70 మందిని ఈడ్చుకుంటూ బస్సుల్లోకి ఎక్కించడంఇవన్నీ ప్రొఫెషనల్ పోలీసింగ్ కాదు, ప్రతీకార చర్య. ఢిల్లీ పోలీసులు లాఠీ ఛార్జ్ చేయలేదని చెబుతుంటే, సోషల్ మీడియాలో వైరల్ అయిన దృశ్యాలు,గాయపడిన విద్యార్థులు, ఆస్పత్రి పాలైన జర్నలిస్టులు వేరే కథ చెబుతున్నాయి. అబద్ధాన్ని అధికారిక ప్రకటనతో కప్పిపుచ్చే ప్రయత్నం ప్రజల విశ్వాసాన్ని మరింత దెబ్బతీస్తుంది.భారత రాజ్యాంగం ఆర్టికల్ 19(1)(ఎ), 19(1)(బి) ప్రకారం భావ ప్రకటనా స్వేచ్ఛ, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కుప్రతిపౌరుడికి ఉంది. సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో 'నిరసన అనేది ప్రజాస్వామ్యానికి ఆక్సిజన్' అని స్పష్టం చేసింది. జంతర్ మంతర్‌వద్ద అనుమతి నిరాకరణను ఒక ఆయుధంగా మార్చి, శాంతియుత నిరసనను కూడా అక్రమ కూటమిగా చిత్రీకరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఈ ఘటనపై నిష్పాక్షిక న్యాయ విచారణ జరగాలి. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి. మహిళా జర్నలిస్టుల ఫిర్యాదును క్రైమ్‌బ్రాంచ్ కేవలం ఫైళ్లకే పరిమితం చేయకుండా, కాలపరిమితిలో విచారణ పూర్తిచేయాలి. ప్రశ్నించే ప్రతి పౌరుడిపై జరిగిన దాడిగా చరిత్రలో నమోదవుతుంది.

పరుల దయ కోరటం అంటే తన స్వాతంత్ర్యాన్ని అమ్ముకోవడమే.



మహాత్మా గాంధీ

ప్రాచీన మూఢవిశ్వాసాలను అంటిపెట్టుకోక, నవ్య సత్యాల కోసం సంసిద్ధుడవై ఉండు.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### సాధారణ బోగీలు పెంచాలి

ఈ నెలలో దసరా, వచ్చే నెలలో దీపావళి సందర్భంగా పేద, మధ్యతరగతి ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లేందుకు ఎక్కువగా ప్రయాణించేది రైళ్లలోనే. ఇప్పటికే అన్ని రైళ్లలోనూ రిజర్వేషన్లు నిండుకుని చాంతాడంత నిరీక్షణ జాబితా చూపిస్తున్నాయి. ప్రస్తుతం నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సాధారణబోగీలు రెండు మాత్రమే అందుబాటులో ఉండటంతో ప్రయాణికులు చాలా కిక్కిరిసిన పరిస్థితిలో ప్రయాణం చేయవలసి వస్తుంది. 'ప్రత్యేక రైళ్లు' ప్రకటనలకే తప్పసామాన్య మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో లేనివిధంగా రేట్లు ఈ 'ప్రత్యేకరైళ్ల'లో ఉంటున్నాయి. కాబట్టి ప్రస్తుతం తిరుగుతున్న అన్నిఎక్స్‌ప్రెస్ రైళ్లలో రాబోయే పండుగలనేపథ్యంలో ప్రయాణికుల రద్దీకిఅనుగుణంగా సాధారణ బోగీలసంఖ్యను పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలుప్రయాణించేందుకు అవకాశం కల్పించాలి.

- దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్లపాలెం ప.జిల్లా

### ప్రాణాలు తీస్తున్న రోడ్లు

రాజేంద్రనగర్ నియోజకవర్గం,బండ్లగుడాజాగీరు మున్సిపాలిటీపరిధిలో హెచ్.పి. పెట్రోల్ బంకు ట్రాఫిక్ సిగ్నల్ చౌరస్తా నుండి కిస్మత్పూర్ గ్రామం వరకు ఉన్న ఇరుకైన రోడ్డుపై ఆర్టీసీబస్సులే కాకుండాఅనేక రకాల వాహనాలు తిరుగుతున్నాయి. కిక్కిరిసినజనం,ఆరోడ్డుపై పోవాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవలసిందే.ఇటీవల ఆక్సిడెంట్‌లోవాహన దారుడు చనిపోయిన సందర్భంగా ధర్నాలు చేసి ఎమ్మెల్యేకి విన్నపాలు చేసుకున్నా ఫలితం ఉంటే ఒట్టు. 100 ఫీట్ రోడ్ శాంక్షన్ అయి దశాబ్దాల గడిచిన కదలికలేకపోవడంతో సంబంధిత అధికారులపైనే గాకుండా ప్రజాప్రతినిధులపై ప్రజలలో అసంతృప్తి జ్వాల రగులుకుంటుంది. కనుక ఎమ్మెల్యే చొరవ చూపాలి.

- పూసాల సత్యనారాయణ, గంధంగూడ

### అన్నదాతకు భరోసా కల్పించాలి

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక కుదేలవుతున్న రైతన్న కష్టాలు వర్ణనాతీతం. అనాదినుంచి కర్షకుడికి అతివృష్టి, అనావృష్టి అవినాభావ సంబంధం అంటే అతిశయోక్తికాదు.అగ్నికి ఆజ్యం పోయకుండా కల్తీవిత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ సంబంధిత వనరులతో,ఈయేడాది రుతుపవనాలు ఆలస్యానికి కారణమైన ఎల్‌నినో ప్రభావంతో పంటలకు కోలుకోలేని దెబ్బ. ప్రభుత్వాలు అన్నదాత పట్లచొరవ చూపాలి.

-కె.రామారావు, నల్గొండజిల్లా

### ఆరోగ్యంతో చెలగాటం వద్దు

కాంగ్రెసు నేడు ఆహారం విషయంలో ప్రతి ఒక్కరూ మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరంఉంది. కొందరు వ్యాపారులు, హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఆహారం తయారు చేయడంవల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉంది. వాడిన నూనెను పదేపదే ఉపయోగించడం, మిగిలిపోయిన ఆహార పదార్థాలను నిల్వ చేసి మళ్లీ వేడి చేసి వడ్డించడం వంటి వాటికి దూరంగా ఉండాలి. ఆహారం తయారు చేసే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు,నాణ్యమైన పదార్థాలను మాత్రమే ఉపయోగించాలి.ఆహార భద్రత అధికారులు సందర్భానుసారం హెచ్చరిస్తూ, నిబంధనలు పాటించని సందర్భాల్లో తగిన చర్యలు తీసుకుంటున్నారు.ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రతి ఆహార వ్యాపారి సామాజిక బాధ్యతగా భావించి, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీకి తావులేకుండా వ్యవహరించాలి. నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ద్వారాఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం అవసరం

భారత అంతరిక్ష రంగం వేగంగా కొత్త దశలోకి అడుగుపెడుతోంది. ప్రైవేటు రంగానికి మరిన్ని అవకాశాలు కల్పించడం ద్వారా పెట్టుబడులు, సాంకేతిక ఆవిష్కరణలు, పరిశోధన, ఉపాధిఅవకాశాలు పెరిగే అవకాశంఉంది. అయితే ఈ మార్పు దేశ అంతరిక్ష కార్యక్రమాన్ని దశాబ్దాలుగా నిర్మించిన శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సిబ్బందిలో అనిశ్చితికి దారితీయకుండా స్పష్టమైనవిధాన సమాచారంతో ముందుకుసాగాలి.భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ సాధించిన విజయాల వెనుక దశాబ్దాల ప్రజా పెట్టుబడి, శాస్త్రీయ నైపుణ్యం, సంస్థాగత అనుభవం ఉన్నాయి. అందువల్ల ప్రైవేటు రంగం విస్తరణను ప్రభుత్వ రంగానికిప్రత్యామ్నాయంకాకుండా,భాగస్వామ్యంగా చూడాలి.

- సి.సాయిరుత్విక్, శ్రీకాకుళం

### అందరిని సమానంగా చూడాలి

భారత దేశంలో ప్రాథమిక హక్కులు విశిష్టమైనవి. శాసన కార్యనిర్వాహన అధికారాల మీద పరిమితులున్నాయి.జెంజీ ఉద్యమాన్నివయోజన ఓటుహక్కును దూరంచేసి,ఓటుహక్కు ఉన్నవారుఓటు హక్కు లేని వారుగా మార్చే విభజన పరిణామలకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంగా దీనిని చూడాలి. అందరిని సమానంగా చూసే పరిస్థితి రావాలి.

- భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

## మహిళా భద్రత ఆచరణలో చూపాలి

సి. హెచ్. ప్రతాప్

మహిళల భద్రత గురించి ప్రతి దారుణ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా చర్చ మొదలవుతుంది. నిరసనలు జరుగుతాయి. పోస్టర్లు వెలుస్తాయి. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. కొద్ది రోజులకు ఆ చర్చ తగ్గిపోతుంది. కానీ మహిళ బయటకు అడుగుపెట్టిన ప్రతిసారీ ఎదురయ్యే అసురక్షిత భావన మాత్రం అలాగే మిగులుతోంది. ఇది కేవలం నేరాల సమస్య కాదు, నగర నిర్మాణం, పోలీసింగ్, ప్రజా రవాణా, వీధి వెలుతురు, సామాజిక వైఖరి, చట్ట అమలు అన్నీ కలిసి ఎదుర్కోవాల్సిన వ్యవస్థాత్మక సవాలు. ఇటీవలి ఢిల్లీలో జరిగిన లైంగిక దాడి ఘటన, బీహార్‌లోని జముయిలో ఇద్దరు బాలికలపై జరిగిన వేధింపుల ఘటనలు మరోసారి ఈవాస్తవాన్ని ముందుకు తెచ్చాయి. ఇలాంటి ఘటనలు అర్ధరాత్రి మాత్రమే జరగడం లేదు. సాయంత్రం వేళల్లోనే మహిళలు, బాలికలు అసురక్షితంగా భావించాల్సి వస్తోందంటే సమస్య రాత్రివేళ బయటకు రావడంలో లేదు. వారికి భద్రమైన ప్రజా ప్రదేశాలను కల్పించలేని పరిపాలనా వైఫల్యంలో ఉంది. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం 2022లో దేశవ్యాప్తంగా మహిళలపై నేరాలకు సంబంధించి 4,45,256 కేసులునమోదయ్యాయి. 2021లో ఈ సంఖ్య 4,28,278గా ఉండగా, ఏడాదిలో సుమారు నాలుగు శాతం పెరుగుదల కనిపించింది. ప్రతి లక్ష మహిళల జనాభాకు నమోదైన నేరాల రేటు 2020లో 56.5గా ఉండగా, 2021లో 64.5,2022లో 66.4కు పెరిగింది. 2022లో భర్తలేదా అతని బంధువుల క్రూరత్వానికి సంబంధించి 1,40,019కేసులు, కిడ్నాప్-అపహరణకు సంబంధించి 85,310, మహిళ గౌరవాన్ని భంగపరిచే ఉద్దేశంతో దాడులకు సంబంధించి 83,344, అత్యాచారానికి సంబంధించి 31,516 కేసులు నమోదయ్యాయి. అయితే ఈ గణాంకాలను మొత్తం వాస్తవ నేరాల సంఖ్యగా చూడకూడదు. ఇవి పోలీసులకు నమోదైన కేసులు మాత్రమే. ఫిర్యాదు చేయని ఘటనలు కూడా ఉండే అవకాశమున్నందున, నమోదైన సంఖ్యలు సమస్య తీవ్రతకు కనీస సూచికగా మాత్రమే భావించాలి. ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 ప్రకారం 18-49 ఏళ్ల ఎప్పుడైనా వివాహితులైన మహిళల్లో 29.3 శాతం మంది జీవితంలో ఎప్పుడో ఒకసారి భర్త చేత శారీరక లేదా లైంగిక హింసను ఎదుర్కొన్నట్లు తెలిపారు. అంటే మహిళల భద్రత సమస్య వీధుల్లోనే కాదు, కొన్ని ఇళ్ల గోడల మధ్య కూడా కొనసాగుతోంది. నేడు మహిళలు విద్య,ఉద్యోగం, వ్యాపారం, వైద్యం, సమాచార సాంకేతికం, పరిపాలన ప్రతి రంగంలో ముందుకు వస్తున్నారు. కానీ నగర మౌలిక సదుపాయాలు ఆమార్పుకు సరిపడే వేగంతో రూపాంతరం చెందలేదు. వెలుతురు లేని వీధులు, చీకటి పార్కులు, నిర్జన బస్‌స్టాప్‌లు, బ్లైండ్ స్పాట్లు, అసురక్షిత చివరి మైలు ప్రయాణం మహిళల సంచార స్వేచ్ఛను పరిమితం చేస్తున్నాయి.సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం మాత్రమే పరిష్కారం కాదు. కెమెరా నేరాన్ని రికార్డుచేయగలదు. కానీనేరస్థుడిలోభయం కలిగించేది వేగవంతమైన పోలీసు స్పందన, ఖచ్చితమైన దర్యాప్తు,సమర్థవంతమైన అభియోగ ప్రక్రియ, సమయానుకూల న్యాయం.ఈవ్‌టీజింగ్, వెంబడించడం,అసభ్యవ్యాఖ్యలను చిన్నవిషయాలుగా తీసుకునే ధోరణికి ముగింపు పలకాలి.మహిళలకు జాగ్రత్తగా ఉండండి,రాత్రి వేళ బయటకు రావద్దు అనిచెప్పడం సమస్యను వారి భుజాలపై మోపడం మాత్రమే.మహిళల స్వేచ్ఛను కుదించడం భద్రత కాదు. నేరానికి అవకాశాలను తగ్గించడం, చట్టఅమలునుకఠినంగా చేయడం,భద్రమైన వాతావరణాన్ని నిర్మించడం నిజమైన భద్రత. మహిళఎప్పుడైనా,ఎక్కడైనా భయంలేకుండా నడవగలిగినప్పుడే నగరాలు నాగరికమైనవిగా నిలుస్తాయి. ●

## నీటి లభ్యత మేరకే డేటా సెంటర్ల నిర్మాణం

కొలను వెంకటేశ్వర రెడ్డి

భారత్ డిజిటల్ భవిష్యత్తుకు ఇవి అవసరమే కానీ అభివృద్ధి అంటే కేవలం పెట్టుబడులు, భవనాలు కాదు.ఒకప్పుడు ఒక ప్రాంతంలో పెద్ద పరిశ్రమ వస్తోందంటే వేలాది మందికి ఉద్యోగాలు, చుట్టుపక్కల వ్యాపారాలకు ఊతం, స్థానిక ఆర్థిక వ్యవస్థకు చైతన్యం వచ్చేవి. ఇప్పుడు కాలం మారింది. పరిశ్రమల స్థానంలో మరో కొత్త తరహా మౌలిక వసతి ప్రపంచం వేగంగా విస్తరిస్తోంది.అదే డేటా సెంటర్ల ప్రపంచం. మన చేతిలోని మొబైల్ నుంచి డిజిటల్ చెల్లింపుల వరకు, ఆన్‌లైన్ షాపింగ్ నుంచి కృత్రిమ మేధ వరకు, స్ట్రీమింగ్ సేవల నుంచి ప్రభుత్వ డిజిటల్ సేవల వరకు అన్నింటి వెనుక ఎక్కడో ఒకచోట డేటా సెంటర్ ఉంటుంది. అందుకే డేటాను ఆధునిక ఆర్థిక వ్యవస్థకు కొత్త చమురుగా అభివర్ణిస్తున్నారు.భారత్‌లో డిజిటల్ వినియోగం విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో డేటా సెంటర్లకు డిమాండ్ కూడా భారీగా పెరుగుతోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న డేటా సెంటర్ సామర్థ్యం రాబోయే సంవత్సరాల్లో అనేక రెట్లు పెరిగే అంచనాలున్నాయి. ముంబయి, చెన్నై, ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు వంటి నగరాలు ఇప్పటికే ప్రధాన కేంద్రాలుగా నిలవగా హైదరాబాద్ సహా కొత్త ప్రాంతాలు వేగంగా ఎదుగుతున్నాయి. ఇది భారతదేశానికి ఒక గొప్ప అవకాశం.అదే సమయంలో ఒక పెద్ద సవాలు కూడా. డేటా దేశ సార్వభౌమత్వానికి కొత్త ఆయుధం. ప్రపంచం డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వైపు పయనిస్తున్న సమయంలో దేశ పౌరుల సమాచారం ఎక్కడ నిల్వ ఉంటుంది? ఎవరి నియంత్రణలో ఉంటుంది? అనే ప్రశ్నలకు ప్రాధాన్యం పెరిగింది దేశీయంగా డేటా నిల్వ, నిర్వహణ సామర్థ్యం పెరగడం వల్ల డిజిటల్ సార్వభౌమత్వం బలోపేతమవుతుంది. బ్యాంకింగ్, యూపీఐ, ఈకామర్స్, ప్రభుత్వ సేవలు, టెలికాం, ఆరోగ్యం, విద్య, ఎఐ వంటి రంగాలకు వేగవంతమైన క్లౌడ్ మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయి. అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి కూడా ఇది ఆకర్షణీయ రంగం. నిర్మాణం, విద్యుత్తు, టెలికాం, ఇంజినీరింగ్, భద్రత, కూలింగ్ వ్యవస్థలు, ఫైబర్ నెట్‌వర్క్ వంటి అనేక అనుబంధ రంగాలకు డిమాండ్ పెరుగుతుంది. కానీ ఇక్కడే ఒక ముఖ్యమైన ప్రశ్న ఉదయిస్తుంది. డేటా సెంటర్ నిర్మించడానికి అవసరమైన విద్యుత్తు, నీరు ఎక్కడి నుంచి వస్తాయి? డేటా సెంటర్‌కు విద్యుత్తు అంటే సాధారణ పరిశ్రమకు అవసరమైన విద్యుత్తు కాదు సర్వర్లు 24 గంటలూ పనిచేయాలి.ఒక్క క్షణం అంతరాయం వచ్చినా భారీనష్టం సంభవించే అవకాశం ఉంటుంది. సర్వర్లను నడపడానికి ఎంత విద్యుత్తు అవసరమో,వాటి నుంచి వెలువడే వేడిని తగ్గించడానికి శీతలీకరణ వ్యవస్థలకు కూడా అంతే ప్రాధాన్యం ఉంటుంది.దేశంలో డేటా సెంటర్ల



సామర్థ్యం భారీగా పెరిగితే విద్యుత్తు డిమాండ్ కూడా గణనీయంగా పెరుగుతుంది. దీనిని కేవలం పెట్టుబడుల కోణంలో చూడటం సరైంది కాదు. కొత్త డేటా సెంటర్ల కోసం అవసరమయ్యే విద్యుత్తు ఉత్పత్తి, ప్రసారం, గ్రిడ్ సామర్థ్యం వంటి అంశాలపై ముందుగానే ప్రణాళిక అవసరం. లేకపోతే ఒకవైపు డిజిటల్ భారత్ కోసం విద్యుత్తు ఇస్తూ, మరోవైపు సాధారణ గృహాలు, చిన్న పరిశ్రమలు, రైతులకు విద్యుత్తు సరఫరాపై ఒత్తిడి పెరిగే పరిస్థితి రావచ్చు.నీరు, కనిపించని మరో ఖర్చు. డేటా సెంటర్లపై చర్చలో విద్యుత్తు గురించి కొంతైనా మాట్లాడుతున్నాం కానీ, నీటి అవసరంపై అంతగా దృష్టి సారించడం లేదు. భారీ డేటా సెంటర్లలో శీతలీకరణకు గణనీయమైన నీటి అవసరం ఉండవచ్చు. నీటి కొరత ఎదుర్కొంటున్న నగరాల్లో ఇది భవిష్యత్తులో తీవ్రమైన సమస్యగా మారేఅవకాశం ఉంది. హైదరాబాద్ ఇప్పటికే వేగంగా విస్తరిస్తున్న మహానగరం తాగునీరు, భూగర్భజలాలు, చెరువులు, పారిశ్రామిక అవసరాలు,అన్నింటిపైనా ఒత్తిడి ఉంది. ఈ పరిస్థితిలో పెట్టుబడి వస్తోంది, కాబట్టి నీరు ఇస్తాం.. అనే విధానం భవిష్యత్తుకు ప్రమాదకరం. ప్రతి డేటా సెంటర్‌కు నీటి వినియోగ పరిమితి ఉండాలి. వర్షపు నీటి సంరక్షణ, శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం, నీటి సామర్థ్యాన్ని పెంచే ఆధునిక కూలింగ్ సాంకేతికతలు తప్పనిసరి చేయాలి. డేటా సెంటర్లను భారీ పెట్టుబడులుగా చూపడం సహజం కానీ పెట్టుబడి మొత్తం ఉద్యోగాలుగా మారదు. నిర్మాణ దశలో వేల మందికి పని దొరకవచ్చుకానీ డేటా సెంటర్ పూర్తయిన తర్వాత ప్రత్యక్షంగా పనిచేసే సిబ్బంది సంఖ్య సాధారణ భారీ పరిశ్రమతో పోలిస్తే చాలా తక్కువ. ఎన్ని ప్రత్యక్ష ఉద్యోగాలు? ఎన్ని స్థానికులకు? ఎంత పన్ను ఆదాయం? ఎంత విద్యుత్తు వినియోగం? ఎంత నీరు? ఎంత పునర్వినియోగం? ఎంత పునరుత్పాదక విద్యుత్తు? అనే ప్రశ్నలకూ సమాధానాలు ఉండాలి. ఈ పోటీలో తెలంగాణ వెనుకబడాల్సిన అవసరంలేదు. హైదరాబాద్‌కు ఐటీ రంగంలో ఇప్పటికే బలమైన పునాది ఉంది. విస్తృతమైన ఫైబర్ నెట్‌వర్క్, సాంకేతిక నైపుణ్యం, విమానాశ్రయం, రహదారి అనుసంధానం, ఐటీ సంస్థల సమీకరణ వంటి అనేక అనుకూలతలు ఉన్నాయి.డేటా సెంటర్లతో పాటు క్లౌడ్ కంప్యూటింగ్, ఎఐ, సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్, సెమీకండక్టర్లు వంటి రంగాలకు కూడా హైదరాబాద్ కేంద్రంగా ఎదగగలదు. ఇది కేవలం డేటా సెంటర్లను నిర్మించే పోటీగా చూడకూడదు. డేటా ఎకానమీకి హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చే అవకాశంగా చూడాలి. కొత్త డేటా సెంటర్లకు అనుమతులు ఇచ్చే సమయంలో కేవలం పెట్టుబడి ప్రతిపాదనను చూడటం సరిపోదు. ప్రభుత్వం స్పష్టమైన ప్రమాణాలను రూపొందించాలి. మొత్తం విద్యుత్తు వినియోగంలో నిర్దిష్ట శాతం పునరుత్పాదక ఇంధనం నుంచే రావాలి. సౌర, పవన విద్యుత్తుతో దీర్ఘకాలిక ఒప్పందాలకు ప్రోత్సాహం ఇవ్వాలి. శుద్ధి చేసిన మురుగునీటిని కూలింగ్‌కు వినియోగించేలా చేయాలి. తాగునీటిని పారిశ్రామిక కూలింగ్‌కు వినియోగించడాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలి. ప్రతికేంద్రం తన నీటి వినియోగం,విద్యుత్తు వినియోగం, కార్బన్ ఉద్గారాలపై పారదర్శక నివేదిక ఇవ్వాలి. పాత సర్వర్లు, ఎలక్ట్రానిక్ పరికరాల కోసం శాస్త్రీయ ఈవేస్ట్ నిర్వహణ వ్యవస్థ ఉండాలి. స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి, నైపుణ్య ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలి. ఇలాంటి ప్రమాణాలతో డేటా సెంటర్లను ప్రోత్సహిస్తే పెట్టుబడులు కూడా వస్తాయి. పర్యావరణ భారం కూడా తగ్గుతుంది. ●

# విబిజిరామ్‌జీలో 375 పనులకు కేంద్రం ఓకే!

## ఉపాధి కల్పనతోపాటు శాశ్వత మౌలిక వసతుల నిర్మాణానికి ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో పాటు శాశ్వత మౌలిక వసతుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మరింత ప్రాధాన్యతనిస్తోంది. వికాసిత్ భారత్–గారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) చట్టం–2025 కింద చేపట్టగల పనుల జాబితాను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కొత్త విధానంలో మొత్తం 375 రకాల పనులకు అనుమతి ఇచ్చింది. గత విధానంలో 266 రకాల పనులు ఉండగా, తాజా షెడ్యూల్లో వాటి సంఖ్య 41 శాతం పెరిగింది. కొత్తగా అనుమతించిన పనులను నాలుగు ప్రధాన విభాగాలుగా విభజించారు. అవి నీటి భద్రత, గ్రామీణ మౌలిక వసతులు, జీవనోపాధికి సంబంధించిన మౌలిక వసతులు, విపత్తుల సన్నద్ధత–తీవ్ర వాతావరణ పరిస్థితుల నిర్వహణ. అత్యధికంగా 128 పనులు నీటి భద్రతకు కేటాయించారు. చెక్డ్యాముల్లు, గల్లీ ప్లగుళ్లు, భూగర్భ డ్రైనేజిలు, రీచార్జ్ షాఫ్టు, ఇంజెక్షన్ బావులు, నదులు, వాగులు, నాలాల పునరుద్ధరణ, నీటిముంపునకు గురైన భూముల పునరుద్ధరణ, పొలాలకు నీటి పంపిణీ కాలువల మరమ్మతులు వంటి పనులు ఇందులో ఉన్నాయి. డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ వ్యవస్థలు, పైకప్పు వర్షపు నీటి సేకరణ, టంకాలు వంటి వాటితో పాటు నీటి సంరక్షణ కోసం ఐస్ స్తూపాలు, కృత్రిమ హిమానీనదాలు వంటి కొత్త తరహా పనులను కూడా చేర్చారు. కోర్ రూరల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో 111 పనులకు అనుమతి ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన పౌర, సామాజిక మౌలిక వసతులను బలోపేతం చేయడం వీటి ప్రధాన ఉద్దేశం. సౌర వీధి దీపాలు, వ్యర్థాలను సంపదగా మార్చే రీసైక్లింగ్ ప్లాంట్లు, గ్రేవాటర్ శుద్ధి కేంద్రాలు, వ్యర్థాల వేర్పాటు షెడ్లు, గ్రామీణ గ్రంథాలయాలు, పశువైద్య కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు, బహుళ ప్రయోజన యువజన కేంద్రాలు, కమ్యూనిటీ సదుపాయాలు ఇందులో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రయోగశాలల నిర్మాణం, జల్ జీవన్ మిషన్ నీటి సరఫరామౌలిక వసతుల మరమ్మతులు, గ్రామీణ పార్కులు, నడక మార్గాలు తదితర పనులకు కూడా అవకాశం కల్పించారు. కొత్త విధానంలో లైవ్లీహుడ్ సంబంధిత మౌలిక వసతులకు 98 పనులు కేటాయించారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, శుభ్రపరిచే–గ్రేడింగ్–ప్యాకేజింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్లు, చిన్న పిండి మిల్లులు, మార్కెట్ యార్డులు, డెయిరీ మౌలిక వసతులు, పుట్టగొడుగుల సాగు షెడ్లు, సెరికల్చర్ షెడ్లు, పాలీహౌస్లు, ఆక్వాకల్చర్ నిర్మాణాలు ఇందులో ఉన్నాయి. స్వయం సహాయక సంఘాలు, వాటి సమాఖ్యలకు వర్క్షెడ్లు, ఫెడరేషన్ భవనాలు, శిక్షణ–నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు కూడా అనుమతి ఇచ్చారు. జీవనోపాధి సంబంధిత పనుల వాటా మొత్తం అనుమతించదగిన పనుల్లో 26 శాతానికి పెరిగింది. గత విధానంలో ఇది కేవలం 1.1 శాతం మాత్రమే. గ్రామీణ పనుల చట్రంలో తొలిసారిగా విపత్తుల సన్నద్ధత, తీవ్ర వాతావరణ పరిస్థితుల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 38 పనులు ఉన్నాయి. వరద సహాయక శిబిరాలు, రిటైనింగ్ వాల్స్, కరకట్టల బలోపేతం, వరద రక్షణ పనులు, విపత్తుల అనంతరం గ్రామీణ రహదారులు, సామాజిక ఆస్తుల పునరుద్ధరణ, అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ లైన్లు, ఫ్యూయల్ బఫర్ జోన్ల ఏర్పాటు వంటి పనులు ఇందులో ఉన్నాయి. వరదలు, తుపాన్లు, భారీ వర్షాలు, కరువు, కొండచరియలు విరిగిపడటం, అడవుల్లో అగ్నిప్రమాదాలు వంటి విపరీత వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేలా గ్రామీణ ప్రాంతాలను, ఆస్తులను బలోపేతం చేయడం ఈ విభాగం లక్ష్యం. మొత్తం 181 పనులు వ్యవసాయం, అనుబంధ రంగాలవే ఉన్నాయి. ఇందులో 52 పనులు వ్యక్తిగత లబ్ధిదారులకు సంబంధించినవి. నీటి వనరులు, భూమి అభివృద్ధి, మొక్కల పెంపకం, పశుసంపద తదితర ఉత్పాదక ఆస్తుల ద్వారా రైతులకు నేరుగా ప్రయోజనం కలిగేలా వీటిని రూపొందించారు. అంత్యోదయ, బలహీన వర్గాల కుటుంబాల కోసం 107 పనులు కేటాయించారు. ఇందులో 68 వ్యక్తిగత లబ్ధిదారు పనులు ఉన్నాయి. గృహాలు,

పారిశుధ్యం, ఇంధనం, సాగునీరు, మొక్కల పెంపకం, పశువుల షెడ్లు, ఇతర కుటుంబ స్థాయి ఆస్తులు ఇందులో ఉన్నాయి. నారీ శక్తికి సంబంధించిన 36 పనులు, యువ శక్తికి సంబంధించిన 36 పనులు ఉన్నాయి. వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఈ చట్టం దోహదపడుతుందని కేంద్రం ప్రకటించింది.



## ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేందుకు సిద్ధమైన ఇజ్రాయెల్

### ఫైటర్ జెట్స్‌ను సిద్ధం చేసిన వైనం

### పలు సంచలన విషయాలు వెలుగులోకి

**టెల్అవీవ్, అక్టోబరు 6:** ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన జరిగిన సమయంలో ఇజ్రాయెల్ అప్రమత్తమైందని తెలుస్తోంది. విమానం టెల్ అవీవ్‌వైపు ప్రయాణాన్ని కొనసాగించి ఉంటే దాన్ని కూల్చివేసేందుకు ఇజ్రాయెల్ సిద్ధమైనట్లు సమాచారం. అందుకోసం యుద్ధ విమానాలను సిద్ధం చేసినట్లు సిబిఎన్ న్యూస్ కథనాన్ని ప్రచురించింది. సెప్టెంబరు 30న ఫ్లైదుబాయ్‌కు చెందిన ఫ్లైట్ 1073 దుబాయ్ నుంచి టెల్అవీవ్‌కు బయలుదేరింది. ప్రయాణ సమయంలో కో–పైలట్ హమామ్ అల్–హమ్మామీ అనూహ్యంగా కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడికి పాల్పడ్డారు. గొడ్డలితో కెప్టెన్‌ను గాయపరిచి విమానంపై నియంత్రణ సాధించేందుకు ప్రయత్నించాడు. ఈ పరిణామంతో విమానం కొద్దిసేపటికే భారీగా కిందకు దిగింది. కేవలం 30 సెకన్లకుపైగా వ్యవధిలో విమానం దాదాపు 16 వేల అడుగుల ఎత్తును కోల్పోయింది. దీంతో విమానం హైజాక్‌కు గురైందా? లేక మరేదైనా ప్రమాదం జరిగిందా? అనే అనుమానాలు ఇజ్రాయెల్ అధికారుల్లో మొదలయ్యాయి.

**ఇజ్రాయెల్ హైఅలర్ట్:** విమానం టెల్అవీవ్ వైపు వస్తుండటంతో ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ అప్రమత్తమైంది. విమానంలోని కాక్‌పిట్‌తో రేడియో ద్వారా సంబంధాలు ఏర్పాటు చేసేందుకు ఇజ్రాయెల్ వైమానిక దళ సిబ్బంది ప్రయత్నించారు. అయితే అక్కడి నుంచి ఎలాంటి స్పందన రాలేదని సిబిఎస్ తెలిపింది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే ముందస్తు వ్యవస్థను యాక్టివేట్ చేశారు. ప్రత్యేక కమాండన సెంటర్‌ను ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షించారు. అదే సమయంలో ఇజ్రాయెల్ గగనతలాన్ని మూసివేసి ఫైటర్ జెట్లను రంగంలోకి దించారు. విమానం టెల్అవీవ్ వైపు తన ప్రయాణాన్ని కొనసాగిస్తే పరిస్థితి మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని అధికారులు భావించినట్లు సిబిఎన్ పేర్కొంది.

**కూల్చివేతకు సిద్ధమైన ఫైటర్ జెట్లు:** విమానం టెల్అవీవ్ దిశగా కొనసాగి ఉంటే, ఇజ్రాయెల్ ఫైటర్ పైలట్లు దాని వద్దకు చేరుకుని కాక్‌పిట్‌లో అసలు ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పింది. విమానం హైజాక్‌కు గురైందని నిర్ధారణ అయి ఉంటే, ఆ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని, రక్షణ మంత్రి దృష్టికి తీసుకెళ్లే వారని పేర్కొంది. విమానాన్ని కూల్చివేయాలా? వద్దా? అనే తుది అధికారం ఇజ్రాయెల్ ప్రధానమంత్రికే ఉండేదని తెలిపింది.

## గాజాపై ఇజ్రాయెల్ దాడికి ప్రతీకారంగానే..

### ఫ్లైదుబాయ్ కో–పైలట్ అల్ హమ్మామి వెల్లడి



**టెల్అవీవ్, అక్టోబరు 6:** ఇజ్రాయెల్ వెళ్లాల్సిన ఫ్లైదుబాయ్ విమానాన్ని కో పైలట్ అల్ హమ్మామి కూల్చాలనుకున్న సంగతి తెలిసిందే. అయితే, అతడు ఈ విమానాన్ని కూల్చాలని నిర్ణయించుకోవడానికి గల కారణాల్ని విచారణలో వెల్లడించినట్లు తెలుస్తోంది. గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడికి ప్రతీకారంగానే తాను ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చాలని నిర్ణయించుకున్నట్లు అల్ హమ్మామి చెప్పాడు. ఈ విషయాన్ని యుఎఇ అధికారులు జరుపుతున్న విచారణలో అతడు వెల్లడించాడు. అంతేకాదు.. అతడు ఇలా విమానాన్ని కూల్చి, తాను కూడా మరణించి అమరుడు అవ్వాలని భావించినట్లు చెప్పాడు. గత వారం దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ (టెల్అవీవ్) బయల్దేరిన విమానాన్ని కూల్చేందుకు కో పైలట్ అల్ హమ్మామి ప్రయత్నించాడు. ఈ ప్రయత్నాన్ని పైలట్, ఇండియన్ స్మిత్ మచ్చర్ అడ్డుకున్నారు. అదే సమయంలో అక్కడున్న ఇతర పైలట్లు విమానాన్ని సురక్షితంగా సౌదీలో ల్యాండ్ చేశారు. ఈ ఘటనలో కుట్రకు పాల్పడిన కో పైలట్ అలహ హమ్మామి ప్రస్తుతం యుఎఇ అధికారులు స్వాధీనంలో ఉన్నాడు. ఇజ్రాయెల్‌కు చెందిన విచారణ అధికారులు కూడా ఈ విచారణలో పాల్గొంటున్నారు. యుఎఇఅధికారులతోకలిసి ఇజ్రాయెల్ అధికారులువిచారణజరుపతున్నారు.



## గాఢనిద్రపోతే రూ.12 లక్షలు బహుమతి

### జపాన్‌లో ఆకట్టుకున్న నిద్ర పోటీ

**టోక్యో, అక్టోబరు 6:** ఎప్పుడూపనుల్లో మునిగిపోయి తీవ్రమైన అలసటతో ఉండే జపాన్‌లో ఓ వినూత్న పోటీ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. వేగంగా, గాఢంగా నిద్రపోవడమే ఈ పోటీలోని టాస్క్. గెలిచిన వారికి ఏకంగా 2 మిలియన్ యెన్లకు పైగా (భారత కరెన్సీలో సుమారు రూ.12 లక్షలు) బహుమతిగా అందిస్తారు. టోక్యోలో మ్యాట్ రేస్ పేరుతో ఓ పరుపుల తయారీ కంపెనీ ఈ విచిత్రమైన పోటీని నిర్వహించింది. ఈ పోటీలో తమను తాము కాంపిటేటివ్ స్లీపర్స్ అని పిలుచుకునే డజన్ల కొద్దీ పాల్గొన్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఓ గదిలో తక్కువ కాంతిలో, సౌకర్యవంతమైన పరుపులపై వీరంతా 90 నిమిషాల పాటు నిద్రపోయారు. ప్రతి ఒక్కరి తలకు స్లీప్ ట్రాకింగ్ పరికరాలను అమర్చారు. ఎవరు ఎంత వేగంగా నిద్రలోకి జారుకున్నారు, ఎంత గాఢంగా నిద్రపోయారు అనే అంశాల ఆధారంగా విజేతను ఎంపిక చేశారు. కొందరు తమ పక్కన ఇష్టమైన టెడ్డీబేర్లను పెట్టుకుని నిద్రపోవడం కనిపించింది. పాన్ ప్రజలు తీవ్రమైన నిద్రలేమితో బాధపడుతున్నారని, వారిలో నిద్రపై అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని నిర్వాహక సంస్థ కోలా స్లీప్ జపాన్ క్రియేటివ్ డైరెక్టర్ రిచిరో నకమా తెలిపారు. జపాన్ ప్రజలు చాలా కష్టపడి పనిచేస్తారు. నిద్రను ఇలా ఒక పోటీగా మార్చడం ద్వారా, అందరూ కలిసి నిద్రపోవడం, దానిపై ఆసక్తి పెంచుకోవడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. ఓఈసీడీ 2021 డేటా ప్రకారం జపనీయులు రోజుకు సగటున 7 గంటల 24 నిమిషాలు మాత్రమే నిద్రపోతున్నారని, ఇది ఓఈసీడీ దేశాల్లో అత్యంత తక్కువని తేలింది. ఎక్కువ పని గంటలు, సుదూర ప్రయాణాలు దీనికి కారణాలుగా నిపుణులు చెబుతున్నారు.

## మళ్లీ విమానం నడపాలనేదే నా కోరిక

### చికిత్సలో ఉన్న కెప్టెన్ స్మిత్ మచ్చర్

**అబుదాబి, అక్టోబరు 6:** నేను మళ్లీ విమానం నడపాలి ఇదే తన కుటుంబ సభ్యులతో కెప్టెన్ స్మిత్ మచ్చర్ పదేపదే చెబుతున్నట్లు కుటుంబానికి సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఫ్లై దుబాయ్ ప్రయాణికుల విమానంలో జరిగిన భయానక కాక్‌పిట్ దాడి నుంచి కోలుకుంటున్న ఆయన ప్రస్తుతం అబుదాబిలో చికిత్స పొందుతున్నారు. ఫ్లై దుబాయ్‌కు చెందిన 1073 విమానంలో సహ పైలట్ దాడికి గురైన భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగుపడుతున్నప్పటికీ, పూర్తిస్థాయిలో చూపు ఇంకా తిరిగి రాలేదని, దాడిలో తగిలిన గాయాలతో బాధపడుతున్నారని కుటుంబ వర్గాలు తెలిపాయి. దాడిలో ఉపయోగించిన క్రాష్ యాక్స్ దెబ్బల కారణంగా మచ్చర్ తల వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. పుర్రెపై లోతైన గాయం కావడంతో పాటు ఆయన చూపు కూడా తీవ్రంగా ప్రభావితమైంది. అయినప్పటికీ, విమానం ఒక్కసారిగా తీవ్రంగా కిందికి దిగడం ప్రారంభించడంతో ఆయన తన గాయాలను లెక్కచేయకుండా లేచి పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఇప్పుడు ఆయన లక్ష్యం ఒక్కటే మళ్లీ కాక్‌పిట్‌లోకి వెళ్లి విమానం నడపడం. సెప్టెంబర్ 30న 182 మందితో దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో ఉన్న ఒమన్‌కు చెందిన సహ పైలట్ అకస్మాత్తుగా క్రాష్ యాక్స్‌తో కెప్టెన్ మచ్చర్‌పై దాడి చేశాడు. దాడిలో కెప్టెన్ తీవ్రంగా గాయపడటంతో విమానం వేగంగా ఎత్తు కోల్పోవడం ప్రారంభించింది. ఈ సమయంలో మచ్చర్ తీవ్ర గాయాలతోనే కాక్‌పిట్ తలుపును తెరవగలిగారు. దీంతో విమాన సిబ్బంది, ప్రయాణికులు లోపలికి చేరుకుని దాడికి పాల్పడిన సహ పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్‌కు మళ్లించగా, అక్కడ విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. చూపు పూర్తిగా మసకబారింది ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో జరిగిన సంభాషణలో మచ్చర్ ఈ ఘటనను వివరించారు. తలపై వరుసగా దెబ్బలు తగలడంతో తన చూపు పూర్తిగా మసకబారిపోయిందని తెలిపారు. విమానం తీవ్రంగా కిందికి దిగుతోందని గుర్తించిన మచ్చర్, తాను తీవ్రంగా గాయపడినప్పటికీ ఏదో ఒకటి చేయాల్సిందేనని నిర్ణయించుకున్నారు. చివరకు తనలో ఉన్న శక్తినంతా కూడగట్టుకుని కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించారు. దీనిని ఆయన తన చివరి పోరాటం గా అభివర్ణించారు. పెద్ద విమాన ప్రమాదాన్ని నివారించడంలో కీలక పాత్ర పోషించిన కెప్టెన్ మచ్చర్‌ను అంతర్జాతీయంగా పలువురు ప్రశంసించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకూడా ఆసుపత్రి నుంచి ఆయనతో మాట్లాడారు. తనకు 17 ఏళ్ల విమానయాన అనుభవం ఉండటం వల్లే, చూపు సరిగా కనిపించని పరిస్థితిలోనూ విమానంలో ఏం జరుగుతోందో అర్థం చేసుకోగలిగానని మచ్చర్ ప్రధాని మోడీతో చెప్పినట్లు సమాచారం.

## హార్ముజ్ జలసంధిలో పెరిగిన దాడులు

### తాజాగా భారతీయ నావికులున్న నౌకపై దాడి

### 12 మందినావికులకు గాయాలు..11 మంది భారతీయులే




**మస్కట్, అక్టోబరు 6:** హార్ముజ్ జలసంధిలో మరోసారి భారతీయ నావికులు ఉన్న నౌకపై దాడి జరిగింది. పనామా జెండా కలిగిన ఎంటీ ఆన్ పీస్ నౌకపై మంగళవారం ఒక ప్రొజెక్టైల్‌తో దాడి జరిగింది. ఈ దాడిలో గాయపడిన 12 మంది సిబ్బందిలో 11 మంది భారతీయులే ఉన్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఒమన్ తీరానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన నావికుల్ని ఒమన్ అధికారుల సహాయంతో నౌక నుంచి తరలించి ఖసబ్ ప్రాంతంలోని ఆస్పత్రికి తరలించారు. నౌకలో 17 మంది భారతీయులతో సహా మొత్తం 19 మంది సిబ్బంది ఉన్నారు. వాణిజ్య నౌకపై జరిగిన దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. భారతీయ నావికుల్ని తరలించడానికి సహకరించిన ఒమన్ అధికారులకు విదేశాంగ మంత్రిత్వ శాఖ థాంక్స్ తెలిపింది. హార్ముజ్ ప్రాంతంలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక సదుపాయాలపై కొనసాగుతున్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని భారత్ పేర్కొంది. అంతర్జాతీయ జలాల్లో నౌక ప్రయాణాలు, వాణిజ్య కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు ఈ దాడుల్ని తక్షణమే నిలిపేయాలని పిలుపునిచ్చింది. హార్ముజ్ జలసంధి చుట్టుపక్కల ప్రాంతాల్లో వాణిజ్య నౌకలపై ఇటీవల కాలంలో దాడులు పెరిగాయి. ఈనెల మొదటి వారంలోనే 7 ట్యాంకర్లు దాడులకు గురయ్యాయి.

ఇరాన్‌అమెరికా శాంతి చర్చలు విఫలమైన తర్వాత, అమెరికా జలసంధిని దిగ్బంధించిన నేపథ్యంలో నౌకలపై దాడులు పెరిగాయి. జూలైలో ఒమన్ ప్రాదేశిక జలాల్లో యూఏఈకి చెందిన రెండు నౌకలపై ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. ఈ ఘటనలో నలుగురు భారతీయ సిబ్బంది మరణించగా, 10 మంది గాయపడ్డారు. ఈనెల 23న మరో దాడిలో మరో భారతీయ నావికుడు మరణించారు.



## అఫ్జల్‌గురు ఇంటిని బుల్‌డోజర్లతో కూల్చివేసిన జమ్మూకాశ్మీర్ సర్కార్

**శ్రీనగర్, అక్టోబరు 6:** పార్లమెంట్‌పై దాడికి పాల్పడిన ఉగ్రవాది మహ్మద్ అఫ్జల్ గురు ఫ్యామిలీకి చెందిన ఇంటిని జమ్మూ కాశ్మీర్ అధికారులు మంగళవారం బుల్డోజర్లతో కూల్చేశారు. బారాముల్లా జిల్లాలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా షెడ్డును కూల్చేసినట్లు అధికారులు తెలిపారు. సోపోర్ ప్రాంతంలో వరద ప్రభావిత భూమిలో ఈ షెడ్డు నిర్మించారు అఫ్జల్ గురు ఫ్యామిలీకి చెందిన సభ్యులు ఈ నిర్మాణాన్ని నిర్మించి అందులో నివాసం ఉంటున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూమిలో నిబంధనల్ని ఉల్లంఘించినట్లు పేర్కొంటూ రెవెన్యూ అధికారులు ఈ నిర్మాణాన్ని కూల్చేశారు.

## ప్రధానిమోడీ 25 యేళ్లపాలనాప్రస్థానం!

### సేవా సంకల్ప యాత్రకు రేపు ఘన ముగింపు

### వాద్‌నగర్, వారణాసిలో ఏకకాలంలో ముగింపు కార్యక్రమాలు

**వారణాసి, అక్టోబరు 7:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించినసేవా సంకల్ప యాత్రకు అక్టోబర్ 7న ఘనంగా ముగింపు పలకనున్నారు. వాద్‌గర్, వారణాసిలో ఏకకాలంలో రెండు భారీ ముగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గతనెల 17న ప్రారంభమైన ఈ యాత్ర దేశంలోని వివిధ ప్రాంతాల మీదుగా సాగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సేవా ప్రస్థానం, ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవల స్ఫూర్తితో సేవ, సంకల్పం, సామాజిక బాధ్యత సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది. ముగింపు కార్యక్రమాల్లో వేలాది మంది సేవా యాత్రికులు, భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) కార్యకర్తలు, యువత పాల్గొననున్నారు. వారణాసిలో సేవా యాత్రికులు తమ యాత్రను కాశీ విశ్వనాథ్ ధామ్‌లో జలాభిషేకంతో ముగించనున్నారు. బాబా విశ్వనాథుడి ఆశీస్సులు కోరుతూ నిర్వహించే ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో యువత, సేవా యాత్రికులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు హేమాంగ్ జోషి ప్రసంగించనున్నారు. ప్రజా జీవితంలో సేవ ప్రాధాన్యత, అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానంపై వారు మాట్లాడనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీవితంతో ప్రత్యేక అనుబంధం ఉన్న వాద్‌నగర్‌లోని చారిత్రక హాట్కేశ్వర్ మహాదేవ్ ఆలయంలో సేవా సంకల్ప యాత్ర ముగియనుంది. సేవా యాత్రికులు ఆలయంలో జలాభిషేకం నిర్వహించి, ప్రార్థనలు చేయడంతో పాటు సేవా స్ఫూర్తిని కొనసాగించేందుకు సంకల్పం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి, బీజేపీ ఆల్ సెల్స్ కోఆర్డినేటర్ వీడీ శర్మ పాల్గొని ప్రసంగించనున్నారు. వేలాది మంది సేవా యాత్రికులు, కార్యకర్తలు ఈ ముగింపు కార్యక్రమానికి హాజరుకానున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా సేవలో 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ యాత్రను సామాజిక సేవా కార్యక్రమాలతో అనుసంధానించారు. యువతను సామాజిక సేవలో భాగస్వామ్యం చేసేందుకు పరిశుభ్రత కార్యక్రమాలు, మొక్కల నాటడం, నీటి సంరక్షణ, గోసేవ, వృద్ధాశ్రమాల్లో సేవ, లబ్ధిదారులతో సమావేశాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వాద్‌నగర్ నుంచి ప్రారంభమైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా ప్రస్థానం, ఆయనకు పార్లమెంటరీ మరియు ఆధ్యాత్మిక అనుబంధానికి కేంద్రంగా మారిన వారణాసి వరకు సాగిన ఈ యాత్రకు రెండు ప్రాంతాల్లో జరిగే ముగింపు కార్యక్రమాలు ప్రతీకాత్మకంగా నిలవనున్నాయి. బుధవారం జరిగే ముగింపు కార్యక్రమం కేవలం సేవా సంకల్ప యాత్ర ముగింపుగా కాకుండా, సమాజ సేవ దేశ నిర్మాణంలో కార్యకర్తలు సంకల్పం తీసుకునే సందర్భం.

## హౌతీ దాడులతో సౌదీలో ఉద్రిక్తత

### బలగాలు పంపేందుకు పాక్, తుర్కియే కీలక నిర్ణయం

### మక్కా రక్షణ ఒప్పందం అమలులోకి.. కీలక పరిణామం

**రియాద్, అక్టోబరు 6:** మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హౌతీ దాడుల నేపథ్యంలో సౌదీ అరేబియాకు సైనిక బలగాలను మోహరించేందుకు పాకిస్థాన్, టర్కీ అంగీకరించినట్లు ఓ మీడియా నివేదిక వెల్లడించింది. సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ దేశాల మధ్య ఏర్పడిన మక్కా డిఫెన్స్ అలయన్స్ ఇప్పుడు సైనికపరంగా అమలులోకి వచ్చే దిశగా అడుగులు వేస్తోంది. సౌదీ అరేబియాలోని రియాద్‌లో సోమవారం వ్యూహాత్మక రాజకీయ,రక్షణ కమిటీ (ఎస్‌పిడిసి) అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో మూడు దేశాల భద్రతకు ఎదురవుతున్న ముప్పులు, ప్రాంతీయ పరిణామాలపై చర్చించారు. పాకిస్థాన్ విదేశాంగ శాఖను ఉటంకిస్తూ డాన్ పత్రిక ఈ వివరాలను వెల్లడించింది. సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ దేశాలు గత ఆగస్టులో త్రైపాక్షిక రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నాయి.

ఈ ఒప్పందం ప్రకారం మూడు దేశాల్లో ఏదైనా ఒక దేశంపై సాయుధ దాడి జరిగితే, దానిని మూడు దేశాలపై జరిగిన దాడిగా పరిగణించి సమష్టిగా స్పందించే విధానం ఏర్పాటైంది.

## 13కోట్ల ఓటర్ల లెక్కలు ఇవిగో.. ఇవికూడా తప్పేనంటారా?

### రాహుల్, సిజెపి విమర్శలపై బిజెపి సుధాంశుత్రివేది

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం అవకతవకలకు పాల్పడిందని, సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నాయి. 13 కోట్ల మంది ఓటర్లను ఎన్నికల సంఘం తొలగించిందని ఆరోపిస్తున్నాయి. ఈ ఓటర్లను మళ్లీ జాబితాలో చేర్చాలని 2025కు ముందున్న ఓటర్ జాబితానే కొనసాగించాలని కాంగ్రెస్, కాక్రోచ్ జనతా పార్టీలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ 13 కోట్ల ఓటర్ల వివరాలను బీజేపీ క్లియర్‌గా వివరించింది. ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది మాట్లాడుతూ ఈ 13 కోట్ల మందిలో మరణించిన వారు, నివాసం మారిన వారు, ఆచూకీ లభించని వారు ఉన్నారని చెప్పారు. ఎన్నికల సంఘం గణాంకాలను ఉటంకిస్తూ 2.8 కోట్ల మంది మరణించారని, 6.3 కోట్ల మంది నివాసం మారారని, 1 కోటి మంది డూప్లికేట్ ఓటర్లు అని, 3 కోట్ల మంది ఆచూకీ లభించలేదని చెప్పారు. నకిలీ ఓటర్లను కాపాడాలని కాంగ్రెస్ అనుకుంటోందా అని త్రివేది ప్రశ్నించారు. ఇలా చేయడం ద్వారా కాంగ్రెస్ ఎవరికి మేలు చేయాలని అనుకుంటోంది అని అడిగారు. గత 10 నెలల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు ఎన్నికల కమిషన్ నిర్ణయాలను 14 సార్లు వ్యతిరేకించారని ఆంగ్లపత్రిక కథనంలో వెల్లడించింది.

# సంక్షిప్త వార్తలు

## రెజినగర్ ఉప ఎన్నికల వేళ హుమాయూన్ కబీర్ అదుపులోకి



**ముర్షిదాబాద్, అక్టోబరు 6:** రెజినగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల పోలింగ్ కొనసాగుతున్న వేళ ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ అధినేత, ఎమ్మెల్యే హుమాయూన్ కబీర్‌ను చట్టాన్ని ఉల్లంఘించిన కారణంగా అదుపులోకి తీసుకున్నట్లు బెల్దంగా ఎస్‌డీపీఓ ఆనంద్‌జిత్ హోర్ తెలిపారు. ముర్షిదాబాద్‌లోని తన పార్టీ కార్యాలయం నుంచి రెజినగర్ పోలీసులు హుమాయూన్ కబీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. చట్టాన్ని ఉల్లంఘించినందుకే హుమాయూన్ కబీర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌డీపీఓ ఆనంద్‌జిత్ హోర్ తెలిపారు.

## హెలికాప్టర్ దిగుతూ తూలిపడబోయిన ఉషావాన్స్



**సెయింట్‌ఆండ్రూస్ ఎయిర్‌బేస్, అక్టోబరు 6:** అమెరికా సెకండ్ లేడీ, అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ భార్య ఉషావాన్స్ ఎంతో సెక్యూరిటీ మధ్య ఉంటున్నా ఆమెకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. నవజాత శిశువు అలెక్‌ను బేబీ క్యారియర్‌లో ఎత్తుకుని హెలికాప్టర్ మెట్లు దిగుతుండగా ఒక్కసారిగా కాలుజారి పడబోయారు. అయితే వెంటనే తేరుకుని రైలింగ్‌ను పట్టుకుని బ్యాలెన్స్ చేసుకున్నారు. అనంతరం శిశువు వీపుపై చేయి వేసి ధైర్యపరిచి చిరునవ్వుతో ముందుకు సాగిపోయారు.

## వైమానికదళ విమానానికి ప్రమాదం - 32 మంది మృతి



**అబూజా, అక్టోబరు 6:** నైజీరియా వైమానిక దళానికి చెందిన ఎటీఆర్42 విమానం అనూహ్య రీతిలో ప్రమాదానికి గురైంది. ఒండో రాష్ట్రంలోని ఇగ్బోకోడా సమీపంలో ఉన్న నావల్ బేస్ వద్ద ఈ విమానం ఒక్కసారిగా కూలిపోయింది. బెనిన్ నగరం నుంచి లాగోస్ వైపు సాధారణ పర్యటనలో భాగంగా వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ విస్ఫోటనంలో విమానంలో ప్రయాణిస్తున్న 25 మంది ప్రయాణికులు, ఏడుగురు సిబ్బంది కలిపి మొత్తం 32 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర ప్రమాదంలో నైజీరియా ఎయిర్ మార్షల్, చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ సండే కెల్విన్ అనేకే కూడా కన్నుమూశారు.

## మోడీపై ట్రంప్‌కు మంచి అభిప్రాయం: ఆసీస్ ప్రధాని కెవిన్‌రడ్

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** భారత ప్రధాని నరేంద్ర మోడీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చాలా మంచి అభిప్రాయం ఉందని ఆస్ట్రేలియా మాజీ ప్రధాని కెవిన్ రడ్ పేర్కొన్నారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం వంటి కీలక సాంకేతిక రంగాల్లో భారత్‌అమెరికా ముందుకు సాగుతున్న సమయంలో కెవిన్ రడ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి సుంకాలు, మార్కెట్ ప్రవేశంపై చర్చలు కఠినంగా ఉన్నప్పటికీ, అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య చర్చలలో భారతదేశం సాపేక్షంగా బలమైన స్థితిలో ఉందని రడ్ అన్నారు.

## చెన్నై పోర్టులో రూ.12 కోట్ల చైనా పైరోటెక్నిక్ క్రాకర్స్ స్వాధీనం



చెన్నై, అక్టోబరు 6: చెన్నై పోర్టులో అక్రమంగా భారీగా దిగుమతి చేసిన చైనా బాణసంచాను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ డీఆర్ఐ జోనల్ యూనిట్ నుంచి అందిన సమాచారంతో అధికారులు చెన్నై పోర్టులోని పలు కంటైనర్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.12 కోట్ల విలువైన చైనా పైరోటెక్నిక్ బాణసంచా బయటపడింది. స్టేషనరీ, మెడికల్ గ్లౌజులు, ప్లాస్టిక్ క్లిప్స్, హెయిర్ బ్యాండ్స్, స్టోరేజ్ వార్డ్‌రోబ్స్, షూ ర్యాక్స్ వంటి వస్తువుల పేరుతో సరుకును దిగుమతి చేసినట్లు గుర్తించారు.

వార్త, హైదరాబాద్, బుధవారం 7, అక్టోబరు 2026

# రాష్ట్రంలో రూ.40వేల కోట్ల మద్యం ఆదాయం

**ప్రివిలేజ్ ఫీజు నిర్ణయంతో బార్ యజమానులకు నష్టం లేదు**

**కేవలం వినియోగదారులపైనే స్వల్పంగా పడుతున్న భారం**

**బార్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ నిరసనలపై**

**మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందన**

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా ప్రతిపాదించిన ప్రివిలేజ్ ఫీజు నిర్ణయం వల్ల బార్ యజమానులకు ఎలాంటి నష్టం వాటిల్లదని, ఈ ప్రభావం కేవలం వినియోగదారులపై మాత్రమే స్వల్పంగా పడుతుందని తెలంగాణ ఎక్సైజ్,టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రివిలేజ్ ఫీజును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బార్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ నిరసనలు చేపడుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. హైదరాబాద్ నగరం అన్ని రంగాల్లో అప్‌గ్రేడ్ అయినందున, ఇతర పొరుగు రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలకు అనుగుణంగానే ఇక్కడా బార్ లైసెన్సులను జారీ చేశామని తెలిపారు. మద్యం ధరలు పెంచినంత మాత్రాన వినియోగం తగ్గినట్లు ఎక్కడా లేదని, గత అనుభవాలను పరిశీలిస్తే ధరల పెంపు వల్ల ప్రభుత్వానికి రాబడి పెరుగుతుందే తప్ప విక్రయాలు పెద్దగా తగ్గవని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో మద్యం ద్వారా వస్తున్న ఆదాయ గణాంకాలను ఈ సందర్భంగా మంత్రి జూపల్లి గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మద్యం ద్వారా వచ్చే రాబడి రూ.10,000 కోట్ల నుంచి ఏకంగా రూ.36,000 కోట్లకు, అంటే దాదాపు 260 శాతం మేర పెరిగిందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ద్వారా వస్తున్న ఆదాయం ప్రస్తుతం రూ.40,000 కోట్లకు చేరిందని వెల్లడించారు. ప్రభుత్వం నిబంధనలు, చట్ట ప్రకారమే ముందుకెళ్తాందని, రాష్ట్రంలో మద్యం ఉత్పత్తికి నీటి కొరత వంటి సమస్యలేవీ లేవని మంత్రి స్పష్టం చేశారు.

# సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేసి విచారించాలి

**భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** భారత ఎన్నికల చీఫ్ కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే నైతిక బాధ్యతగా రాజీనామా చేయాలని ఆయన అలా చేయకపోయినా వెంటనే అరెస్టు చేసి విచారణ జరపాలనీ భువనగిరి ఎంపి చామల కిరన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ 50 యేళ్ల మేమే అధికారంలో ఉంటామని మోదీ అంటున్నారనీ దీనికి బిజెపి కార్యకర్తలా జ్ఞానేశ్ కుమార్ వ్యవహరిస్తున్నారనీ విమర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని బిజెపి నిర్వీర్యం చేసిందనీ ఆయన ఆవేదన చెందారు. జెన్‌జి రోడ్డు ఎక్కితే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు పార్లమెంట్ సభ్యులు మకర్ ద్వార్ నుంచి ఎన్నికల సంఘం ఆఫీస్ వరకు ధర్నా చేయాల్సిన పరిస్థితి బిజెపి తీసుకువచ్చింది అని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమీషనర్ ను ఎన్నుకునే కమీటీలో కేంద్ర క్యాబినెట్ మినిస్టర్ ను చేర్చారు. దేశంలో 13 కోట్ల ఓట్లను తొలగించారనీ జ్ఞానేశ్ కుమార్ తప్పులు చేశారని సుప్రీంకోర్టు చెప్పిందనీ ఆయన తెలిపారు. ఢిల్లీలో యువత రోడ్డు ఎక్కితే పోలీసులతో లాఠీఛార్జి చేశారనీ ఆయన వివరించారు.పార్లమెంట్ సభ్యుల ర్యాలీకి ఆటంకం కలిగించేందుకు పోలీసు బలగాలను దింపారని ఆరోపించారు. మీడియా కవర్ చేయకుండా ఆంక్షలు విధించారు తప్పు చేయకపోతే ఎస్ఐఆర్‌పై పార్లమెంట్‌లో చర్చించడానికి బిజెపికి ఎందుకు భయమని ప్రశ్నించారు.

# ఉచిత కుట్టుమెషిన్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రారంభం

**రాష్ట్రంలో 4.80 లక్షల దరఖాస్తులు**

**అత్యధికంగా నల్గొండ జిల్లాలో 29,500**

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త :** బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థికంగా చేయూతనిచ్చే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇంటింటా ఇందిరమ్మ ఉచిత కుట్టుమెషీన్ల పథకానికి విశేష స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా 1.19 లక్షల కుట్టుమెషీన్లను మంజూరు చేయాలని బీసీ సంక్షేమ శాఖ లక్ష్యాన్ని నిర్ధారించగా, ఈ పథకానికి సుమారు 4.80 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు బీసీ కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు. దీంతో అధికారులు ఈ దరఖాస్తులను పరిశీలించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ పథకానికి రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 13 నుండి దరఖాస్తుల స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 30వ తేదీతో గడువు ముగిసేసరికి భారీ సంఖ్యలో అప్లికేషన్లు వచ్చాయి. రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి వెయ్యి చొప్పున మొత్తం 1.19 లక్షల కుట్టుమెషీన్లను 100 శాతం సబ్సిడీపై ఉచితంగా అందించనున్నారు. ముఖ్యంగా టాప్ 5 జిల్లాల్లో నల్గొండ నుంచి అత్యధికంగా 29,500 దరఖాస్తులు రాగా, తర్వాతి స్థానాల్లో 26,961 దరఖాస్తులతో నిజామాబాద్, 26,784 దరఖాస్తులతో జగిత్యాల, 24,600 దరఖాస్తులతో సిద్దిపేట, 23,500 దరఖాస్తుతో కరీంనగర్ జిల్లాలు నిలిచాయి. అయితే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో మాత్రం దరఖాస్తుల సంఖ్య తక్కువగా నమోదైంది. ప్రస్తుతం దరఖాస్తుల గడువు ముగియడంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. నియోజకవర్గాలు, మండలాల వారీగా ఎంపీడీవోలు అర్హులను గుర్తించి జాబితాను కలెక్టర్లకు సమర్పిస్తారు. మరోసారి సమగ్ర పరిశీలన తర్వాత జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి పంపి తుది జాబితాను ఖరారు చేయనున్నారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎంపిక ప్రక్రియకు సుమారు రెండు నెలలు పట్టే అవకాశం ఉండగా, నవంబర్ 19న లేదా డిసెంబర్ 9న కుట్టుమెషీన్ల పంపిణీ చేపట్టే యోచనలో ప్రభుత్వం ఉంది. మరోవైపు కుట్టుమెషీన్ల సరఫరా కోసం టెండర్ల దాఖలు గడువును ఈ నెల 8 వరకు పొడిగించారు. ఉషా, సింగర్, బ్రదర్ వంటి వివిధ కంపెనీలు ఈ టెండర్లు వేసినట్లు తెలియవచ్చింది.

# మొక్క నాటడమే కాదు.. సంరక్షణే అసలు బాధ్యత

**పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

**జీడిమామిడి సాగుతో ప్రకృతికి రక్షణ,**

**రైతులకు దీర్ఘకాలిక ఆదాయం: గవర్నర్ శివ్‌ప్రతాప్‌శుక్లా**



రామాయంపేటలో మొక్క నాటుతున్న గవర్నర్ శివ్‌ప్రతాప్‌శుక్లా

**రామాయంపేట, అక్టోబరు 6, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించి విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు పూనుకోవాలని గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా పిలుపు నిచ్చారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంతోపాటు రైతులకు అదనపు, దీర్ఘకాలిక ఆదాయ మార్గాలను కల్పించే ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా మెదక్ జిల్లా రామాయంపేటలో సోమవారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని జీడిమామిడి మొక్కలను నాటారు. అనంతరం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో మహిళలతో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.

మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని గవర్నర్ పేర్కొన్నారు. అయితే మొక్కలు నాటడంతో కార్యక్రమం పూర్తికాదని, అవి ఎదిగే వరకు నిరంతరం సంరక్షి ంచినప్పుడే అసలు లక్ష ్యం నెరవేరుతుందని స్పష్టం చేశారు. జీడిమామిడి వంటి ఉద్యాన పంటల సాగుతో రైతులకు దీర్ఘకాలికంగా మంచి ఆదాయం లభించే అవకాశం ఉందని గవర్నర్ శివప్రతాప్‌శుక్లా తెలిపారు. సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతతోపాటు ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమని గవర్నర్ అన్నారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా జాతీయ రహదారికి ఇరువైపుల జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినందుకు ఎంపి రఘునందన్‌రావును అభినందించారు. మెదక్ ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మానవ జీవితం పూర్తిగా ప్రకృతిపైనే ఆధారపడి ఉందని, భావితరాల కోసం పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రామాయంపేటలో మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరైన గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# కెసిఆర్, రేవంత్ కుటుంబాల ఆస్తులపై విచారణ జరపండి

**హైకోర్టు చీఫ్‌జస్టిస్‌కు బిజెపి ఎంపి రఘునందన్‌రావు లేఖ**

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల మధ్య సాగుతున్న రాజకీయ ఆరోపణల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులకు భారీగా ఆస్తులు ఉన్నాయంటూ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు ఆరోపిస్తుండగా.. వాటికి బిఆర్ఎస్ కౌంటర్ ఇస్తోంది. సిఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులకు భారీగా ఆస్తులు ఉన్నాయంటూ గులాబీ నేతలు ప్రతివిమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్, రేవంత్ రెడ్డి కుటుంబాలకు భారీగా ఆస్తులు ఉన్నాయంటూ బీజేపీ కూడా మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఈ వివాదంలోకి బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కూడా ఎంట్రీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన ఆస్తులపై సమగ్ర విచారణ జరిపించాలని రఘునందన్‌రావు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరిపై మరొకరు చేస్తున్న ఆస్తుల ఆరోపణల్లో నిజానిజాలను వెలికితీయాలని కోరారు. ఈ ఫిర్యాదును ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)గా లేదా విచారణకు సంబంధించిన ఇతర తగిన రూపంలో స్వీకరించాలని హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు విజ్ఞప్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్‌తో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం చేసుకుంటున్న ఆరోపణలపై స్వతంత్రంగా విచారణ జరగాల్సిన అవసరం ఉందని రఘునందన్ రావు పేర్కొన్నారు. ఈ నెల 2న తాను చేసిన ప్రకటనకు అనుగుణంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. పత్రికల్లో ప్రచురితమైన కథనాలు, ఆరోపణలకు సంబంధించిన వివరాలను సేకరించి, అవసరమైన పత్రాలను ఫిర్యాదుకు జతచేసినట్లు చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబం లక్ష కోట్ల రూపాయలు దోచుకుందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారని పేర్కొన్న రఘునందన్‌రావు.. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో రూ.50 వేల కోట్లు సంపాదించారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణల్లో నిజానిజాలు తేల్చేందుకు సమగ్ర విచారణ జరపాలని కోరారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తులతో పాటు, వాటికి మించి ఇతర ఆస్తులు ఉన్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కుటుంబానికి సంబంధించి ప్రతిపక్ష నేతలు ప్రస్తావిస్తున్న మెడికవర్ ఆస్పత్రి, స్కూళ్లు, ఇతర వ్యాపారాలకు సంబంధించిన ఆరోపణలపైనా నిజానిజాలు బయటపడాల్సిన అవసరం ఉందని రఘునందన్ రావు పేర్కొ న్నారు. ఆస్తుల అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న సమయంలో రఘునందన్ రావు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# డ్రగ్స్‌రహిత సమాజం కోసం వచ్చే నెల పాదయాత్ర

**కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి**



మహిళా చైతన్య సదస్సులో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో బిజెపి నేతలు డా.గౌతంరావు, కృష్ణాయాదవ్, లంకల దీపక్‌రెడ్డి, డా.ఓ.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** నేడు రాష్ట్రంలో యువత, పిల్లలు గంజాయి, డ్రగ్స్ బారిన పడుతున్నారని, డ్రగ్స్ రహిత సమాజం కోసం మహిళలు ముందుకు రావాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం అంబర్‌పేటలో జరిగిన మహిళా చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. పంజాబ్ రాష్ట్రం లాంటి పరిస్థితి తెలంగాణకు రాకుండా ప్రతి మహిళా అప్రమత్తంగా ఉంటూ ఇంట్లోని పిల్లలపై నిఘా పెట్టాలని పిలుపు నిచ్చారు. 2029 నాటికి భారతదేశాన్ని డ్రగ్స్ రహిత దేశంగా (నషా ముక్త భారత్) మార్చాలని ప్రధాని మోదీ సంకల్పించారని, ఇందులో భాగంగా నవంబర్‌లో రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్‌లో ప్రమాదకర డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో తెలంగాణ ఆడబిడ్డలందరూ భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దేశంలో మహిళలు అన్ని రంగాల్లోనూ అద్భుతమైన రాణిస్తున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. గిరిజన మహిళ ద్రౌపది ముర్ము దేశ రాష్ట్రపతిగా, తెలంగాణ కోడలు నిర్మలా సీతా రామన్ కేంద్ర ఆర్థిక మంత్రిగా సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. విమానాలు, యుద్ధ విమానాలు నడప డంతోపాటు సైనిక రంగం లోనూ, పెద్ద కంపెనీలకు నేతృత్వం వహించడం లోనూ మన మహిళలే ముందంజలో ఉన్నార న్నారు. ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన పత కాల్లో అత్యధికంగా మహి ళలే సాధించి దేశ పతా కాన్ని రెపరెపలాడిం చారని అభినందించారు.

**బ్యాంకుల ద్వారా**

**రూ.20 లక్షల వరకు రుణాలు**

ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా మహిళా పొదుపు సంఘా లకు రూ.20 లక్షల వరకు రుణాలు ఇప్పిస్తూ తగిన ప్రోత్సా హం అందిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు.కొన్ని బ్యాంకులు మహిళా పొదుపు సంఘాలకు తక్కువ మొత్తంలో రుణాలు ఇస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, త్వరలో బ్యాంకు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

**17న అంబర్‌పేటలో బతుకమ్మ పండుగ**

ఈ యేడాది కూడా అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో ఈనెల 17న సాయంత్రం 5 గంటలకు బతుకమ్మ వేడుకలను నిర్వహించ నున్నట్లు తెలిపారు.ఈ వేడుకల్లో గవర్నర్ దంపతులను ఆహ్వానిస్తామని చెప్పారు. బతుకమ్మ వేడుకల్లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా రచనలు, పాట,ఆటలు వినిపించాలని కోరారు.అంబర్ పేట ప్రాంత ప్రజలంతా బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ముఖ్యమంత్రిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదు

**కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఇందిరాశోభన్**

**హైదరాబాద్, అక్టోబరు6,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులపై ఉద్దేశపూర్వకంగా, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అసత్య ఆరోపణలు చేస్తున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీరుపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఇందిరాశోభన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రిని రాజకీయంగా ఎదుర్కోలేకనే కెటిఆర్ ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆమె ఘాటుగా విమర్శించారు. నిన్న మొన్నటి దాకా ముఖ్యమంత్రి సోదరులైన కొండల్ రెడ్డి, తిరుపతిరెడ్డిలపై అక్కసు వెళ్లగక్కిన బావాబామ్మర్దులు, ఆ ఆరోపణలన్నీ అసత్యాలే అని తేలిపోవడంతో తీవ్ర నైరాశ్యంలో కూరుకుపోయారని ఎద్దేవా చేశారు. ఆ ఆరోపణలన్నీ అబద్ధాలు అని ప్రజలకు స్పష్టంగా తెలియడంతో, ఇప్పుడు ఏకంగా రేవంత్ రెడ్డి గారి సతీమణి గీతమ్మ, ఆయన కూతురు, అల్లుడుపై దృష్టి సారించడం వారి దిగజారుడుతనానికి నిదర్శనం అని ఇందిరాశోభన్ దుయ్యబట్టారు. బిఆర్ఎస్ పెయిడ్ సోషల్ మీడియా బ్యాచ్ ద్వారా పనిగట్టుకుని ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులపై అసత్య ఆరోపణలు చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. కనీస సిగ్గు లేకుండా ఇష్టానుసారంగా ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేయడం వల్ల రేవంత్ రెడ్డి గారి కుటుంబ సభ్యులు ఎంతో మానసిక క్షోభను అనుభవిస్తున్నారని ఇందిరాశోభన్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు, కుటుంబానికి ముడిపెడుతూ ఈ తరహా ఆరోపణలు చేసే సోషల్ మీడియా బ్యాచ్‌పై చట్టపరమైన చర్యలు తప్పవని, వారు కఠినమైన శిక్షలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆమె తీవ్రంగా హెచ్చరించారు. అంతేకాకుండా, భువనగిరి పార్లమెంట్ సభ్యులు, రాజకీయాల్లో హుందాతనం పాటించాలని, కుటుంబ సభ్యులను లాగడం మానుకోవాలని స్పష్టం చేశారు. ఇలాగే కేటీఆర్ దిగజారుడు రాజకీయాలు కొనసాగిస్తే, రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కదని, ప్రజలు తగిన బుద్ధి చెబుతారని గుర్తుంచుకోవాలని ఇందిరాశోభన్ హెచ్చరించారు.

**బకాయిల విషయంలో మత్స్య, ఆర్థిక శాఖలకు**

# హైకోర్టు ధిక్కార నోటీసులు

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** చేపల కాంట్రాక్టర్‌కు బకాయిల చెల్లింపు విషయంలో తన ఆదేశాన్ని పాటించనందుకు తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాధికారులకు తెలంగాణ హైకోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీ చేసిన వారిలో మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, రంగారెడ్డి కలెక్టర్‌తో పాటు, మరో ఇద్దరు మత్స్యశాఖ అధికారులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవిదేవి నోటీసులు జారీ చేశారు. 2025 నవంబర్ 25 నాటి ఉత్తర్వును ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిందని ఆరోపిస్తూ, చేపల కాంట్రాక్టర్ ధిక్కార పిటిషన్‌ను దాఖలు చేశారు. విచారణ నివేదికలో సంబంధిత కాంట్రాక్టర్ పేరు ఉందో లేదో ధృవీకరించుకోవాలని, ఒకవేళ విచారణతో సంబంధం లేకపోతే, వర్తించే వడ్డీతో సహా అతని బకాయిలను విడుదల చేయాలని మునుపటి ఉత్తర్వుల్లో అధికారులను ధర్మాసనం ఆదేశించింది. అయితే అధికారులు ఆ ఉత్తర్వును పాటించడంలో విఫలమయ్యారని కాంట్రాక్టర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ధిక్కార చర్యలను ఎందుకు అనుమతించకూడదో కారణాలు చూపాలని, అలాగే ఈ నెల 30 న వ్యక్తిగతంగా లేదా, నియమించబడిన న్యాయవాది ద్వారా గానీ హాజరు కావాలని కోర్టు ప్రతివాదులను ఆదేశించింది. హాజరు కాకపోతే, ఈ కేసు ఏకపక్షంగా విచారించబడుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది.




సదస్సులో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**గత ప్రభుత్వ ఆర్థిక అరాచకత్వం వల్లే**

# ఆర్థిక వ్యవస్థ దివాలా

**ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆరోపణ**

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 6, ప్రభాతవార్త:** మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలం గాణ ఆర్థిక వ్యవస్థను దివాలా తీయించింది గత ప్రభుత్వ ఆర్థిక అరాచకత ్వ మేనని ప్రభుత్వ విప్ వేముల విరేశం ఆరోపించారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాలలో ఆర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఆర్థిక సామాజిక సద స్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వం చేసిన తప్పుడు విధానాల వల్ల నేడు మనం బాధ్యత వహించవలిసి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు 369 కోట్ల రూపాయల మిగుల బడ్జెట్‌తో ఏర్పడిన నూతన తెలంగాణ రాష్ట్రం 4.4 లక్షల కోట్ల అప్పులు చేయడంతో నేడు దానికి వడ్డీ కట్టడానికి ఇబ్బందులకు గురయ్యేపరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ ఆదాయం నుంచి 14.5 శాతం వడ్డీలు కట్టడానికే సరిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులలో కాగ్ ఇచ్చిన నివేదిక సారాంశాల ఫలితం నుంచి ప్రజా ఆమోదయోగ్యమయ్యేలా భవిష్యత్ తరాలకు నష్టం జరగనివిధంగా ప్రభుత్వ ఆదాయాల పెంపు మార్గాల గురించిన ఆలోచనల అవశ్యకత నేడు ఉందన్నారు. సమగ్ర అభివృద్ధి సాధించి ప్రజా వ్యయాలు ఏవిధంగా ఉండాలో తెలపాలని కోరారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను సమగ్రంగా, సమిష్టి ఆలో చనల ఫలితంగా అభివృద్ధి సాధించుకుందామని వేముల విరేశం పిలుపు నిచ్చా రు. ఈ సదస్సులో నిజాం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాస్, వైస్- ప్రిన్సి పల్ ఇన్‌చార్జి అర్ధశాస్ర అధిపతి డా.హారతిజాదవ్, ప్రొఫెసర్ జి. రామకృష్ణ, ప్రొఫెసర్ ఎం.రాములు, ప్రొఫెసర్ ఎం.ఎ మాలిక్, డా.అక్కెనపల్లి మీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ ట్రక్‌షీట్ విధానంతో మిల్లర్ల దోపిడీకి అడ్డుకట్ట

**ఫిజికల్ వెరిఫికేషన్ యాప్**

**మిల్లరు తరుగు, కోత నిలువరించేనా?**

**జిపిఎస్ వాహనాలు ఎస్‌హెచ్‌టి**

**విధానంపై రైతుల ఉత్కంఠ**

**హైదరాబాద్,అక్టోబరు6,ప్రభాతవార్త:** ఖరీఫ్‌లో రైతుల నుంచి సేకరించే ధాన్యం కొనుగోలులో మిల్లర్లు తరుగుఅవుటర్న్ పేరిట దోపి జరిపే దోపిడీని నివారించడానికి ప్రభుత్వం గత యాసంగి సీజన్లోనే వారం రోజులు అమలు చేసి విరమించిన ఆన్‌లైన్ ట్రక్ షీట్ విధానం తిరిగి అమలు చేయాలని తెలంగాణ రైతులు కోరుకొంటున్నారు. సివిల్ సప్లయ్ శాఖ గోదాములు హమాలీలు రవాణా వ్యూహంతో పాటు ఫిజికల్ వెరిఫికేషన్ మోబైల్ యాప్‌ను ఉపయోగించే కొత్త విధానంతో ధాన్యం కొనుగోలు అక్రమాలను అడ్డుకట్టవేయడానికి కసరత్తు చేస్తున్నా రైతును మిల్లర్ల నుంచి దోపిడి చేయకుండా ఇవి నిలువరించలేవని సర్వత్రా అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కాంటా సమయంలో కొనుగోలు కేంద్రంలోనే రైతు సమక్షంలోనే ఆన్లైన్ ట్రక్ట్ జనరేట్ కావడంతో మిల్లర్లు ధాన్యం కోత పెట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈ విధానంపై అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ట్రక్ట్ విధానం కేవలం వారం రోజులు అమలు చేసి మిల్లర్ల నుంచి వచ్చిన ఒత్తిడితో రద్దుచేసి, మాన్యువల్ ట్రక్ట్ విధానం అమలు చేశారు. నాణ్యత పేరుతో మిల్లర్లు తరుగు దోపిడీ చేసేందుకు మ్యానువల్ ట్రక్‌షీట్‌విధానం దోహదం చేసింది. గత యాసంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వెళ్లిన ప్రతి లారీలో క్వింటాళ్ల కొద్ది ధాన్యం కోత పెట్టడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. ప్రతి సంవత్సరం తరుగు పేరుతో జరుగుతున్న దోపిడీ దందా గురించి అధికారులకు తెలిసినా మిల్లర్ల నుంచి వచ్చే ముడుపులకు ఆశపడి పారదర్శకత లేని మాన్యువల్ ట్రకోట్ విధానానికే అధికారులు మొగ్గు చూపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా ఎల్‌నీనో ప్రభావంతో వానాకాలం సీజన్‌లో దిగుబడి అయ్యే65లక్షల మెట్రిక్ టన్నులధాన్యం సేకరణకు8283 ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరిచి తెలంగాణ పౌరసరఫరాల శాఖ అధికారులు సేకరణ దిశగా అడుగులు వేస్తోన్నది. ఉమ్మడి నల్లగొండ జిల్లా కు చెందిన గుండాల ప్రాథమిక సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో ఒక రైతు నుంచి సేకరించి ధాన్యంను వరంగల్ జిల్లా రైస్‌మిల్లుకు దించడానికి రవాణా చేయగా ఏడు క్వింటాళ్ల తరుగు కింద కోతను విధించడంతో అప్పట్లో వివాదం జరిగింది. ధాన్యం తరలించే ప్రతివాహనంకు జిపిఎస్ విఎల్‌టిఎస్ ట్రాకింగ్ సిస్టమ్ ఉన్నా తరుగు అనే రైసుమిల్లరు ను ఎలా అధిగమిస్తారని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎల్నినో ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వరి సాగు విస్తీర్ణం తగ్గడమే కాకుండా సాగుచేసిన క్షేత్రాలలో కూడా ధాన్యం దిగుబడి సైతం తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ధాన్యం కొనుగోళ్లలో ఆన్లైన్ ట్రక్ట్ విధానం అమలు చేస్తే తరుగు పేరుతో జరిగే దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని రైతులు, రైతు సంఘాలు నాయకులు కోరుతున్నారు. ఫిజికల్ వెరిఫికేషన్ యాప్ మిల్లర తరుగును ఏమేరకు నిలువరిస్తుందని రైతులు సందేహం వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు కొత్తగా ఎస్‌హెచ్ఇ జిపిఎస్ వాహానాలవాడకంతో రైతుల్లో ఉత్కంఠ మొదలైంది. రోజుల తరబడి ధాన్యం తరలించకుండా గతంలో తమను కొనుగోలు కేంద్రాల్లో ఓపెన్‌జైల్‌లో బందించినట్లు ఇప్పుడు జరగకపోవచ్చని అంతా భావిస్తున్నారు. ఏదీ ఏమైనా రాబోయే ఇరువై రోజుల్లో కొత్త ధాన్యం సేకరణ విధానం రైతులకు ఎంత వరకు మేలు చేయబోతుందో వేచి చూడాల్సి ఉంది.

# కరవు పరిస్థితులపై పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేయాలి



మంగళవారం సచివాలయంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు

**అక్టోబరు ఆఖరులోగా రిపోర్టు రూపొందించాలి**

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు**

**హైదరాబాద్,అక్టోబరు6,ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితులపై పూర్తి స్థాయి నివేదికను వెంటనే సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖపై మంగళవారం సచివాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విపత్తుల నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, కార్యదర్శులు దాసరి హరిచందన, గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 320 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కరువు పరిస్థితులపై ప్రణాళిక, రెవెన్యూ, గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, పంచాయ తీరాజ్, గ్రామీణ మంచి నీటి సరఫరా తదితర శాఖల నుంచి సమగ్ర వివరాలను సేకరించి, నిబంధనల ప్రకారం కరువు ప్రభావిత మండలాలను గుర్తించాలని ఆదేశించారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగిన నైరుతి రుతుపవనాల సీజన్‌లో నమోదైన వర్షపాతం సహా 12 ప్రామాణిక అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర కరువు నివేదికను రూపొందించాలని సూచించారు.

ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశించిన ప్రమాణాలను ప్రామాణికంగా తీసుకుని కరువు ప్రభావిత మండలాలను ప్రకటించే ప్రక్రియను చేపట్టాలని, ఇందుకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను అక్టోబర్ మాసాంతంలోగా సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో, ఆ సమావేశానికి అవసరమైన అన్ని వివరాలతో సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆయన అధికారులను కోరారు.



## విండీస్‌తో తొలి టి-20 మ్యాచ్‌లో భారత్ ఘన విజయం

**లక్నో, అక్టోబరు 6:** నగరంలోని ఏకనా క్రికెట్ స్టేడియంలో వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత జట్టు ఘన విజయం సాధించింది. వెస్టిండీస్ నిర్దేశించిన 172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబరిచింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ సెంచరీతో చెలరేగిపోవడంతో, భారత్ కేవలం 14.4 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి సులభంగా లక్ష్యాన్ని ఛేదించింది. దీనితో మూడు టీ20ల సిరీస్‌లో భారత్ 10 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత ఓవర్లలో 171 పరుగులు చేయగా లక్ష్య ఛేదనలో భారత ఓపెనర్లు రాణించే ప్రయత్నం చేశారు. సంజూ శాంసన్ (11) త్వరగానే వెనుదిరిగినప్పటికీ, మరో ఓపెనర్ అభిషేక్ శర్మ దూకుడుగా ఆడి 10 బంతుల్లోనే 21 పరుగులు చేసి ఔటయ్యారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్, కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌తో కలిసి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశారు. ముఖ్యంగా శ్రేయాస్ అయ్యర్ కరేబియన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 43 బంతుల్లోనే 10 ఫోర్లు, 6 భారీ సిక్సర్ల సహాయంతో అజేయంగా 102 పరుగులు సాధించి అద్భుత సెంచరీ నమోదు చేశారు. అతని విధ్వంసకర బ్యాటింగ్ స్ట్రైక్ రేట్ ఏకంగా 237.21గా ఉంది.మరోవైపు ఇషాన్ కిషన్ కూడా బాధ్యతాయుతంగా ఆడుతూ 27 బంతుల్లో 5 ఫోర్లతో అజేయంగా 37 పరుగులు చేశారు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు అజేయమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును సురక్షితంగా విజయతీరాలకు చేర్చారు. వెస్టిండీస్ బౌలర్లలో అకీల్ హుసేన్, రోస్టన్ ఛేజ్ తలా ఒక వికెట్ పడగొట్టినప్పటికీ, భారత బ్యాటర్ల ధాటిని అడ్డుకోలేకపోయారు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ వీరవిహారం చేయడంతో భారత్ మరో 3.2 ఓవర్లు మిగిలి ఉండగానే కేవలం రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుని ఘన విజయాన్ని సొంతం చేసుకుంది.



## సిఇసి రాజీనామా డిమాండ్ చేస్తూ విపక్ష ఎంపిల నిరసన

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు మంగళవారం ఢిల్లీలో నిరసన చేపట్టారు. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం నిర్వాచన్ సదన్ వరకు ర్యాలీగా బయలుదేరారు.సేవ్ డెమోక్రసీ అంటూ బ్యానర్లు ప్రదర్శిస్తూ, జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బారికేడ్‌పైకి ఎక్కారు. అనంతరం అక్కడే బైఠాయించి ధర్నాకు దిగారు. దీంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జ్ఞానేశ్ కుమార్‌పై ఆందోళనను మరింత ఉధృతం చేసేందుకు కాంగ్రెస్ ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ అంశాన్ని పార్లమెంట్ శీతాకాల సమావేశాల వరకు ప్రజల్లో చర్చలో ఉండేలా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. కాంగ్రెస్ ఎన్నికల సంఘాన్ని 'చీటింగ్ కమిషన్'గా పేర్కొంటోంది. అక్టోబర్ 10 నుంచి 20 వరకు 'సేవ్ ఓట్ సేవ్ కంట్రీ' పేరుతో బ్లాక్ స్థాయిలో ప్రచారం నిర్వహించనుంది. సైకిల్, బైక్ ర్యాలీలు చేపట్టడంతో పాటు జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేయడం, కరపత్రాలు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టనుంది. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 25 వరకు బూత్ స్థాయిలో 'సేవ్ ఓట్ సేవ్ కంట్రీ చౌపాల్' నిర్వహించనుంది. వీటిలో కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొంటారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. నవంబర్ 25, 26 తేదీల్లో ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఆరు వేర్వేరు 'చలో ఢిల్లీ' మార్చ్‌లు చేపట్టాలని నిర్ణయించింది. వేర్వేరు నేతలు వీటికి నాయకత్వం వహిస్తారు. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ మార్చ్‌లు ఢిల్లీలో కలుస్తాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబర్ 26 తర్వాత ప్రారంభం కానున్న నేపథ్యంలో.. అక్కడ కూడా ఎన్నికల సంఘం అంశాన్ని లేవనెత్తాలని కాంగ్రెస్ భావిస్తోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టే అంశాన్ని కూడా పరిశీలిస్తోంది. ఇదిలా ఉండగా, ఎన్నికల సంఘానికి సంబంధించిన కేసుపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల సంఘానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఎన్నికలకు సంబంధించిన నిర్ణయాలు ఏకాభిప్రాయంతో తీసుకోపోతే వాటిపై నిలుపుదల విధించే అవకాశం ఉందొచ్చని కోర్టు వ్యాఖ్యానించింది. అయితే జ్ఞానేశ్ కుమార్‌పై తక్షణ చర్యలు తీసుకునేందుకు సుప్రీంకోర్టు ప్రస్తుతం నిరాకరించింది. పత్రికల్లో వచ్చే వార్తలు ఎప్పుడూ వంద శాతం కచ్చితంగా ఉండకపోవచ్చని పేర్కొంది. కేసుపై తదుపరి విచారణ కొనసాగనుంది. మంగళవారం నాటి ర్యాలీ తర్వాత కూడా తమ ఆందోళనను కొనసాగించాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. ఈ అంశంపై మరిన్ని ప్రతిపక్ష పార్టీలను తమతో కలుపుకొనేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి.

# బొగ్గు కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

### డిపెండెంట్ ఆర్డర్లు, లీగల్ ప్రాసెస్‌లు పూర్తి
### అన్ని ఏరియా ఆస్పత్రుల్లో మెడికల్ ఇన్వాలిడేషన్
### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సింగరేణి బొగ్గు గని కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దాదాపు 300 వరకు ఉన్న డిపెండెంట్ ఆర్డర్‌లను, ఇతర లీగల్ ప్రాసెస్‌లను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అభ్యర్థులకు అందజేయాలన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, గడ్డం వివేక్ వెంకట స్వామితో కలసి సమావేశాన్ని నిర్వహించారు. డిపెండెంట్ ఉద్యోగుల పేర్ల మార్పులకు సంబంధించి సుమారు 136 మంది సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, అధికారులు మానవీయ కోణంలో ఆలోచించి, సింగరేణి ఆఫీసర్స్ కమిటీ ఇచ్చిన సిఫార్సులు ఆధారంగా తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ నిమిత్తం కార్మికులరే సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో వీలైనంత మందికి పరీక్షలు నిర్వహించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాల వల్ల విధులకు హాజరుకాక ఉద్యోగాల నుండి తొలగించబడిన కార్మికుల విషయంలో వన్ టైం ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకోవాలని చెప్పారు.

విధులు నిర్వహించకుండా సమ్మెకు పిలుపునిచ్చిన లేదా సమ్మెలో పాల్గొన్న అధికారులపై నాన్ మెయింటెనెన్స్ ఆఫ్ డ్యూటీస్ కింద ఒక హెచ్చరిక జారీ చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించిన భూముల్లో 5,774 ఎకరాలు తిరిగి రెవెన్యూ శాఖకు సింగరేణి అప్పగించగా, అందులో 4,500 ఎకరాలు పేదలకు పట్టాలు పంపిణీ చేశారని, మిగిలిన 1,250 ఎకరాల్లో అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ఆక్రమణలో ఉన్న నివాసితుల ప్రాథమిక జాబితాను సిద్ధం చేసి అర్హులైన లబ్ధిదారుల సమగ్ర జాబితాను తయారు చేసే ప్రక్రియ నెల రోజులలోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సింగరేణికి చెందిన భూముల్లో ఇప్పటివరకు మైనింగ్ చేయని ప్రదేశాలను గుర్తించి ఉద్యోగులు, కార్మికుల ఇండ్ల నిర్మాణం కోసం లేఅవుట్ చేసి నెహ్రూ హౌజింగ్ కాలనీ తీసుకు రావడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని తెలిపారు. ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులుగా తీర్చిదిద్దాలని, సామాన్య ఉద్యోగి కూడా ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా సింగరేణి ఆసుపత్రులకే వచ్చేలా వసతులు మెరుగుపరచాలని పేర్కొన్నారు. అవసరమైతే వైద్యులకు ఇచ్చే వేతనాలు, పరిహారం పెంచి నిపుణులైన డాక్టర్లను నియమించాలని, అత్యవసర వైద్యం కోసం కార్డియాక్, క్యాథ్ లాబ్ సేవలను అందుబాటులోకి తేవాలని సూచించారు. బొగ్గు గనులు, ఓవర్ బర్డెన్ డంప్‌ల దుమ్ము వల్ల స్థానికుల్లో క్యాన్సర్ ముప్పు ఉన్నందున ప్రతీ గ్రామంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సింగరేణి పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి సోలరైజ్ చేయాలని సూచించారు. సింగరేణి పరిధిలోని ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. భూపాలపల్లి ఏరియాలో వ్యవసాయ పరిశోధనా కేంద్ర ఏర్పాటుకు సింగరేణి నుంచి స్థలం కేటాయించాలని సూచించారు. సింగరేణి కార్మికులకు ఆరు నెలలకు ఒక సారి ఖచ్చితంగా సెఫ్టీ కిట్స్ సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. రామగుండంలో సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించారు.



హైదరాబాద్‌లో మంగళవారం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామితో కలసి సమావేశాన్ని నిర్వహిస్తున్న డిప్యూటీ సిఎం భట్టి

# ట్రూఅప్ ఛార్జీలు వెనక్కి తీసుకోవాలి

### లేకపోతే ప్రజాఉద్యమం తప్పదు:
### మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** విద్యుత్ కోతలు, పెరిగిన బిల్లులతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శించారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై రూ.5,420 కోట్ల భారం మోపాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకుని, ఆ భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీఆర్‌ఎస్ ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. విద్యుత్ సంస్థల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యాలకు ప్రజలు ఎందుకు మూల్యం చెల్లించాలని ప్రశ్నించారు.విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజల తరఫున పోరాటం చేయాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారని హరీశ్‌రావు తెలిపారు. బషీర్‌బాగ్ కాల్పుల ఘటనకు 26 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో విద్యుత్ ఉద్యమాన్ని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ కోతలు, రైతుల కష్టాలను చూసిన కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అప్పట్లో ఉచిత విద్యుత్ పేరుతో అర్ధరాత్రి సరఫరా చేసేవారని, తెలంగాణ వస్తే చీకట్లు అలముకుంటాయని విమర్శలు వచ్చేవని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటల విద్యుత్ సరఫరా సాధ్యమైందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రస్తుతం విద్యుత్ ఉంటే వార్తగా మారే పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఎల్‌నినోను సాకుగా చూపుతూ పాలన వైఫల్యాల నుంచి తప్పించుకోవాలని ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. ప్రకృతి వల్ల వచ్చిన కరువు కంటే కాంగ్రెస్ ప్రభుత్వ నిరక్ష్యమ్మే రాష్ట్రంలో విద్యుత్,సాగునీటి సమస్యలకు కారణమని వ్యాఖ్యానించారు.2016-17 నుంచి 2021-22 వరకు ట్రూ అప్ ఛార్జీల రూపంలో రూ.12,718.40 కోట్లు వసూలు చేయాలని విద్యుత్ నియంత్రణ మండలి సూచించినప్పటికీ, కేసీఆర్ ప్రభుత్వం ఆ భారాన్ని వినియోగదారులపై మోపేందుకు అంగీకరించలేదని హరీశ్‌రావు తెలిపారు. విద్యుత్ సంస్థల ఆర్థిక భారాన్ని ప్రజలపైకి నెట్టవద్దని అప్పటి ప్రభుత్వం స్పష్టంగా నిర్ణయించిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజలపై రూ.5,420 కోట్ల భారం వేయడానికి సిద్ధమైందని విమర్శించారు.దేవాదుల ప్రాజెక్టు మోటార్లను 24 గంటలు నడపాల్సి ఉండగా ఎనిమిది గంటలే నడుపుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. కల్వకుర్తి ప్రాజెక్టు మోటార్ల విషయంలోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ సరఫరా కోసం సబ్‌స్టేషన్ల ఎదుట ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. బొగ్గు, నీటి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోవడం నిర్వహణ వైఫల్యమేనని అన్నారు.విద్యుత్ రంగంలోని ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలను కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాలను విక్రయించాలనే ప్రతిపాదనపై అభ్యంతరం వ్యక్తం చేశారు.టీజీజెన్‌కో, సింగరేణి, డిస్కంల ప్రైవేటీకరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించవద్దని జాతీయ స్థాయిలో చెబుతున్న కాంగ్రెస్ నేతలు, తెలంగాణలో జరుగుతున్న ప్రయత్నాలను ఎందుకు అడ్డుకోవడం లేదని రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. ఈ నిర్ణయాలకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగులు పోరాడాలని పిలుపునిచ్చారు.గతంలో విద్యుత్ ఛార్జీల పెంపుపై ప్రజలు ఉద్యమించారని, ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతమయ్యే ప్రమాదం ఉందని హరీశ్‌రావు హెచ్చరించారు. విద్యుత్ కోతలు ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమైతే, బిల్లుల భారం ప్రజా వ్యతిరేక విధానాలకు తార్కాణమని వ్యాఖ్యానించారు. ట్రూ అప్ ఛార్జీల రూపంలో విధించనున్న రూ.5,420 కోట్ల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు.

# రెండో స్వాతంత్ర్య పోరాటం చేస్తున్నాం

### బిజెపికి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లే టార్గెట్..
### మీడియా సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపిల ఫోరం కన్వీనర్ మల్లు రవి



మంగళవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ కాంగ్రెస్ ఎంపిల ఫోరం కన్వీనర్ మల్లు రవి

**హైదరాబాద్,అక్టోబరు6,ప్రభాతవార్త:** దేశంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో అర్హులైన కోట్ల కొద్దీ పౌరుల ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కుట్రపూరితంగా తొలగిస్తున్నాయని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్ మల్లు రవి తీవ్రంగా మండిపడ్డారు. మంగళవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ అన్యాయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి ఆధ్వర్యంలో పార్లమెంట్ మకర ద్వారం నుంచి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ కార్యాలయం వరకు భారీ ప్రొటెస్ట్ ర్యాలీ నిర్వహించినట్లు వెల్లడించారు."ఈరోజు పార్లమెంట్ మకర ద్వారం దగ్గర నుంచి బయలుదేరి ప్రొటెస్ట్ ర్యాలీ కాంగ్రెస్ పార్టీ, ఇండియా అలయన్స్ పార్టీలు ఎస్పీ, ఎన్సీపీ, ఆర్జేడీ, సీపీఎం, సీపీఐ ఇంకా కొన్ని రాష్ట్రాల్లో ఉన్న టీఎంసీ అందరం ఎంపీలు పార్లమెంట్ నుంచి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఆఫీస్ వరకు పాదయాత్రలు, ఎలక్టోరల్ ర్యాలీగా వెళ్ళడం జరిగింది. ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశం అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కలిగించాల్సిన బాధ్యత ఈసీపై ఉంది" అని ఆయన తెలిపారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరు మీద ఇప్పటివరకు భారతదేశంలో 13 కోట్ల మంది పౌరుల ఓటు హక్కును ఓటర్ల జాబితా నుంచి తొలగించారని మల్లు రవి తెలిపారు. దేశంలో ఏకంగా 13 కోట్ల ఓట్ల తొలగింపు అంటే అషామాషీ విషయం కాదన్నారు. 13 కోట్ల ఓట్లు అంటే ప్రపంచంలో కొన్ని దేశాల మొత్తం జనాభా కంటే ఎక్కువని అన్నారు. పది, పదిహేను దేశాల ప్రజల సమూహానికి ఓట్లు లేకుండా చేసినంత మందికి ఓట్లు తొలగించారని మండిపడ్డారు. ఎస్ఐఆర్ పేరుతో దేశంలోని బడుగు, బలహీన వర్గాల ఓట్లు తొలగించే కుట్ర జరిగిందని ఎంపీ మల్లు రవి ఆరోపించారు.

ఫామ్ 6 లో ఇంతకుముందు ఉన్న ప్రణాళికలు కాకుండా ఉద్దేశ పూర్వకంగానే కొత్తమార్పులు తీసుకొచ్చారని తెలిపారు. మీ పేరుందా, మీ తల్లిదండ్రుల పేరుందా, మీ తాత ముత్తాతల పేరుందా అంటూ ఒక డజన్ సర్టిఫికెట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. దీనివల్ల బలహీన వర్గాలు, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు, ఆర్థికంగా వెనుకబడ్డ వాళ్ళ ఓట్లు అన్నీ తీసేయడం జరిగిందని పేర్కొన్నారు." ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడ్డ వాళ్ళు పనికొరకు అనేక ప్రాంతాలు తిరుగుతుంటారు, మైగ్రేషన్ జరుగుతుంటది. వాళ్లకు సరైన టైంలో నోటీస్ అందకపోవటం, అందిన వాళ్లకు టైం ఇవ్వకపోవటం వల్ల ఓట్లు తీసేస్తున్నారు. తెలంగాణలో ఈ ఇన్ఫర్మేషన్ ఇవ్వడానికి టైం పొడిగించమంటే వీలేదని నిర్ణయం తీసుకున్నారు. మహారాష్ట్ర, హర్యానా, బీహార్, అస్సాం, వెస్ట్ బెంగాల్ లో కూడా ఇదే రకంగా చేశారు" అని మల్లు రవి వివరించారు దేశంలో బీజేపీకి, బీజేపీ భావజాలానికి వ్యతిరేకంగా ఉన్న వాళ్ల ఓట్లన్నీ టార్గెట్ చేసేలా ఎస్ఆర్ఐ ప్రక్రియ సాగిందని ఎంపీ మల్లు రవి ఆరోపించారు. గ్రామ స్థాయిలో బిఆర్ఓ, బిఎల్ఓ లు గ్యాదర్ చేసిన ఇన్ఫర్మేషన్ అంతా ఏఆర్ఓ దగ్గర ఏమి నిర్ణయం తీసుకోకుండానే, మొత్తం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా దగ్గరికి చేరేలా ప్రణాళిక రచించారని అన్నారు. ఆ తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సోషల్ మీడియాలో వాళ్ళు ఏ పార్టీకి ఓటేశారో తెలుసుకొని, బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న వాళ్ళందరినీ తీసేయడం వల్ల 13 కోట్ల మంది ఓట్లు కోల్పోవాల్సి వచ్చిందని తెలిపారు. ఒక వ్యక్తి ఓటు హక్కును అన్యాయంగా, అతని ప్రమేయం లేకుండా తొలగించడం అంటే దేశద్రోహంతో సమానమని మల్లు రవి మండిపడ్డారు.

## ఆ 45 ఎకరాలు ఎక్కడ?

>> సమర్పించాలని నోటీసులు జారీ చేస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. సర్వే నంబర్ 325లో గుర్తించే భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే, తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం 'తెలంగాణ అమరవీరుల కాలనీ'ని నిర్మించాలని సీఎం ఆదేశించారు.అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో కాలనీని అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించాలని, వచ్చే జూన్ 2లోగా తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.కొండపాక మండలం వెలికట్ట గ్రామ పరిధిలో అసైన్డ్ భూములు,మిషన్ భగీరథ భూములు మినహా మిగిలిన భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తోపాటు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల నీటిని జాగ్రత్తగా వినియోగించాలని సీఎం అధికారులకు సూచించారు. మల్లన్న సాగర్ నీటిని అనధికారికంగా వినిగియోంచే వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.కాగా 20 రోజుల క్రితం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండల పరిధిలో ప్రభుత్వ భూముల లెక్కలు నిర్ధారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ఇచ్చిన ఆదేశాలతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. ప్రభుత్వ భూముల సర్వేకు పూనుకొన్నారు. గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, జిల్లా భూ సర్వే విభాగం ఏడీ సుదర్శన్‌తో కలిసి ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఎర్రవల్లిలోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ప్రభుత్వ భూములున్న సర్వే నంబరు 325లో హద్దులు నిర్ధారించారు. ఈ సర్వే నంబరులో రెవెన్యూ రికార్డుల ప్రకారం 388 ఎకరాలున్నాయి. వాటిల్లో ఏమైనా అన్యాక్రాంతమయ్యాయా? లేదా అని నిర్ధారించేందుకు సమగ్ర సర్వే చేపట్టాలని నిర్ణయించి ఆ మేరకు రంగంలోకి దిగారు. ఇందులోనే సుమారు 55 ఎకరాల విస్తీర్ణంలో తవ్విన పాండురంగ చెరువును అధికారులు పరిశీలించారు. ఒకట్రెండు రోజుల్లో డిజిటల్ యంత్రాల సాయంతో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలుస్తోంది. మర్కూక్ మండల రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీవో ఆధ్వర్యంలో ఒక రోజు మధ్యాహ్నం నుంచి రాత్రి 8 గంటల వరకు మకాం వేసి రికార్డులు పరిశీలించారు. ఎర్రవల్లితో పాటు వరదరాజపూర్, మర్కూక్, శివారు వెంకటాపూర్ గ్రామాలకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు.ప్రభుత్వ భూముల సర్వే నంబర్లను సేకరించి వాటిలో సేత్వార్ ప్రకారం ఉన్న భూములు భూభారతి పోర్టల్‌లో నమోదై ఉన్నాయా లేవా అనేదానిపై ఆరా తీశారు.. సీసీఎల్‌ఏ అధికారుల ఆదేశాల మేరకు 2014కు ముందున్న పహాణీలతో పాటు టీపన్‌లను తెప్పించారు. తద్వారా భూభారతి పోర్టల్‌లోని భూముల వివరాలను సరిపోల్చే పనిని కూడా నిర్వహించారు. తేడాలుంటే నిర్ధారించి ఉన్నతాధికారులకు నివేదించి 45 ఎకరాల భూమి మిస్ అయిందని గుర్తించారు.

## రెండు బొగ్గు బ్లాక్‌లపై సింగరేణి దృష్టి

### 16వ తేదీతో బిడ్ల దాఖలకు చివరి తేదీ
### డిసెంబరు 3న కేంద్ర 16వ విడత వేలం

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త :** కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించే 16వ విడత వాణిజ్య బొగ్గు బ్లాక్ వేలంలో పాల్గొనేందుకు సింగరేణి కాలరీస్ సన్నాహాలు చేస్తోంది. ఈ వేలం డిసెంబర్ 3న జరగనుండగా, బిడ్ల దాఖలు చేయడానికి ఈ నెల 16 చివరి తేదీగా కేంద్రం ప్రకటించింది. బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించిన వివరాలు ప్రకారం తెలంగాణ, ఒడిశాతో సహా తొమ్మిది బొగ్గు నిల్వలున్న వివిధ రాష్ట్రాల్లో 25 బ్లాక్‌లను ఏర్పాటు చేసింది. వీటిలో 21 బ్లాక్‌లు పూర్తిగా, మరో 4 పాక్షికంగా గుర్తించింది. ఈ వేలంలో తెలంగాణలోని శ్రావణపల్లి, కోయగూడెం బ్లాక్‌లు కూడా ఉన్నాయి. భవిష్యత్ మనుగడ, దీర్ఘకాలిక కార్యకలాపాలకు ఈ రెండు బ్లాక్‌లు కీలకమైనవిగా భావించినందున సింగరేణి యాజమాన్యం వీటిపై దృష్టిసారించింది. ఈ వేలానికి సంబంధించి బిడ్డింగ్‌లో పాల్గొనాలని యాజమాన్యం నిర్ణయించినట్లు సింగరేణి అధికారవర్గాలు వెల్లడించాయి. మంచిర్యాల జిల్లాలోని నెన్నెల మండలంలో శ్రావణపల్లి ఓపెన్‌కాస్ట్ గని ఉండగా, కొత్తగూడెం జిల్లాలోని టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓసిపి3 ఉంది.

# మన్ కీ బాత్ కాదు.. కాంగ్రెస్ జన్ కీ బాత్!





### ఢిల్లీ ఆకాశవాణి భవన్ వద్ద సంచలనం
### సృష్టించిన 'ఇండి' కూటమి నేతలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** ఎన్నికల సంఘం (ఈసీ) కార్యాలయం వైపు కొనసాగు తున్న నిరసన మార్చ్ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమంపై వ్యంగ్యాస్త్రం సంధించింది. జన్ కీ బాత్ పేరుతో సోషల్ మీడియా వేదికగా కౌంటర్ ఇచ్చింది. కాంగ్రెస్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ వీడియోను పోస్టు చేసింది. ఈ వీడియోలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ఈసీ కార్యాలయం వైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్న అనంతరం ఆకాశవాణి భవన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న దృశ్యాలు కనిపించాయి. ఈ వీడియోను పోస్టు చేస్తూ కాంగ్రెస్ మిత్రులారా ఆకాశవాణి నుంచి జన్ కీ బాత్ ప్రసారం అవుతోందంటూ పేర్కొంది. మంగళవారం ఇండియా కూటమికి చెందిన ఎంపీలు వీధుల్లోకి వచ్చారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపట్టారు. విపక్ష ఎంపీలను ఈసీ కార్యాలయం వైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించారు. నిరసన మార్చ్ సందర్భంగా పలువురు ఇండియా కూటమి ఎంపీలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రియాంక గాంధీని కూడా కొద్దిసేపు అదుపులోకి తీసుకున్నప్పటికీ అనంతరం విడుదల చేశారు. విడుదలైన తర్వాత ఆమె రాహుల్ గాంధీతో కలిసి నిరసనలో పాల్గొన్నారు.

**నీతి ఆయోగ్ కార్యాలయం వద్ద ధర్నా**

రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రతిపక్ష ఎంపీలు ముందుకు వెళ్లేందుకు అనుమతి లభించకపోవడంతో నీతి ఆయోగ్ కార్యాలయం సమీపంలో బైఠాయించి నిరసన తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రభుత్వం ప్రజల హక్కులను హరిస్తోందని ఆరోపించారు. ఇండియా కూటమి చేపట్టిన ఈసీ నిరసనలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ నిరసనలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే, టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ తదితర ప్రముఖ ప్రతిపక్ష నేతలు పాల్గొన్నారు. విపక్షాల నిరసన నేపథ్యంలో దేశ రాజధానిలో ఢిల్లీ పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఐదు అంచెల బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఏసీపీ స్థాయి, అంతకంటే పై స్థాయి అధికారులకు బాడీ కెమెరాల వినియోగాన్ని తప్పనిసరి చేశారు. సెప్టెంబర్ 30న 19 ప్రతిపక్ష పార్టీల సమావేశం అనంతరం ఈ నిరసనకు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఈసీపై పెరుగుతున్న రాజకీయ వివాదం సర్ ప్రక్రియ సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్.. ఇతర ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి సూచనలను పట్టించుకోకుండా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆంగ్లపత్రికలో వచ్చిన ఓ కథనం పేర్కొనడంతో రాజకీయ వివాదం మరింత ముదిరింది. ఓటర్ల జాబితాల నుంచి పేర్ల తొలగింపుపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఆందోళనలు వ్యక్తం చేశారని, ఇటీవలి నెలల్లో నిర్ణయాలు తీసుకునే విధానంపై 14 సందర్భాల్లో ప్రశ్నలు లేవనెత్తారని ఆ కథనం పేర్కొంది. అయితే ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను ఖండిస్తూ తమ అంతర్గత చర్చల్లో అభిప్రాయాలు, పరిశీలనల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం సాధారణమేనని స్పష్టం చేసింది.

# ఆహార ధాన్యాల లక్ష్యంలో కోత

## - ఖరీఫ్ ఉత్పత్తిపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం - 26.3 లక్షల టన్నులకు దిగుబడి ఢమాల్ - పంటల సాగులో కీలక మార్పులు చేసిన కేంద్రం

**హైదరాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త :** ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో 2026-27 పంట సంవత్సరానికి ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యంలో కేంద్రం కోత పెట్టింది. ఎల్‌నినోతో పాటు దేశంలోని కొన్ని ప్రాంతాల్లో కరువు, వరదలు వచ్చినప్పటికీ ఖరీఫ్ ఆహార ధాన్యాల ఉత్పత్తిలో తగ్గుదల చోటు చేసు కుంటుందని అంచనా వేసింది. దేశంలో కొన్ని పంటల సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ, మొత్తంగా సాగు చేసిన భూమి విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే తగ్గుదల కన్పిస్తోంది. పంటల సాగు విస్తీర్ణంలో అత్యధిక తగ్గుదల వరి విషయంలో కనిపించింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించిన వివరాలు మేరకు దేశవ్యాప్తంగా వరి సాగు విస్తీర్ణం సుమారు 16.32 లక్షల హెక్టార్లు తగ్గింది. మొక్కజొన్న, సోయాబీన్, పత్తి సాగు విస్తీర్ణం కూడా తగ్గింది. అదే సమయంలో మినుములు, సజ్జలు, జొన్నలు, నువ్వులు, పొద్దు తిరుగుడు, పెసలు, కందులు సాగు విస్తీర్ణం పెరిగింది. మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం తగ్గినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల వల్ల సుమారు 6.11 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టంపై వివరమైన అంచనాలు ప్రస్తుతం జరుగుతున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు, తెలంగాణ, రాజస్థాన్‌లో కరువు పరిస్థితిపై కూడా ఆందోళనలు ఉన్నాయని కేంద్రం గుర్తించింది. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు, ముఖ్యంగా రాయలసీమ, దాని పరిసర ప్రాంతాలు, తెలంగాణలోని కొన్ని ప్రాంతాలు, రాజస్థాన్‌లోని ఇంకొన్ని ప్రాంతాల్లో పరిస్థితిపై ఆందోళనలు ఉన్నాయి. దీంతో ఉత్పత్తిలో కోత విధిస్తూ నిర్ణయం తీసుకుంది. గత 2025-26లో వాస్తవంగా 376.56 మిలియన్ టన్నుల ఉత్పత్తి నమోదైంది. ఈ 2026-27 సంవత్సర లక్ష్యం గత ఆర్థికంలో సాధించిన ఉత్పత్తితో పోలిస్తే ఈసారి లక్ష్యం 26.3 లక్షల టన్నులు తక్కువగా ఉంది. దేశ వ్యాప్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మొత్తం 373.93 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యంగా కేంద్రం నిర్ణయించింది. 2025-26లో వాస్తవంగా 376.56 మిలియన్ టన్నుల ఉత్పత్తి నమోదయితే ఈ ఆర్థిక లక్ష్యం 2025-26కి మొదట నిర్ధారించిన 362 మిలియన్ టన్నుల లక్ష్యం కంటే ఎక్కువే. 2026-27 మొత్తం లక్ష్యంలో 2026 ఖరీఫ్ సీజన్‌లో 196.21 మిలియన్ టన్నులు, రబీ సీజన్‌లో 177.72 మిలియన్ టన్నుల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఖరీఫ్ సీజనులో వరి వంటి పంటల విత్తనాలు వేయడం పూర్తైంది. అయితే గోధుమ వంటి రబీ పంటల విత్తనాలు ఈ నెల నుంచి మొదలవుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని నీటి లభ్యత, నేలలో తేమ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ లక్ష్యాలను నిర్ణయించినట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖలోని సీనియర్ కార్యదర్శి తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రాలతో చర్చలు జరిపి, పంటల సాగు విధానంలో అవసరమైన మార్పులు చేస్తూ మంత్రిత్వ శాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రబీ పంటల సాగు విషయంలో ఎల్‌నినో, కరువు, వరదల వల్ల ఎదురైన సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక రూపొందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కోరిన నేపథ్యంలో 3న కేంద్ర బృందం కర్ణాటకలో పర్యటించింది. అలాగే మహారాష్ట్ర ముఖ్యమంత్రి కూడా కేంద్ర అంచనా బృందాన్ని పంపాలని కోరారని, అక్కడికి బృందాన్ని పంపుతున్నట్లు వ్యవసాయ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు

# 12 నెలల్లో 'ఇందిరమ్మ' ఇళ్ల తాళాలు

### గాజులరామారం కైసర్ నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణం భూమి పూజలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**జీడిమెట్ల, అక్టోబర్ 6, ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణం 12 నెలలో పూర్తిచేసి లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేస్తామని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారాం సర్కిల్ పరిధి కైసర్ నగర్‌లో 480 ప్లాట్లతో నిర్మించనున్న 4 ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణానికి వేద పండితుల నడుమ జిల్లా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుతోపాటు స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌తో కలిసి ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఏర్పాటుచేసిన సభలో మంత్రి పొంగులేటి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైన పేదల ఇంటి కల నెరవేర్చడమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం సుమారు 7000 పైగా దరఖాస్తులు వచ్చాయని అందులో ఐదు వేలకు పైగా లబ్ధిదారులు ఎంపిక చేయగా మొదటి విడతగా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ధ్రువపత్రాలు అందిస్తున్నామన్నారు. కుల మత ప్రాంతం పార్టీలకతీతంగా నగరంలోని అన్ని నియోజకవర్గాల్లో కోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు ఇల్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణం ఇది మొదటి దశ మాత్రమేనని ఇంకా వివిధ దశల్లో నిర్మాణాలు చేపట్టి అందరికీ లబ్ధి చేకూరుస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ, మేడ్చల్ జిల్లా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అర్హులైన నీరు పేదలకు సొంతింటి కల సాకారం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. హైదరాబాదు నగరంలో ఒక లక్ష ఇల్లు నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డ్ ఎండి గౌతమ్, జిల్లా కలెక్టర్ మను చౌదరి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి, అజయ్ కుమార్, కార్పొరేషన్ చైర్మన్ చరణ్, కార్పొరేషన్ చైర్మన్ హౌసింగ్ వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## దక్షిణాది రాష్ట్రాలలో సైబర్ నేరగాళ్ల పట్టివేతకు పోలీసు దాడులు

### వంద మందికి పైగా నేరస్థుల అరెస్టు భారీగా నగదు, ఇతర వస్తువులు జప్తు

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** దక్షిణిది రాష్ట్రాలలో సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు తెలం గాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) మరోసారి భారీగా దాడులు చేబట్టింది. మ్యూల్ ఖాతా లు కలిగివున్న నేరగాళ్లతో పాటు కెవైసి సహా పలురకాల మోసాలతో అమాయకులను బురిడి కొట్టించి కోట్ల రూపా యలు దండుకుంటున్న నేరస్తులను పట్టుకునేందుకు టిజిసిఎస్‌బి ఈ దాడులు నిర్వహించింది. ఈ సందర్భ ంగా వంద మందికి పైగా నేరగాళ్లు పట్టుబడగా వారిని ఆయా ప్రాంతాల నుం చి ట్రాన్సిట్ వారంట్‌పై హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. నిందితు ల వద్ద నుంచి భారీగా నగదుతో పాటు బ్యాంకుల పాస్ బుక్కులు, ఇతర వస్తువులు పట్టుబడ్డాయి. దీనిపై టిజిసిఎస్‌బి ఒకటి రెండు రోజుల్లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించే వీలుంది.

# డంకీరూటులో వచ్చిన 40 మంది పౌరసత్వాలు రద్దుచేసిన యుఎస్







**వాషింగ్టన్, అక్టోబరు 6:** అమెరికా ప్రభుత్వం వలసదారులపై విరుచుకుపడుతూ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా, దొంగ మార్గాల్లో అమెరికా పౌరసత్వాన్ని సొంతం చేసుకున్న 40 మంది పౌరసత్వాలను రద్దు చేసేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ చట్టపరమైన చర్యలు ప్రారంభించింది. తప్పుడు సమాచారం ఇచ్చి, అసలు నిజాలను దాచి పౌరసత్వం పొందిన వారిని ఏమాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తూ అసిస్టెంట్ అటార్నీ జనరల్ బ్రెట్ ఎ. షూమేట్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ జాబితాలో ఒక భారతీయ మూలాలున్న వ్యక్తితో పాటు చైనా, పాకిస్తాన్, మెక్సికో, నేపాల్, ఆఫ్ఘనిస్థాన్ వంటి దేశాల నుంచి వచ్చి అక్కడ స్థిరపడిన వ్యక్తులు ఉన్నారు. పౌరసత్వాన్ని రద్దు చేసే ప్రతిపాదన ఎదుర్కొంటున్న 40 మందిలో కాలిఫోర్నియాకు చెందిన బల్విందర్ సింగ్ అనే భారతీయ మూలాలున్న వ్యక్తి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 1992లో బల్విందర్ సింగ్ పేరుతో అమెరికా వలస అప్లికేషన్ సమర్పించిన ఈయన, ఆ తర్వాత 2003లో మరొక నకిలీ ఐడెంటిటీని ఉపయోగించి గ్రీన్ కార్డ్ పొందాడు. ఆ తర్వాతి కాలంలో ఆ రెండో ఐడెంటిటీ ఆధారంగానే 2009లో అమెరికన్ పౌరసత్వాన్ని కూడా దక్కించుకున్నాడు. వేలిముద్రల ఆధారంగా నిర్వహించిన విచారణలో రెండు అప్లికేషన్లు ఒకే వ్యక్తివని అధికారులు నిరూపించడమే కాకుండా, నైతిక ప్రవర్తనను దెబ్బతీసేలా మోసాలకు పాల్పడినందుకు అతని పౌరసత్వాన్ని రద్దు చేసే దిశగా కోర్టును ఆశ్రయించారు. కేవలం ఐడెంటిటీ మోసాలే కాకుండా, దేశ భద్రతకు ముప్పుగా మారిన నేరగాళ్లపై కూడా ఈ వేటు పడింది. ఇందులో చైనాలో జన్మించి అమెరికన్ నేవీలో సైనికుడిగా చేరిన జిన్‌చావో వేయ్ అనే వ్యక్తి కేస్ ప్రధానమైంది. అతను మిలిటరీ హోదాను ఉపయోగించుకుని సైనిక రహస్యాలను బీజింగ్‌కు విక్రయించే కుట్ర పన్ని పట్టుబడ్డాడు. గూఢచర్యానికి పాల్పడినందుకు ఇప్పటికే అతనికి 200 నెలల జైలు శిక్ష పడగా, ఇప్పుడు అతడి అమెరికన్ పౌరసత్వాన్ని రద్దు చేస్తున్నారు. వీరితో పాటు ప్రత్యేక అవసరాలున్న వారిపై దారుణమైన లైంగిక దాడికి పాల్పడటం, విదేశీ ప్రభుత్వాలకు ఏజెంట్లుగా వ్యవహరించడం మరియు హత్యలకు పాల్పడిన తీవ్ర నేరస్థులను కూడా ఈ జాబితాలో చేర్చారు. వలసదారుల చట్టం ప్రకారం దొంగ మార్గాల్లో లేదా నిబంధనలకు విరుద్ధంగా పొందిన పౌరసత్వాన్ని రద్దు చేసే అధికారం అమెరికా ప్రభుత్వానికి ఉంటుంది. వచ్చిన ప్రతి ఒక్కరూ అబద్ధాలు చెప్పే అమెరికా పౌరసత్వం పొందారని అసిస్టెంట్ అటార్నీ జనరల్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

దేశ పౌరసత్వ వ్యవస్థపై నమ్మకాన్ని పునరుద్ధరించడమే తమ ప్రాథమిక లక్ష్యమని, మోసపూరిత మార్గాల్లో పౌరసత్వాలు పొందిన వారిపై ఈ రకమైన చర్యలు భవిష్యత్తులోనూ నిరంతరాయంగా కొనసాగు తాయని జస్టిస్ డిపార్ట్‌మెంట్ స్పష్టం చేసింది.

# సిఎం ప్రజావాణిలో అర్జీదారుల వెల్లువ

### ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసి కార్మికులకు భరోసా ఇచ్చిన గద్వాల్ విజయలక్ష్మి

**బేగంపేట అక్టోబర్ 6,(ప్రభాతవార్త):** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన 259వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 13 గ్రూపులకు చెందిన 348 మంది ద్వారా 196 దరఖాస్తులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు 67 దరఖాస్తులు, బీసీ సంక్షేమ శాఖకు 24, మున్సిపల్ శాఖకు 26, ఇతర శాఖలకు 79దరఖాస్తులు అందాయి.



సిఎం ప్రజావాణి కార్యక్రమానికి తరలి వచ్చిన దరఖాస్తుదారులు

స్టేట్ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్మెంట్ చేసి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించారు. ఆర్టీసీ లో వివిధ కారణాలతో ఉద్యోగం కోల్పోయిన కార్మికులు ప్రజావాణికి వచ్చి విధుల్లోకి చేర్చుకునేలా చర్యలు తీసుకోవాలనిఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మిని కోరగా రవాణా శాఖ మంత్రి ఆర్టీసీ ఎండీతో మాట్లాడి తగిన సహాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. 317 మందికి ఆర్టీసీలో ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులకు తిరిగి విధుల్లోకి చేరే విధంగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏసిపి ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు స్వదేశ్ పరికి పండ్ల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎసిబి వలలో గ్రామ కార్యదర్శి, కారోబార్





ఎసిబికి పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి, కారోబార్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంటి మోటేషన్ కోసం డబ్బులు డిమాండ్ చేసిన గ్రామ పంచాయతీ కార్యదర్శితో పాటు కారోబార్ ఏసీబీకి పట్టుబడిన సంఘటన సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన కయ్యాల కిషన్‌కు సంబంధించిన ఇంటి మోటేషన్ కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణతో పాటు కారోబార్ దాసరి సంతోష్‌లు రూ.15 వేలు డిమాండ్ చేశారు. ఈ మేరకు లంచం తీసుకుంటుండగా పథకం ప్రకారం ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండుగా పట్టుకున్నారు.

## దేశంలో ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలా ఉండాల్సిన అధికార బిజెపికి అనుబంధ సంస్థలా మారిన ఇసి

### సిఇసి జ్ఞానేశ్ వెంటనే రాజీనామా చేయాలి : మంత్రి పొన్నం



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

**కోహెడ, అక్టోబరు 6, ప్రభాతవార్త :** దేశంలో ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలా ఉండాల్సి న కేంద్ర ఎన్నికల సంఘం అధికార బిజెపికి అనుబంధ సంస్థలా మారిపోయిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకరగౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నకిరికొమ్ముల గ్రామంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఒక్క అర్హులైన ఓటరు సైతం లిస్టు నుంచి గల్లంతు కాకూడదనే ఉద్దేశంలతో సవరణలు, జరిగేవని కానీ ప్రస్తుతం కమిషన్ అధికారులు భయంతో బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ఉన్న పేదల ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటక, బీహార్, బెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో ఎన్నికలకు ముందే గెలుపు కోసం ఇలాంటి కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ ఒక రాజకీయ పార్టీకి అధికార ప్రతినిధిలా వ్యవహరిస్తున్నారని ఆయన వెంటే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును రక్షించుకోవాల్సి న బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ఓట్లను కాపాడేందుకు కాంగ్రెస్‌తో పాటు ప్రజాస్వామిక పార్టీలన్ని ఏకమై దేశ వ్యాప్తంగా గల్లీ గల్లీలో 'ఓట్ బచావో-దేశ్ బచావో' పేరిట ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు.

# పత్తి రైతులకు అండగా సంస్కరణలు

### - డిజిటల్ సేవలు.. దిగుబడి పెంపు.. నాణ్యతకు ప్రాధాన్యం

**అత్తాపూర్ అక్టోబరు6,ప్రభాతవార్త:** పత్తి రైతుల సాధికారత, పత్తి ఉత్పాదకత పెంపు, నాణ్యత మెరుగుదలతో పాటు వస్త్ర పరిశ్రమకు వ్యాపార సౌలభ్యం కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం పలు సంస్కరణలు చేపడుతోందని కేంద్ర వస్త్ర మంత్రిత్వ శాఖ తెలిపింది. రిఫార్మ్ ఉత్సవ్-2026లో భాగంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పత్తి రంగంలో చేపట్టిన సంస్కరణలను ప్రదర్శించారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ-సహకార శాఖ ప్రభుత్వ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తా, తెలంగాణ సహకార శాఖ ప్రత్యేక కమిషనర్ రాహుల్ రాజ్ పి.ఎస్, ఐఏఎస్, కేంద్ర సిల్క్‌బోర్డు అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రతినిధులు, రైతులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులకు పత్తి కొనుగోళ్లకు సంబంధించిన సమాచారాన్ని డిజిటల్‌గా అందించే విధానాన్ని వివరించారు. పత్తి ఉత్పాదకత, నాణ్యత పెంపునకు కపాస్ కాంతి, పత్తిపై క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్ల తొలగింపు, బేల్స్, విత్తనాల బిల్లింగ్‌ను సులభతరం చేసే కాట్‌బిజ్ వంటి సంస్కరణలను ప్రదర్శించారు. అధిక సాంద్రత మొక్కల విధానం (హెచ్‌డిపిస్)తో దిగుబడులు పెరగడంతో పాటు కార్మికుల కొరత, కలుపు సమస్యలు, సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని రైతులు అనుభవాలను పంచుకున్నారు. తెలంగాణలో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కింద పత్తి కొనుగోళ్ల నిర్వహణ, ప్రభుత్వ విభాగాలు-రైతుల మధ్య సమన్వయంపై చర్చించారు. కేంద్ర సిల్క్ బోర్డు ఆధ్వర్యంలో సిల్క్‌మార్క్ డిజిటలైజేషన్, సెరి టూరిజం, మేరా రేషమ్ మేరా అభిమాన్ కార్యక్రమాలను కూడా ప్రదర్శించారు. కస్తూరి కాటన్ నాణ్యత, ధ్రువీకరణ, బ్రాండింగ్, ట్రేసబిలిటీపై పరిశ్రమ ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. రైతు నుంచి ఫైబర్, ఫ్యాక్టరీ నుంచి ఫ్యాషన్, అక్కడి నుంచి అంతర్జాతీయ మార్కెట్ల వరకు భారత వస్త్ర విలువ శృంఖలిని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.





రిఫార్మ్ ఉత్సవ్‌లో పాల్గొన్న వ్యవసాయ-సహకార శాఖ ప్రభుత్వ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఇతర అధికారులు

# మూడు నెలల గరిష్టానికి భారత్ సేవల రంగ వృద్ధి

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** దేశీయ డిమాండ్ పుంజుకోవడంతో కొత్త ఆర్డర్లు పెరిగి, సెప్టెంబర్‌లో భారత సేవల రంగ కార్యకలాపాలు మూడు నెలల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. మంగళవారం విడుదలైన నెలవారీ సర్వే డేటా స్పష్టంచేసింది. ఎస్అండ్‌పీ గ్లోబల్ రూపొందించిన హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ ఆగస్టులో 54.1గా ఉండగా, సెప్టెంబర్‌లో 55.2కు పెరిగింది. జూన్ తర్వాత ఇదే అత్యంత వేగవంతమైన వృద్ధి. 50కి పైగా స్కోర్ వృద్ధిని, 50కి దిగువ స్కోర్ క్షీణతను సూచిస్తుంది. దేశీయ డిమాండ్ బలపడటంతో భారత సేవల రంగం మెరుగైన పనితీరును కొనసాగించింది. అదే సమయంలో ఎగుమతి వ్యాపారం కూడా వృద్ధి చెందింది. అయితే ఆ వృద్ధి వేగం కొంత మందగించిందని హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ ప్రాంజుల్ భండారీ తెలిపారు. సెప్టెంబర్‌లో కొత్త ఆర్డర్లు మూడు నెలల తర్వాత అత్యంత వేగంగా పెరిగాయి. ముఖ్యంగా ఫైనాన్స్, ఇన్సూరెన్స్, కన్స్యూమర్ సర్వీసెస్ రంగాల్లో కార్య కలాపాలు, అమ్మకాల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. డిజిటల్ సొల్యూషన్స్, ఆహార ఉత్పత్తులు, బీమా, రుణాలు, సాఫ్ట్‌వేర్, రవాణా, టూర్స్, ట్రావెల్ సేవలకు డిమాండ్ పెరిగినట్లు కంపెనీలు తెలిపాయి. అంతర్జాతీయ మార్కెట్లలోనూ భారత సేవలకు డిమాండ్ మెరుగుపడింది. జర్మనీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బ్రిటన్, అమెరికా నుంచి ఆర్డర్లు పెరిగినట్లు సంస్థలు పేర్కొన్నాయి. అయితే కొత్త ఎగుమతి వ్యాపారం వృద్ధి వేగం దాదాపు మూడేళ్లలోనే అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఆర్డర్ బుక్స్ మెరుగుపడటం, రానున్న ప్రాజెక్టులు పెరగడంతో సేవల రంగ సంస్థలు సెప్టెంబర్‌లో అదనపు సిబ్బందిని నియమించుకున్నాయి. ఆగస్టుతో పోలిస్తే ఉద్యోగాల సృష్టి వేగం తగ్గింది. రియల్ ఎస్టేట్, బిజినెస్ సర్వీసెస్ రంగాల్లో నియామకాలు మందగించడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. సేవల రంగంలో ఇన్‌పుట్ ధరల ద్రవ్యోల్బణం నవంబర్ 2025 తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయికి తగ్గింది. కంపెనీలు వినియోగదారులపై విధించే ధరల పెరుగుదల రేటు కూడా జూన్ తర్వాత అత్యల్ప స్థాయికి చేరింది. ఆహార సరఫరాలు, ఇంధనం, బీమా ప్రీమియంలు, నిర్వహణ, సాఫ్ట్‌వేర్, టెక్నాలజీ వనరుల ధరలు పెరిగినట్లు కంపెనీలు తెలిపాయి. తయారీ, సేవల రంగాలను కలిపి సూచించే హెచ్‌ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ పిఎంఐఅవుట్‌పుట్ ఇండెక్స్ ఆగస్టులో 54.3 నుంచి సెప్టెంబర్‌లో 55.9కు పెరిగింది. సెప్టెంబర్ 7 నుంచి 28 వరకు సుమారు 400 సేవల రంగ సంస్థలపై ఈ సర్వే నిర్వహించారు.

## బి.సి. ఉద్యోగులకు ఫోకల్ పోస్టుల్లో అన్యాయం : ముఖ్యమంత్రికి ఆర్. కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్ అక్టోబర్ 6 ( ప్రభాతవార్త ) :** రాష్ట్రంలోని ఉన్నత స్థాయి ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్1, గ్రూప్2 సహా పలు కీలక విభాగాల పోస్టింగ్‌లలో వెనుకబడిన తరగతుల (బి.సి.) అధికారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని జాతీయ బి.సి. సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్ వంటి అర్బన్ ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల్లో రెవిన్యూ, పోలీస్, ఇరిగేషన్ తదితర కీలక శాఖలలో బి.సి. అధికారులకు ఖిఫోకల్ పోస్టులుఖి ఇవ్వడం లేదని ఆయన లేఖలో పేర్కొన్నారు. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్, ఆర్డీఓ, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, సీఐ వంటి పోస్టుల కేటాయింపులో బి.సి.లకు ప్రాతినిధ్యం కరువైందని తెలిపారు. మెరిట్ ద్వారా ఎంపికైన బి.సి. అధికారుల పట్ల ఈ రకమైన వివక్ష చూపడం తగదని వ్యాఖ్యానించారు. స్వయంగా బి.సి. సంక్షేమ శాఖలోనే బి.సి. అధికారులకు అన్యాయం జరుగుతుండటం విచారకరమని కృష్ణయ్య పేర్కొన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ, బి.సి. కమిషనర్ వంటి కీలక పదవుల్లో నాన్‌బి.సి. అధికారులను నియమించడం వల్ల శాఖాపరమైన అభివృద్ధి మందగించిందని, బి.సి. విద్యార్థుల హాస్టల్ వసతి సమస్యలు తీవ్రమవుతున్నాయని తెలిపారు. మైనారిటీ, ఎస్సీ సంక్షేమ శాఖలలో ఆయా సామాజిక వర్గాల అధికారులను నియమిస్తున్నట్లే, బి.సి. శాఖలోనూ బి.సి. అధికారులనే నియమించే సంప్రదాయాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొత్త రిక్రూట్‌మెంట్ రోస్టర్ విధానం అశాస్త్రీయంగా ఉందనడానికి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో మొదటి 10 పోస్టుల కేటాయింపు విధానమే నిదర్శనమని లేఖలో వివరించారు. నిబంధనల ప్రకారం మొదటి 10 పోస్టుల్లో బి.సి.లకు 3 పోస్టులు రావాల్సి ఉండగా, కేవలం 2 పోస్టులే కేటాయించడం వల్ల గ్రూప్1, గ్రూప్2 ఉద్యోగార్థులు నష్టపోతున్నారని తెలిపారు. కొత్త జోనల్ విధానంలో తక్కువ పోస్టులు ఉన్నాయన్నారు.

# నెహ్రూ జూపార్క్‌కు 63 వసంతాలు

### ఉత్సవాలు ప్రారంభించిన పిసిసిఎఫ్ వినయ్‌కుమార్



జూపార్కు 63వ వ్యవస్థాపక దినోత్సవ ఉత్సవాలను ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పిసిసిఎఫ్ వినయ్ కుమార్, పలువురు అధికారులు, సిబ్బంది

**చార్మినార్,అక్టోబరు 6 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కు 63వ వ్యవస్థాపక దినోత్సవ ఉత్సవాలను మంగళవారం జూపార్కులో పిసిసిఎఫ్, వైల్డ్‌లైఫ్ వార్డెన్ వినయ్ కుమార్ ప్రారంభించారు. బహదూర్‌పుర శివారులో 1963 లో నెహ్రూ జూలాజికల్ పార్కు ప్రారంభ మైంది. కాగా జూపార్కు వ్యవ స్థాపక దినోత్సవాలు సందర్భంగా పిసిసిఎఫ్ వినయ్ కుమార్ దాదాపు కోటిన్నర రూపాయల వ్యయంతో ఖరీదు చేసిన నాలుగు సఫారీ బస్సుల వాహనాలతో పాటు రాత్రి వేళలో ఎలుగు బంటి ఉండటానికి ఎన్ క్లోజర్, జింకలు కోసం అదనపు ఎన్ క్లోజర్, జూ పార్కుకు సంబంధించిన నెల న్యూస్ లెటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూపార్కులోని జంతువులు, పక్షులు గురించి పాఠశాలల విద్యార్థులు, సందర్శకులకు విపులంగా వివరిస్తున్నారని తెలిపారు. జూ పార్కులోని జంతువుల సంరక్షణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలియజేశారు. పిసిసిఎఫ్ డెవలప్‌మెంట్ రత్నాకర్ జోహార్, పిసిసిఎఫ్ అడిషనల్ శర్వాణ్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ తెలంగాణ ఎస్.జె, ఆషా, ఆమ్రాబాద్ టైగర్స్ రిజర్వ్ డైరెక్టర్ వి.ఎస్.ఎన్.వి. ప్రసాద్, జూపా ర్కు డైరెక్టర్ సునీల్ ఎస్.హీరామత్, జూపార్కు క్యూరేటర్ జె.వసంత, డిప్యూటి క్యూరేటర్ మురళీధర్, పిఆర్‌ఓ ఎచ్‌ఎం హనీఫ్‌తో పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశంలో సిగరెట్లు కాలుస్తూ ఇష్టానుసారం వ్యవహరించిన ఇద్దరికి జైలు శిక్ష

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** బహిరంగ ప్రదేశంలో జనం వున్నచోట సిగరెట్లు కాలుస్తూ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తు లకు నాంపల్లి మనోరంజన్ కోర్టు నాలుగు రోజుల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలావున్నాయి. కుల్సుంపురా పరిధిలో సోమవారం రాత్రి దుర్గానగర్‌కు చెందిన సాయికిరణ్ (24), వనస్థలిపురం నివాసి నవీన్ (26) జనం రద్దీగా వున్నచోట సిగరెట్లు తాగూతు చిత్తం వచ్చినట్లుగా ప్రవర్తించారు. దీనిపై స్థానికులు అభ్యంతరం చెప్పినా వారు వినిపించుకోలేదు. దీంతో బస్తీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వెంట నే ఘటనా స్థలికి వచ్చి సాయికిరణ్, నవీన్‌లను అరెస్టు చేసి మందలించినా వారిలో పశ్చాతాపం కనిపించ లేదు. దీంతో వారిపై ఈ పెట్టి కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని మంగళవారం ఉదయం నాంపల్లి మనోరంజన్ కోర్టులో హాజరు పరిచారు.

ఈ కేసును విచారించిన కోర్టు సా యికిరణ్, నవీన్‌లకు నాలుగు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. అనంతరం ఇద్దరు నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

బహిరంగ ప్రదేశాలలో ఇష్టాను సారం ప్రవర్తిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఇన్‌స్పెక్టర్ రాములు హెచ్చరించారు.



స్వశక్తితో ఎదగడానికి మహిళా లోకం అడుగులు వేస్తున్న తరుణంలో నగరానికి కాస్త దూరంగా పల్లెటూరిలో ఓ గృహిణి తన భర్త స్థాపించిన పరిశ్రమలో తానూ ఎదగాలని సంకల్పించింది. మారుతున్న పరిస్థితుల్లో మహిళలు సైతం ఇప్పుడు అన్నిటా తామేనంటున్నారు. అదే ఉత్సాహంతో అద్భుతాలు సాధిస్తున్నారు.

# ఇథనాల్‌తో 'ఇంతి'ంతై..

ప్రతీదీ నిశితంగా పరిశీలించడం, తెలుసుకోవడం, అమలులో పెట్టడం అనుభవపూర్వకంగా సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగడమనే లక్షణం వారికి వెన్నతో పెట్టిందే అందుకే అన్ని రంగాల్లోనూ మహిళలు పురోగతి సాధిస్తున్నారు. ఒక పరిశ్రమ నడపాలంటే, సక్సెస్ సాధించలంటే అందులో మెళకువలు తెలుసుకోవాలి. అహరహం శ్రమించే సంకల్పముంటే అతివలు సాధించలేనిదంటూ ఉండదు. తాండూరు నియోజకవర్గంలోని యాలాల మండలం జక్కేపల్లి గ్రామంలో నెలకొల్పిన ర్యాడికల్ బయో ఆర్గానిక్ లిమిటెడ్ సరళారెడ్డి మేనేజింగ్ డైరక్టర్ ఈ కోవకు చెందిన వారే. తొలిరోజుల్లో ఎక్స్ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఈఎన్ఏ) ఉత్పత్తులు చేపట్టేవారు. ఈ ముడిసరకును ఆల్కహాల్ తయారీకి, హోమియో మందుల తయారీకి ఉపయోగిస్తుంటారు. మొక్కజొన్న, బియ్యపు నూకల ద్వారా ఈఎన్ఏ ఉత్పత్తి చేస్తారు. సరళారెడ్డి విన్నూత్న ఆలోచనలతో ఇప్పుడు ఇథనాల్ తయారీలో ముందడుగు వేసారు. ఒకపుడు 90 కిలోలీటర్ల ఈఎన్ఏ ఉత్పత్తులకే పరిమితమైన ఆర్బీవోఎల్ ప్రస్తుతం 200 కిలోలీటర్ల ఉత్పత్తులు చేపడుతుండటం గమనార్హం. మేనేజింగ్ డైరెక్టర్‌గా సరళారెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత 2017లో ఇథనాల్ ఉత్పత్తుల వైపు ఆలోచనల అడుగులు పడ్డాయి. ఈ సంస్థలో తయారు చేసే ముడిసరకు నుండి ఇథనాల్ ఉత్పత్తులు కూడా చేపట్టవచ్చు. 2024 నుంచి ఇథనాల్ ఉత్పత్తులు కూడా మొదలైనాయి. దక్షిణ భారతదేశంలోని ఆయిల్ తయారీ కంపెనీలు ఇథనాల్ కొనుగోలు చేస్తున్నాయి. ఈఎన్ఎను ఆల్కహాల్ కంపెనీలకు వెళ్తాయి ఎంతో చాతుర్యం ఉంటే తప్ప ఇలాంటి సంస్థలు విజయ పథంలో సాగవు. కొత్త కొత్త ఆవిష్కరణల కోసం భర్త, కుమారుడు సహాయం తీసుకుంటున్నారు సామాజిక బాధ్యతగా పాతిక మంది మహిళలకు జీవనోపాధి కల్పిస్తున్నారు. ఇలాంటి మహిళా పారిశ్రామికవేత్తల స్ఫూర్తితో మరికొన్నిటిని ఆహ్వానిద్దాం.

**- శెట్టి రవిశంకర్**

# కిచెన్‌లో మ్యాజిక్ క్లాత్ !



కిచెన్ అనగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది జిడ్డు పట్టిన స్టవ్, మరకలైన కౌంటర్టాప్, నీటి చుక్కలతో మెరిసే గిన్నెలు. వీటిని శుభ్రం చేయడానికి ఎన్నో రకాల క్లాత్‌లు వాడుతుంటాయి వాటిల్లో మైక్రోఫైబర్ క్లాత్ ఉందా? ఎందుకంటే ఇది మీ వంటింటి పనులను సులువుగా పూర్తి చేస్తుంది. అదెలాగంటారా?

మైక్రోఫైబర్ క్లాత్... సాధారణ కాటన్ వస్త్రం కాదు. పాలిస్టర్, నైలాన్ దారాలతో అత్యంత సూక్ష్మంగా తయారవుతుంది. దీని ప్రత్యేకత నిల్వ, ఉంచని ప్రతి నార ఒక చిన్న కొక్కెంలా పనిచేసి దుమ్ము, జిడ్డు, సూక్ష్మ క్రిములను గట్టిగా పట్టుకుంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది ఏకకాలంలో డస్ట్ క్లీనర్, అబ్సార్బెంట్స్, స్క్రబ్బర్లా పనిచేస్తుంది. వంట అయిపోయిన వెంటనే స్టవ్, చిమ్నీ.. వంటి వాటిని తుడవడానికి దీన్ని వాడొచ్చు. కొద్దిగా గోరువెచ్చని నీళ్ల లేదా డిష్వాష్ లిక్విడ్ స్ప్రే చేసే మైక్రోఫైబర్ క్లాత్తో తుడిస్తే జిడ్డు వదిలి కొత్తవాటిలా మెరిసిపోతాయి. అంతేనా, గ్రానైట్, మార్బుల్, సింక్ వంటివాటిపై నీటి మరకలు లేకుండా చేయొచ్చు. గాజు గ్లాసులు డిన్నర్ సెట్, స్టీల్ బాక్సులు కడిగిన కడిగిన తర్వాత సాధారణ క్లాత్‌లతో తుడిస్తే నూలు పోగులు అతుక్కుంటాయి. కానీ మైక్రోఫైబర్ క్లాత్తో తుడిస్తే ఆ సమస్య ఉండదు. అలానే, మైక్రోవేవ్ అవెన్, ఫ్రిజ్, మిక్సీ జార్లపై ఉండే దుమ్ము, వేలిముద్రలను తొలగించడానికి ఇది అద్భుతంగా పనిచేస్తుంది. ఇవి వాటి బరువు కంటే రెట్టింపు నీటిని ఇట్టే పీల్చుకుంటాయి. తడిపినా, పిండినా ఇట్టే ఆరిపోతాయి. కేవలం నీటితోనే 99 శాతం చూపును తొలగించగలవు. ప్రత్యేకంగా ఖరీదైన కెమికల్ క్లీనర్లు వాడాల్సిన అసరం ఉండదు. పైగా ఒక్కసారి కొనుగోలు చేస్తే ఇవి చాలా కాలం మన్నుతాయి. వందలాది సార్లు ఉతికినా వీటి నాణ్యత తగ్గదు. అయితే, మైక్రోఫైబర్ క్లాత్‌లను వాడిన తర్వాత వేడి నీటిలో కొద్దిగా డిటర్జెంట్ వేసి ఉతకాలి. అలాగే వీటిని ఉతికేటప్పుడు సాఫ్టనర్లు లేదా బ్లీచ్ అస్సలు వాడకూడదు.

# మేకప్ లుక్ ..



**బయటికి వెళ్లిన ప్రతిసారీ మేకప్ వేసుకోవడం కుదరకపోవచ్చు.. అలాగే తరచూ మేకప్ వేసుకోవడం కొందరికి నచ్చక పోవచ్చు. అయినా మేకప్ వేసుకున్న లుక్స్ సొంతం చేసుకోవాలంటే..? ఈ చిట్కాలు పాటించాలని నిపుణులు.**

సన్ స్క్రీన్ రాయండి.. మేకప్ డీటాక్స్ లో భాగంగా ప్రాథమిక చర్మ సంరక్షణను పాటించాల్సి ఉంటుంది. ఈ కోసం బయటికి వెళ్లడానికి 15 నిమిషాల ముందు సన్ స్క్రీన్ లోషన్ ను రాసుకోవాలి. ఇది ఎండ నుంచి చర్మానికి రక్షణ కల్పించడమే కాదు.. చర్మానికి ఒక రకమైన మెరుపును తీసుకొస్తుంది.

**మాయిశ్చరైజర్ ఇలా!** డల్గా ఉన్న ముఖాన్ని ప్రకాశవంతంగా మార్చాలంటే టింటెడ్ మాయిశ్చ రైజర్‌ను వాడాలి. ఇక ప్రత్యేక సందర్భాల్లో మాత్రం హై కవరేజ్ ఫౌండేషన్‌ను వాడితే ఫలితం ఉంటుంది. అయితే ఏది ఎంచుకున్నా చర్మతత్వాన్ని బట్టి ప్రాధాన్యత ముఖ్యం.

**ఎక్స్ఫోలియేషన్ చేస్తున్నారా?** చర్మంపై మృత కణాలు ఏర్పడడం, పొలుసులుగా ఊడిపోవడం వల్ల ముఖం డల్గా కనిపిస్తుంది. దీనికి ఎక్స్ లియేషన్ పద్ధతి మంచి పరిష్కారం అంటున్నారు నిపుణులు. ఈ మీ చర్మతత్వాన్ని బట్టి స్క్రబ్‌ను ఎంచుకొని లేదంటే ఇంట్లోనే సహజ స్క్రాబ్‌లను తయారుచేసుకొని స్క్రబింగ్ చేసుకోవాలి. దీనివల్ల చర్మం లోలోపలి నుంచి శుభ్రపడి సహజసిద్ధమైన మెరుపు వస్తుంది.

**టోనర్‌తో మేలు!** మేకప్ వేసుకోకపోయినా ఆ మెరుపును పొందాలంటే ముఖం శుభ్రం చేసుకున్నాక టోనర్ వాడాలి. దీనివల్ల ముఖంపై స్థాయులు బ్యాలన్స్ అయి చర్మం తాజాగా కనిస్తుంది.

**పెదాలకు లిప్‌బామ్!** పెదాలు మృదువుగా ఉన్నప్పుడే వాటి అందం ఇనుమడిస్తుంది. ఇందుకోసం రోజూ లిప్‌బామ్ రాసుకోవడం అప్పనిసరి. అలాగే ఆలివ్ ఆయిల్ వంటి నూనెలతో పెదాలపై మర్దన చేసుకోవడం వల్ల వాటికి సహజ మెరుపు వస్తుంది. ఫలితంగా లిప్‌స్టిక్ రాసుకునే అవసరమే ఉండదంటున్నారు.

# సేవతోనే అనుగ్రహం

జీవితంలో ఎవరైనా సరే తమ కోరికలను నెరవేర్చుకునే శక్తి తమకి లేనప్పుడు, వాటిని తీర్చవలసిన భారం భగవంతుడిపైనే వేస్తుంటారు. ఇక ఆపదల నుంచి బయటపడటమనేది భగవంతుడి చేతిలోనే ఉంటుంది గనుక ఆయననే ఆశ్రయిస్తుంటారు. భగవంతుడి మనసు గెలుచుకుంటే, ఆయన అనుగ్రహం త్వరగా లభిస్తుంది. అందుకోసం నిస్సహాయులకు సహకారాన్ని అందించాలి. మూగ జీవాలకు ఆహారాన్ని అందించాలి. అలాగే ఆలయంలో భగవంతుడికి సంబంధించిన సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి. భగవంతుడికి సంబంధించిన వస్తు సామగ్రిని శుభ్రం చేయడం .. ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేయడం .. వాకిలి తుడిచి ముగ్గులు పెట్టడం .. ఆలయ ద్వారానికి తోరణాలు కట్టడం .. పూల దండాలు సమర్పించడం .. వాహన సేవల్లో సహకారిగా ఉంటూ భగవంతుడి సేవకుడిగా శ్రమిస్తూ ..ఆ శ్రమలో సంతోషాన్ని .. సంతృప్తిని పొందాలి. అలాంటి వారి కోరికలను ఆ భగవంతుడు తప్పక నెరవేరుస్తాడు.

# ఈ క్లచర్ వాడొద్దు!



వినగానే 'కష్టం' అన్నమాట మన నోటి నుంచి వచ్చేస్తుంది కదూ! అది మనకి కేవలం క్లిప్పే కాదు మరి. కాస్త స్టైలిష్ గా కనిపించాలంటే ఫ్యాషన్ యాక్సెసరీలా మారుతుంది. అత్యవసర హెయిర్ యాక్సెసరీ. చిరగ్గా ఉన్నప్పుడు జుట్టు ముడిపెడితే కానీ సగం భారం తీరినట్లు అనిపించదు. అప్పుడు కావాల్సింది ఈ క్లాచర్ లేదంటే క్లా క్లిప్పే! అసలు అది లేకుండా చాలామంది ఆడవాళ్లకి రోజు గడవడం అంటే అతిశయోక్తి కాదు. అందుకేగా హ్యాండ్‌బ్యాగు, ఆఫీసు డెస్కు, డ్రెస్సింగ్ టేబుల్... ఎక్కడ చూడండీ దీని ఉనికి కనిపించడం ఖాయం. అలాంటిదాన్ని వాడొద్దంటే ఎంత కష్టం? అయినా వైద్యులు వీటితో ప్రమాదమనే అంటున్నారు. అమ్మాయిలు తరచూ దీన్ని వాడతారన్నది వాస్తవం. ప్రయాణాలకు మినహాయింపు కాదు. అయితే దుర్ఘటనలు ఎదురైనప్పుడు ఈ క్లచర్లే అమ్మాయిలకు ప్రమాదంగా మారుతున్నాయట. కారు, బస్సుల్లో వెళ్తున్నప్పుడు సడన్ బ్రేక్ వేసినా, యాక్సిడెంట్ జరిగినా లేదంటే బండ్లమీద నుంచే కాదు పొరపాటున వెనక్కి పడినా ఇవి తలకు తీవ్రగాయం చేస్తున్నాయట. విరిగి, తలలోకి వెళ్లిన సంఘటనలూ ఉన్నాయాట. ప్రతిపాదన చర్చ నెట్టింట నడిచింది. వైద్యులు తమ అభిప్రాయాలను పంచుకోవడమే కాదు... ఎంతోమంది దాని కారణంగా గాయపడిన సంఘటనలూ పంచుకున్నారు. కాబట్టే, దీని విషయంలో జాగ్రత్త అంటూ చెబుతున్నారంతా. అయినా అది లేకుండా కష్టమేనంటారా? అయితే ప్రయాణాల్లో పక్కన పెట్టండి. క్లచ్‌లకు బదులు బ్యాండ్ల సాయం తీసుకోండి, ఇంకా కాదంటే.. గాయాలు చేయని, విరగని సిలికాన్ క్లచర్‌నిస్తున్నాయి. వాటికి మారిన మేలే,

# కాలిఫ్లవర్ కాడల పచ్చడి



కాలిఫ్లవర్ కాడలు : పెద కప్పు మిరపకాయలు అయిదారు మినుపపప్పు: టేబుల్ స్పూను శనగ పప్పు: టేబుల్ స్పూను మెంతులు: పావు టేబుల్ స్పూనుఆవాలు: అర టేబుల్ స్పూను చింతపండు రసం: రేగుపండు అంతకొత్తిమీర: నాలుగు రెబ్బలుఇంగువ: కొద్దిగాపోపుగింజలు: స్పూను నూనె: రెండు స్పూన్లు ఉప్పు: రుచికి సరిపడా

**తయారీ విధానం :** ముందుగా కాలిఫ్లవర్ కాడలను తీసుకుని బాగా కడగాలి. తర్వాత సన్నగా తరిగి బాణట్లో వేసి కాస్త వేగనిచ్చి పక్కకు పెట్టుకోవాలి. ఇప్పుడు పొయ్యి మీద బాణలి పెట్టి కొద్దిగా నూనె వేసి మినుపపప్పు, శనగపప్పు, మెంతులు, ఆవాలు వేసి వేగనివ్వాలి. తర్వాత సగానికి కోసిన పచ్చి మిరపకాయల్ని కూడా జోడించి నాలుగు నిమిషాలు ఉంచి దించేయాలి. కాస్త చల్లారనిచ్చి మిక్సీలో వేసి మెత్తగా అయ్యేలా పట్టాలి. ఇప్పుడు చల్లారిన కాలిఫ్లవర్ కాడలను మిక్సీలో వేసి ఓ రెండు తిప్పులు తిప్పాలి. అంటే మరీ ముద్ద కాకుండా కచ్చాపచ్చాగా కొబ్బరి పచ్చడిలా ఉండాలన్న మాట. తర్వాత బాణట్లో కాస్త నూనె వేసి పోపుగింజల్ని చిటపటలాడనిచ్చి, తర్వాత కొంచెం ఇంగువ చల్లి ఈ పచ్చడి ముద్దను అందులో వేయాలి. చివర్లో సన్నగా తరిగిన కొత్తిమీర రెమ్మల్ని కూడా కలుపుకొంటే.. కాలిఫ్లవర్ కాడల పచ్చడి రుచిచూడొచ్చు!

తెర

# 'రణబాలి' 8న ట్రైలర్ రిలీజ్



ఈ నెల 16న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతున్న "రణబాలి" సినిమావిజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విజయదశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "రణబాలి" సినిమా ట్రైలర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు మేకర్స్. ఈ నెల 8వ తేదీన ఈ చిత్ర ట్రైలర్ ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. 'రణబాలి' ట్రైలర్ పై మూవీ లవర్స్ లో హై ఎక్స్ పెక్టేషన్స్ ఉన్నాయి. ఇప్పటికే టీజర్, సాంగ్స్ కు హ్యూజ్ రెస్పాన్స్ రాగా...విజయ్, రశ్మిక చేస్తున్న ప్రమోషనల్ ఇంటర్వ్యూస్ వైరల్ గా మారి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. ట్రైలర్ తో 'రణబాలి' సినిమాపై మరింత క్రేజ్ ఏర్పడనుంది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా "రణబాలి" సినిమా రూపొందుతోంది.

# 'కామ్రేడ్ కళ్యాణ్' అందరికీ కనెక్ట్ అవుతుంది: మహిమా నంబియార్



కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు పీరియడ్ ఎలిమెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'కామ్రేడ్ కళ్యాణ్'తో అలరించబోతున్నారు. మహిమా నంబియార్ హీరోయిన్. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ పాటలతో సినిమాపై అంచనాలు పెరిగాయి. 'కామ్రేడ్ కళ్యాణ్ అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

**ఇది మీ తొలి తెలుగు సినిమా కదా.. తెలుగులో నటించడం ఎలా అనిపించింది?** తెలుగులో నటించడం సరికొత్త అనుభవం. నేను ఏదైనా భాషని త్వరగా నేర్చుకోగలను. తెలుగు నాకు అర్థమవుతుంది. అలాగే ప్రతి లైన్‌కి దర్శకుడిని అడిగి అర్థం తెలుసుకుంటాను. అది నాకు మరింత హెల్ప్ అవుతుంది.

**శ్రీ విష్ణు తో నటించడం ఎలా అనిపించింది?**
శ్రీవిష్ణు గారు చాలా స్పాంటేనిటీ ఉన్న యాక్టర్. షూటింగ్ స్పాట్‌లో చాలా ఇంప్రొవైజ్ చేస్తుంటారు. అది నాకు మరింత ఛాలెంజింగ్‌గా ఉంటుంది. శ్రీవిష్ణు గారి తెలుగుని అర్థం చేసుకోవ డం నాకు కష్టం (నవ్వుతూ). ఆయనకి ఒక సిగ్నేచర్ స్టైల్ ఉంది.

**ఈ అవకాశం ఎలా వచ్చింది?** డైరెక్టర్ నేను చేసిన తమిళ్, మలయాళ సినిమా చూసి కాల్ చేసి కథ చెప్పారు. చాలా నచ్చింది. శ్రీవిష్ణు గారి సిగ్నేచర్ స్టైల్‌లో ఫన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. ఇంతకుముందు శ్రీవిష్ణు గారితో నేను 'సామజవరగమన్థ సినిమా చేయాల్సింది. ఆ సినిమా కోసం ఫొటోషూట్ కూడా జరిగింది. కొన్ని కారణాల వల్ల అది కుదరలేదు.

**మీ పాత్ర గురించి?** ఇందులో నాది చాలా ఫన్ క్యారెక్టర్. నా పాత్ర పేరు సితార దేవి. పక్కింటి అమ్మాయిలాంటి పాత్ర. చాలా ఇన్నో సెంట్. ఒరిస్సా నుంచి వచ్చిన అమ్మాయిగా కనిపిస్తా. ఆ భాష కారణంగా హీరో, హీరోయిన్ మధ్య వచ్చే ఫన్ చాలా గమ్మత్తుగా ఉంటుంది.

**ఈ కథని ఎంచుకోవడానికి కారణం?**
ఈ కథ చాలా ఫన్‌గా ఉంటుంది. అలాగే 90ల బ్యాక్‌డ్రాప్ కూడా చాలా ఫ్రెష్‌గా అనిపించింది.

**నిర్మాత గురించి?** చాలా ప్యాషన్ ఉన్న ప్రొడ్యూసర్. వెరీ నైస్ పర్సన్. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాని నిర్మించారు.

**తెలుగు ఆడియన్స్ గురించి?** తెలుగు ఆడియన్స్ సినిమాని గొప్పగా సెలబ్రేట్ చేసుకుంటారు. మందాడి సినిమా ప్రమోషన్స్‌కి వచ్చినప్పుడు చాలా గొప్ప రెస్పాన్స్ ఇచ్చారు. మంచి కంటెంట్ ఉంటే భాషలకు అతీతంగా ఆదరిస్తారు.

**కొత్త ప్రాజెక్ట్స్ గురించి?**మలయాళం, తమిళ్‌లో చెరో సినిమా చేస్తున్నాను. తెలుగు కథలు వింటున్నాను.

# 'గరివిడి లక్ష్మి' ట్రైలర్ లాంచ్



ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో అడివి శేష్ మాట్లాడుతూ .. ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ వేడుకలో చేసిన కళా ప్రదర్శన నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. ఇక్కడ ఆ పాటలు వింటుంటే నాకు నా బాల్యం గుర్తుకొచ్చింది. నేను వైజాగ్‌లోనే పెరిగాను. గరివిడి లక్ష్మి కథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న కృతి ప్రసాద్‌కి, విశ్వకి ధన్యవాదాలు. డైరెక్టర్ చాలా నిజాయితీగా ఈ కథను చెప్పారుడైరెక్టర్ బాబీ మాట్లాడుతూ.. కృతి ప్రసాద్ ఈ సినిమాను చాలా ప్యాషన్‌తో తీశారు. ఇంత మంచి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న తనకు అభినందనలు. డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ.. ఆనందిని 'బస్ స్టాప్' సినిమాకు హీరోయిన్‌గా పరిచయం చేశాను. దాని తర్వాత తమిళ్‌లో దాదాపు 40 సినిమాలు చేసింది. హరీష్ శంకర్ మాట్లాడుతూ.. ఈ సినిమాను విశ్వచాలా ప్యాషనేట్‌గా చేశారు. ఆయన స్టార్ హీరోలతో సినిమాలు తీస్తూ కూడా ఇలాంటి ఒక మంచి కథను ప్రపంచానికి చెప్పాలనుకోవడం నిజంగా హ్యాట్సాఫ్. నిర్మాత కృతి ప్రసాద్ మాట్లా డుతూ..'గరివిడి లక్ష్మి' మాకు చాలా స్పెషల్ ఫిల్మ్. ఇది మన రూట్ కల్చర్‌లో ఉన్న కథ. ఈ జర్నీని మనందరం కలిసి సెలబ్రేట్ చేసుకోవాలి. ఈ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఆనందంగా ఉంది. హీరోయిన్ ఆనంది మాట్లాడుతూ.. రెండేళ్లుగా ఈ సినిమా కోసం పనిచేస్తు న్నాను. ఇది నాకు చాలా స్పెషల్ ఫిల్మ్. గరివిడి లక్ష్మి నాకు దేవుడిచ్చిన వరం. మా డైరెక్టర్ గౌరికి థాంక్యూ. ఈ సినిమాకు ఏం కావాలో అన్నీ చాలా నిజాయితీగా తీసుకున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ.. మా అమ్మాయి అమెరికాలో పుట్టింది. అక్కడే పెరిగింది. 'పాడుతా తీయగా' అమెరికాలో చేసినప్పుడు లైన్ ప్రొడ్యూసర్‌గా చేసింది. తర్వాత యూకేలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదివింది. నాకు మా అమ్మాయి మెంటర్. మేము వరుసగా సినిమాలు చేస్తున్నాం. తను కూడా మాతో జాయిన్ అవుతుంది అనుకున్నాము. కాకపోతే తను మాత్రం తానే స్వయంగా సినిమాలు చేస్తానని చెప్పింది. యాక్టర్స్‌ను కూడా నేనే తెచ్చుకుంటాను అనిచెప్పింది. ఒక మూడు కథలను ఎంపిక చేసుకుంది. అందులో 'గరివిడి లక్ష్మి' ఒకటి.

# 'చీన్ టపాక్ డమ్ డమ్' ఫస్ట్ క్రాకర్ ఆవిష్కరించిన అడివి శేష్..



అల్లరి, సరదా, నవ్వులతో ప్రేక్షకులను అలరించేందుకు 'చీన్ టపాక్ డమ్ డమ్' సిద్ధమవు తోంది. త్వరలో ప్రేక్షకుల ముందు కు రానున్న ఈ ఎంటర్‌టైనర్‌కు సంబంధి చిన ఫస్ట్ క్రాకర్‌ను హిట్ మెషీన్ అడివి శేష్ ఆవిష్కరిం చారు. ఈ ఫస్ట్ క్రాకర్ సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని పెంచింది. గవిరెడ్డి శ్రీనివాస్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రానికి వై.ఎన్.లోహిత్ దర్శకత్వం వహిస్తున్నారు. విలేజ్ టాకీస్ బ్యానర్‌పై శ్రీను నాగులపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హిలేరియస్ సన్నివేశాలు, ఆసక్తికరమైన పల్లెటూరి నేపథ్యంతో ఈ సినిమా ఆద్యంతం వినోదాన్ని పంచే ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కు తోంది. ఆసక్తికరంగా రూపొందించిన మోషన్ పోస్టర్ జొన్నాడ గ్రామంలోని వింత ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేస్తోంది. ఇందులో గేదె, గ్రామ దేవత, బంగారం వంటి ఆసక్తికరమైన అంశాలతో పాటు మరెన్నో ఆసక్తిని రేకెత్తించే విషయాలు కనిపిస్తున్నాయి. వినూత్నమైన నేపథ్యం, ఆసక్తికరమైన విజువల్స్‌తో రూపొందిన ఈ మోషన్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఆద్యంతం వినోదాన్ని పంచుతూ, కడుపుబ్బా నవ్వించే సన్నివేశాలతో ప్రేక్షకులను అలరించే సినిమా రానున్నట్లు మోషన్ పోస్టర్ చూస్తుంటే తెలుస్తోంది. గవిరెడ్డి శ్రీనివాస్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్రంలో బ్రిగిడా సాగా కథానాయికగా నటిస్తున్నారు. షఫీ, దువ్వాడ మాధురి, గోపరాజు రమణ, సురభి ప్రభావతి, గోపరాజు విజయ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఏ.ఎస్. ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, సెంథిల్ కుమార్ సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేస్తున్నారు. పి.ఆర్. సంగీతం అందిస్తుండగా, సురేష్ బొబ్బిలి నేపథ్య సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ప్రవీణ్ పూడి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 'ఫస్ట్ క్రాకర్' జొన్నాడ గ్రామంలో సాగే అల్లరి, సరదాలతో నిండిన ప్రపంచాన్ని పరిచయం చేస్తూ, సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది.

# 'అనకాపల్లి' దసరా ధమాకాగా నిలుస్తుంది : లగడపాటి శ్రీధర్..



ఈ రోజు కూడా అన్ని చోట్లా హౌస్ ఫుల్స్ పడుతున్నాయి థాంక్యూ మీట్‌లో నటుడు, నిర్మాత, దర్శ కుడు త్రినాథ రావు నక్కిన.. ..'అనకాపల్లి' లాంటి మంచి చిత్రానికి సరైన సంఖ్యలో థియేటర్లు ఇవ్వక 'పోవడం బాధగా ఉంది థాంక్యూ మీట్‌లో నటి ఇంద్రజ....లగడపాటి శ్రీధర్ మాట్లా డుతూ.. ..అనకాపల్లి సక్సెస్‌లో పాల్గొనడం ఆనం దంగా ఉంది. విక్రమ్ నా కొడుకు అవ్వడం, అతని మీద ఒక సినిమా తీయడానికి త్రినాథ్ రావు గారు, నాయుడు ముందుకు రావడం గొప్ప విషయం. ఇలాంటి చిన్న చిత్రాలకు మీడియానే ముందుండి సపోర్ట్ చేస్తుంది. 'ఎవడిగోలవాడిద్థే సినిమాని ఫస్ట్ వీక్‌కే తీసేస్తామని అన్నారు. కానీ అదే థియేటర్లో చివరకు సిల్వర్ జూబ్లీ జరిగింది. అలానే 'అనకాపల్లి' కూడా గొప్ప విజయాన్ని సాధిస్తుంది. దసరా ధమాకాగా 'అనకాపల్లి' నిలుస్తుంది. ..కాంద్రేగుల నాయుడు మాట్లాడుతూ.. .'త్రినాథరావు నక్కినమీదున్న నమ్మకంతోనే 'అనకాపల్లి చేశాను. రెండు వందల థియేటర్లలో మా మూవీని రిలీజ్ చేశాం. మేం ఎంతో కష్టపడి ఈ సినిమాని చేశాం. ఇంత మంచి ఆదరణ లభిస్తున్న ఈ సినిమాకి కాకుండా ఇతర భాషల చిత్రాలకు థియేటర్లను ఇస్తున్నారు. ..విక్రమ్ సహిదేవ్ మాట్లాడుతూ.. .. 'అనకాపల్లి' సినిమాకి మంచి రెస్పాన్స్ వస్తోంది. రివ్యూలన్నీ చదివాను. మా ప్లస్, మైనస్ పాయింట్స్ చెప్పిన అందరికీ థాంక్స్.

# 'డ్యూ డేట్' రెగ్యులర్ షూటింగ్ మొదలైంది!



లోమేష్ పుడిపెద్ది హీరోగా, జయశ్రీ హీరోయిన్‌గా, ప్రణీత పట్నాయక్, విజ్ఞానిలు ముఖ్యపాత్రల్లో రూపొందుతున్న చిత్రం 'డ్యూ డేట్'వరిష్ స్టూడియోస్ పతాకంపై పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను నిర్మాతలుగా ఆనంద్.కె. దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఇటీవల ఘనంగా పూజా కార్యక్రమాలు జరుపుకున్న సంగతి తెలిసిందే. కాగా ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ రోజు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హీరో, హీరోయిన్ ఇతర ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తు న్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ప్రజెంట్ బర్నింగ్ ఇష్యూ ఆధారంగా అల్లుకున్న ఈ కమర్షియల్ కోర్ట్ రూమ్ డ్రామా ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా ఉత్కంఠభరితంగా ఉంటుంది. ప్రతి మనిషి, ప్రతి నెలా గుర్తుపెట్టుకునే డ్యూ డేట్ చుట్టు పూర్తి వాణిజ్య అంశాలతో అల్లుకున్న కథ ఇది. టైటిల్ దగ్గర నుంచి సినిమాలోని ప్రతి అంశం ప్రేక్షకులకు కొత్తదనంతో పాటు పూర్తి సంతృప్తిని కలిగించే కథ, కథనాలు ఈ చిత్రంలో ఉంటాయి. ఈ రోజు నుంచి 15 రోజుల పాటు ఏకధాటిగా జరిగే షెడ్యూల్‌తో తొలి షెడ్యూల్ పూర్తవుతుంది. తప్పకుండా ఈ చిత్రం అందర్నీ ఆలోచింపజేస్తుంది. హృదయాలకు హత్తుకుంటుంది అన్నారు.లోమేష్ పుడిపెద్ది, జయశ్రీ, ప్రణీత పట్నాయక్, విజ్ఞాని, కృష్ణ భగవాన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్: జవ్వాడి నాయుడు, మాటలు: హరీష్ మీనన్, ఎడిటర్: సత్య గిడుటూరి, డీఓపీ: చెంచు జింక, నిర్మాతలు పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను, దర్శకత్వం: ఆనంద్.కె.

### రెండో యూత్ టెస్టు..

# ఆస్ట్రేలియాపై భారత్ పైచేయి

**అహ్మదాబాద్:** రెండవ యూత్ టెస్టు తొలి రోజున, ఎడమచేతి వాటం స్పిన్నర్ తన్మయ్ బలోడా ఆరు వికెట్లు పడగొట్టడంతో ఆస్ట్రేలియాపై భారత్ పైచేయి సాధించింది. బలోడా అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో భారత్, ఆస్ట్రేలియాను వారి తొలి ఇన్నింగ్స్‌లో 174 పరుగులకే ఆలౌట్ చేసింది. అయితే, ఆట చివర్లో ఆస్ట్రేలియా తిరిగి పుంజుకుని భారత ఓపెనర్లు ఇద్దరినీ అవుట్ చేసింది. దీంతో ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు 38/2 స్కోరుతో, ఇంకా 136 పరుగుల వెనుకబడి ఉంది.



కుశాగ్ర ఓఝా 13 పరుగులతో, కెప్టెన్ యశ్‌బర్ధన్ చౌహాన్ ఏడు పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు. టాస్ గెలిచిన భారత్ రెండో ఓవర్‌లో ప్రియాన్షు సింగ్ ఆస్ట్రేలియా కెప్టెన్ మాథ్యూ లఫ్‌ను డకౌట్ చేయగా, ఐదో ఓవర్‌లో మోహిత్ ఉల్వా బౌలింగ్‌లో హేడెన్ బార్బులోవిచ్ క్యాచ్ అవుట్ కావడంతో ఆస్ట్రేలియా 9/2కు పడిపోయింది. నీల్ పటేల్, ఎలీ బ్రెయిన్ ఇన్నింగ్స్‌ను పునరుద్ధరించే యత్నం చేసినా బలోడా రాకతో ఆట గమనం మారిపోయింది. అతను బ్రెయిన్‌ను లెగ్ బిఫోర్ వికెట్‌గా అవుట్ చేసి ఆ భాగస్వామ్యాన్ని విడగొట్టాడు. ఆ తర్వాతి ఓవర్‌లోనే పటేల్‌ను స్టంప్ అవుట్ చేశాడు. అయాన్ అక్రమ్ బ్లేక్ క్యాటిల్ బ్యాట్ అంచుకు తగిలేలా చేసి ఆస్ట్రేలియా కష్టాలను మరింత పెంచగా, ఆ తర్వాత బలోడా జెడ్ హోలిక్‌ను ఔట్ చేయడంతో, 21 ఓవర్లలోపే అతిథి జట్టు 6 వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత చార్లీ హెండర్సన్, జాకబ్ పీట్జ్ పుంజుకుని, ఏడవ వికెట్‌కు 70 పరుగులు జోడించి ఆస్ట్రేలియా స్కోరును 150 దాటించారు. పీట్జ్‌ను 26 పరుగుల వద్ద బౌల్డ్ చేసి బలోడా ఈ భాగస్వామ్యాన్ని ముగించగా, కొద్దిసేపటికే అక్రమ్ హెండర్సన్‌ను 37 పరుగుల వద్ద ఔట్ చేశాడు. ఆ తర్వాత బలోడా ఆస్ట్రేలియా చివరి వికెట్లను పడగొట్టాడు. భారత్ లక్ష్య రైచందాని, 22 బంతుల్లో కేవలం ఒక పరుగు మాత్రమే చేసి థామస్ వాసియో బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ఆ తర్వాత లెగ్ స్పిన్నర్ స్పెన్సర్ గ్రీన్, సాగర్ విర్క్‌ను 16 పరుగుల వద్ద ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ చేర్చడంతో, భారత్ 38/2 స్కోరుకు చేరుకుంది. ఓఝా మరియు చౌహాన్ మిగిలిన ఓవర్లను ఎటువంటి నష్టం లేకుండా ఎదుర్కొన్నారు.

# చైనా స్మాష్‌లో సైమన్‌ని ఓడించిన మానవ్

### వరల్డ్ ర్యాంకర్‌పై మనిక సంచలన విజయం

**బీజింగ్:** చైనా స్మాష్ 2026లో సైమన్ గౌజీని భారత్‌కు ప్యాడ్లర్ మానవ్ థక్కర్ ఓడించగా, ప్రపంచ 27వ ర్యాంకర్‌పై మణిక సంచలన విజయం సాధించింది. బీజింగ్‌లో జరుగుతున్న చైనా స్మాష్ టోర్నమెంట్‌లో భారత మానవ్ థక్కర్ రెండు గేమ్‌ల నుంచి వెనుకబడినప్పటికీ పుంజుకుని, ఫ్రెంచ్ వెటరన్ సైమన్ గౌజీని 3-2 తేడాతో ఓడించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. ప్రపంచ ర్యాంకింగ్‌లో 50వ స్థానంలో ఉన్న మానవ్, మొదటి రెండు గేమ్‌లను 9-11, 9-11 తేడాతో కోల్పోయాడు. కానీ, ప్రపంచ 28వ ర్యాంకర్‌పై అద్భుతంగా పుంజుకుని, తర్వాతి మూడు గేమ్‌లను 11-7, 11-5, 12-10 తేడాతో కైవసం చేసుకున్నాడు. అలాగు మహిళల సింగిల్స్ పోటీలో, ఇటీవల ముగిసిన ఆసియా గేమ్స్ 2026కు అర్హత సాధించడంలో విఫలమైన మనికా బాత్రా, బ్రెజిల్‌కు చెందిన ప్రపంచ 27వ ర్యాంకర్ బ్రూనా తకాహాషిపై 3-2 (8-11, 11-8, 11-9, 5-11, 12-10) తేడాతో సంచలన విజయం సాధించింది. వైల్డ్‌కార్డ్‌గా మెయిన్ డ్రాలోకి ప్రవేశించిన ప్రపంచ 50వ ర్యాంకర్ అయిన ఈ భారత క్రీడాకారిణి, తదుపరి రౌండ్‌లో చైనా టాప్ సీడ్, ప్రపంచ 2వ ర్యాంకర్ వాంగ్ మాన్యుతో తలపడనుంది.





# టీమిండియా కెప్టెన్సీకి హర్మన్ గుడ్‌బై

**న్యూఢిల్లీ:** భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సంచలన నిర్ణయం తీసుకుంది. అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయం భారత క్రికెట్‌లో ఒక సువర్ణాధ్యాయానికి తెరదించినట్లయింది. ఆమె నాయకత్వంలో భారత్ వన్డే ప్రపంచకప్, ఆసియా గేమ్స్ స్వర్ణం వంటి చారిత్రాత్మక విజయాలను సాధించింది. ఈ మార్పుతో జట్టుకు చాలా కాలంగా వైస్ కెప్టెన్‌గా ఉన్న స్మృతి మంధాన కొత్త సారథిగా బాధ్యతలు చేపట్టే అవకాశం కనిపిస్తోంది. గువాహటిలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగిన ముఖ్యమైన రివ్యూ మీటింగ్ తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. ఈ భేటీలో హర్మన్‌ప్రీత్‌తో పాటు స్మృతి మంధాన, ప్రధాన కోచ్ అమోల్ మజుందార్





### వైస్ కెప్టెన్ స్మృతికి ఛాన్స్

పాల్గొన్నారు. గత కొన్ని నెలలుగా జట్టు ప్రదర్శన, రాబోయే ప్రపంచ టోర్నీల వ్యూహాలపై సుదీర్ఘంగా ఈ సమావేశంలో చర్చించారు. ఈ భేటీలోనే కెప్టెన్సీ మార్పుపై స్పష్టత వచ్చినట్లు సమాచారం అందుతోంది. ఈ నిర్ణయంపై హర్మన్‌ప్రీత్ సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగపూరిత పోస్ట్ షేర్ చేశారు. "భారత మహిళా క్రికెట్ జట్టు కోసం నా రక్తం, చెమట, సమయం ధారపోశాను. అనేక సందర్భాల్లో జట్టు ప్రయోజనాల కోసం నా సొంత ఆటను, వ్యక్తిగత ఆశయాలను కూడా పక్కనపెట్టాను" అంటూ ఎమోషనల్ అయ్యారు. అయితే కెప్టెన్సీ నుంచి తప్పుకున్నప్పటికీ ప్లేయర్‌గా జట్టుకు సేవలు అందిస్తూ ఉంటానని స్పష్టంచేసింది. కాగా గత కొంతకాలంగా ఆమె కెప్టెన్సీ విధానాలు, బ్యాటింగ్ ఫామ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీనిపై స్పందిస్తూ జట్టు మేలు కోసమే ప్రతీ నిర్ణయం తీసుకున్నానని, ఎలాంటి విమర్శలు వచ్చినా తనపై ఉంచిన బాధ్యతను గర్వంగా మోశానని తెలిపింది.

## ఐసిసి ర్యాంకింగ్స్‌లో స్మృతి నం. 1

**న్యూఢిల్లీ:** ఐసిసి వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత క్రీడాకారిణి స్మృతి మంధాన అగ్రస్థానంలో కొనసాగుతోంది. 790 పాయింట్లతో ఈ జాబితాలో అగ్రస్థా నంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ (782), ఆస్ట్రేలియా క్రీడాకారిణి బెత్ మూనీ (744) ఉన్నారు. అలాగే జింబాబ్వేతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్, తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తన కెరీర్‌లోనే అత్యుత్తమ స్థానాన్ని సాధించింది. 28 ఏళ్ల ఈ క్రీడాకారిణి తన కెరీర్‌లో అత్యుత్తమమైన 731 రేటింగ్ పాయింట్లతో వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానానికి చేరుకుంది. తాజా ర్యాంకింగ్‌లలో ఇతర వెస్టిండీస్ క్రీడాకారిణులు కూడా గణనీయమైన పురోగతి సాధించారు. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్‌లలో షెమైన్ క్యాంప్‌బెల్ 15 స్థానాలు ఎగబాకి 74వ స్థానానికి చేరుకోగా, బౌలర్లలో అఫీ ఫ్లెచర్ రెండు స్థానాలు పైకి ఎగబాకి 17వ స్థానానికి చేరుకుంది. వన్డే బౌలింగ్ ర్యాంకింగ్‌లలో ఆలియా అల్లెన్ ఎనిమిది స్థానాలు ఎగబాకి 49వ స్థానానికి చేరుకోగా, అష్మిని మునిసర్ 11 స్థానాలు ఎగబాకి 70వ స్థానానికి చేరుకుంది.

## ఎఎఫ్‌సి క్వాలిఫయర్స్‌లో రికార్డు సృష్టించిన భారత్ మహిళల జట్టు

### 14-0తో చిత్తుగా ఓడిన ఇరాక్

**సెలయాంగ్:** భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు ఇరాక్‌ను 14-0 తేడాతో చిత్తుగా ఓడించి, తమ ఏఎఫ్‌సీ అండర్17 మహిళల ఆసియా కప్ 2027 క్వాలిఫైయింగ్ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది. భారత్ ఆరంభం నుంచే నిరంతర పరుగు, కట్టుదిట్టమైన మార్కింగ్, చురుకైన వన్‌టచ్ ఫుట్‌బాల్‌తో ఆధిపత్యం చెలాయించింది. రెడిమా దేవి, చింగ్‌ఖమాయుమ్, బాస్కే, సిల్కీ, ఆల్వా ఫార్వర్డ్‌లకు త్రూ బాల్స్ అందిస్తూ అవకాశాలను సృష్టించారు. అనుష్క, నీరా ఈ అవకాశాలను అద్భుతమైన ఫినిషింగ్‌తో సద్వినియోగం చేసుకున్నారు. అనుష్క తన 4వ గోల్ చేయగా, ప్రీతిక స్కోరును 9-0కి చేర్చింది. ప్రతికూల వాతావరణం కారణంగా 64 నిమిషాల తర్వాత ఆటకు అంతరాయం కలగగా, 30 నిమిషాల విరామం తర్వాత మ్యాచ్ తిరిగి ప్రారంభమైంది. రితు బడైక్ కార్నర్ నుండి బస్నెట్ హెడర్ ద్వారా గోల్ చేయగా, అనుష్క తన 5 గోల్స్ ప్రదర్శనను పూర్తి చేసింది. ఆ తర్వాత ప్రీతిక బస్నెట్ హెడర్ ద్వారా తన రెండవ గోల్ చేసి కొత్త రికార్డును నెలకొల్పింది. ఆట చివరిలో అల్వా హెడర్ ద్వారా చేసిన గోల్‌తో స్కోరు 14-0కి చేరింది.

ఆట



## ఆర్బీఐ పాలసీపై ఆశలు..

# భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు



**ముంబయి, అక్టోబరు 6:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాలతో ముగిశాయి. ఫార్మా, ప్రైవేట్ బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లలో కొనుగోళ్లతో బెంచ్‌మార్క్ సూచీలు బలపడ్డాయి. మరోవైపు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన సమీక్ష నిర్ణయం కోసం ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురుచూశారు. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 685.34 పాయింట్లు లాభపడి 73,067.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 220.35 పాయింట్లు పెరిగి 22,776.10 వద్ద ముగిసింది. నిఫ్టీ సాంకేతిక పరిస్థితిపై మార్కెట్ నిపుణులు మాట్లాడుతూ 22,800 స్థాయిని స్థిరంగా అధిగమిస్తే 23,000 మార్క్ వైపు సూచీ పయనించే అవకాశం ఉందని పేర్కొన్నారు. దిగువ స్థాయిలో నిఫ్టీకి 22,600 వద్ద తక్షణ మద్దతు ఉండగా, ఆ తర్వాత 22,500 స్థాయి కీలక మద్దతుగా ఉంటుందని నిపుణులు తెలిపారు. మంగళవారం మొత్తం మార్కెట్ సెంటిమెంట్ సానుకూలంగానే కొనసాగింది. హెవీవెయిట్ షేర్లలో కొనుగోళ్లు జరగడంతో ప్రధాన సూచీలు తమ లాభాలను మరింత విస్తరించాయి. ఇన్వెస్టర్లు ప్రధానంగా ఆర్బీఐ ద్రవ్య విధాన ప్రకటనపై దృష్టి సారించారు. వడ్డీ రేట్లు, మార్కెట్‌లో లిక్విడిటీ పరిస్థితులు, దేశ ఆర్థిక వ్యవస్థపై కేంద్ర బ్యాంక్ అంచనాలు వంటి అంశాలపై ఆర్బీఐ నిర్ణయం కోసం మార్కెట్ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. నిఫ్టీ సూచీలో ట్రెంట్, బీఎస్‌ఈ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు టాప్ గెయినర్లుగా నిలిచాయి. ఈ స్టాక్స్‌లో కొనుగోళ్లు మార్కెట్ మొత్తం లాభాలకు గణనీయంగా దోహదపడ్డాయి. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్‌సూచీల్లోను కొనుగోళ్ల జోరు కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.08 శాతం పెరగగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 1.56 శాతం లాభపడి మెరుగైన పనితీరు కనబరిచింది. సెక్టార్‌ల వారీగా చూస్తే ఫార్మా, కెమికల్ షేర్లు మార్కెట్ ర్యాలీ తీసాయి. నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన సెక్టోరల్ ఇండెక్స్‌గా నిలిచింది. ఆ తర్వాత నిఫ్టీ కెమికల్ ఇండెక్స్ ఉంది. ఐటీ షేర్లలో కొంత లాభాల స్వీకరణ కనిపించింది. అమెరికా 10 ఏళ్ల బాండ్ ఈల్డ్ 0.70 శాతం తగ్గి 5.276 శాతానికి చేరుకుంది. కమొడిటీస్ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధరలు తగ్గాయి. 2026 డిసెంబర్ సెటిల్‌మెంట్‌కు సంబంధించిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 1.78 డాలర్లు తగ్గి 98.54 డాలర్లకు చేరింది. భారత్ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ సెక్యూరిటీ రాబడి 0.17 శాతం తగ్గి 7.201 శాతానికి చేరుకుంది. గత ట్రేడింగ్ సెషన్‌లో ఇది 7.213 శాతంగా ఉంది. విదేశీ మారక ద్రవ్య మార్కెట్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలహీనపడింది. పాక్షికంగా కన్వర్టిబుల్ రూపాయి 96.4400 వద్ద కొనసాగింది. గత ట్రేడింగ్ సెషన్‌లో ఇది 96.3550 వద్ద ముగిసింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో 2026 డిసెంబర్ 4 సెటిల్‌మెంట్‌కు సంబంధించిన గోల్డ్ ఫ్యూచర్స్ 0.26 శాతం పెరిగి రూ.1,49,711కు చేరుకున్నాయి. ఇదిలా ఉండగా, వివిధ కరెన్సీలతో పోలిస్తే అమెరికా డాలర్ విలువను కొలిచే డాలర్ ఇండెక్స్ తగ్గి 102 స్థాయికి చేరింది.



వాణిజ్యం

## స్వర బేబీ ప్రొడక్ట్స్‌కు రూ.1,000కోట్ల ఐపిఒకు సెబీ అనుమతి

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** భారత్‌లో డిస్పోజబుల్ హైజీన్ ఉత్పత్తుల తయారీలో ప్రముఖ కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరర్‌గా ఉన్నస్వరా బేబీ ప్రొడక్ట్సుకు భారీ ఐపీఓకు మార్గం సుగమమైంది. కంపెనీ రూ.1,000 కోట్ల ఐపిఒకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి పొందిందు. ఈ పబ్లిక్ ఇష్యూలో రూ.500 కోట్ల వరకు విలువైన తాజా షేర్ల జారీ, మరో రూ.500 కోట్ల వరకు విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. ఒఎఫ్‌ఎస్‌లో భాగంగా ఫస్ట్‌క్రై మాతృ సంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ రూ.300 కోట్ల వరకు విలువైన షేర్లను విక్రయించనుంది. అనద్య బోస్ మెర్చారి ఎల్ఎల్‌పీ రూ.200 కోట్ల వరకు విలువైన షేర్లను ఆఫర్ చేయనుంది. ఐపీఓ ద్వారా సమీకరించే నిధులను కంపెనీ ప్రధానంగా వ్యాపార విస్తరణ, రుణాల తగ్గింపు, అలాగే సాధ్యమైన కొనుగోళ్ల కోసం వినియోగించనుంది. తాజా షేర్ల జారీ ద్వారా వచ్చే నిధుల్లో సుమారు రూ.198.2 కోట్లు మధ్యప్రదేశ్‌లో కొత్త తయారీ యూనిట్ ఏర్పాటు చేయడానికి కేటాయించనున్నారు. కంపెనీ తీసుకున్న కొన్ని రుణాలను తిరిగి చెల్లించడానికి లేదా ముందస్తుగా చెల్లించడానికి రూ.100 కోట్ల వరకు వినియోగించనుంది. సహాయక సంస్థలైన సోలిస్ హైజీన్, స్వారా హైజీన్, కేఎఈహెచ్‌పీఎల్‌లో మొత్తం రూ.27.5 కోట్ల పెట్టుబడి పెట్టాలని కంపెనీ ప్రతిపాదించింది. ఈ నిధులను ఆయా సంస్థల బకాయి రుణాలను తగ్గించేందుకు ఉపయోగించనున్నారు. అదనంగా, భవిష్యత్తులో గుర్తించని కొనుగోళ్లకు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు కూడా ఐపీఓ నిధులను వినియోగించే అవకాశం ఉంది. ప్రీఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా రూ.100 కోట్ల వరకు సమీకరించే అవకాశాన్ని కూడా స్వరా బేబీ పరిశీలిస్తోంది.

# టెలికాం రంగంలో దూసుకెళ్తున్న భారత్

### 1.09 బిలియన్లు దాటిన ఇంటర్నెట్ వినియోగదారులు..

### 25 శాతం పెరిగిన వైర్‌లెస్ డేటా వినియోగం



**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** భారత్‌లో టెలికాం రంగం 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారీ వృద్ధిని నమోదు చేసింది. ఇం టర్నెట్ చందాదారుల సంఖ్య 1.09 బిలియన్లను దాటగా, వైర్ లెస్ డేటా వినియోగం దాదాపు 25 శాతం పెరిగింది. అదే సమయంలో వినియోగదారుడి నుంచి టెలికాం సంస్థలకు వచ్చే సగటు ఆదాయం కూడా పెరిగింది. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా విడుదల చేసిన వార్షిక పనితీరు నివేదిక ప్రకారం 1.09 బిలియన్లకు ఇంటర్నెట్ చందాదారులు చేరారు. 2026 మార్చి 31నాటికి దేశంలో మొత్తం ఇంటర్నెట్ చందాదారుల సంఖ్య 1.09 బిలియన్లకు చేరుకుంది. 2025 మార్చి నాటికి ఉన్న 969.1 మిలియ న్లతో పోలిస్తే ఇది 12.76 శాతం వార్షిక వృద్ధి. ఇందులో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులే అధికంగా ఉన్నారు. వారి సంఖ్య 1.066 బిలియన్లకు చేరుకుంది. ఏడాది కాలంలో బ్రాడ్‌బ్యాండ్ చందాలు 12.9శాతం పెరిగాయి. న్యారో బ్యాండ్ చందాదారుల సంఖ్య కూడా 26.91 మిలియన్లకు పెరిగింది. టెలికాం సేవలపై వినియోగదారుల వ్య యం కూడా పెరిగింది. వైర్‌లెస్ సేవల సగటు ఆదాయం ప్రతి వినియోగదారుడికి నెల కు రూ.180.73కుచేరింది. వైర్‌లెస్ డేటా చందా దారుల సంఖ్య 1.027బిలియన్లకు చేరింది. వైర్‌లెస్ డేటాసేవల ద్వారా టెలికాం సంస్థలు ఆర్జించిన ఆదా యం 11.53 శాతం పెరిగి రూ.2.39 లక్షల కోట్లకు చేరుకుంది.

## భారత్ రియాల్టీలో ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడుల జోరు



**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** భారత రియల్ ఎస్టేట్ రంగంలో ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులు భారీగా పుంజుకున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో తొలి అర్ధభాగంలో, పీఈ పెట్టుబడులు ఏడాది ప్రాతిపదికన 23 శాతం పెరిగి 2.7 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. 2023 తొలి అర్ధభాగం తర్వాత ఇదే అత్యధిక స్థాయి అని ఒక నివేదిక వెల్లడించింది. అనరాక్ క్యాపిటల్ డేటా ప్రకారం ఈ ఏడాది తొలి అర్ధభాగంలో నమోదైన 2.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 2026 లో మొత్తం ఏడాది వచ్చిన 4.3 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్లో సుమారు 63 శాతానికి సమానం. ఇదే సమయంలో డీల్స్ సంఖ్య కూడా పెరిగింది. మొత్తం 30 లావాదేవీలు జరగగా, గత ఏడాది ఇదే కాలంలో 22 డీల్స్ నమోదయ్యాయి. సగటు డీల్ పరిమాణం 18 శాతం పెరిగి 91 మిలియన్ డాలర్లకు చేరుకుంది. ద్వితీయార్థంలో గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో వచ్చిన స్థాయిలోనే పెట్టుబడులు కొనసాగితే, మొత్తం లో పీఈ పెట్టుబడులు దాదాపు 4.8 బిలియన్ డాల ర్లకు చేరుకునే అవకాశం ఉంది. అన రాక్ క్యాపిటల్ సీఈఓ శోభిత్ అగర్వాల్ మాట్లాడుతూ ద్వితీయా ర్థంలోనూ పెట్టుబడుల జోరు కొనసాగుతుందని అంచనా వేశారు. దేశీయ పెట్టుబడిదారులు తొలి అర్ధభాగంలో 24 డీల్స్ ద్వారా సుమారు 1.3 బిలియన్ డాలర్లను పెట్టుబడి పెట్టారు. గత ఏడాది ఇదే కాలంలో పెట్టుబడి పెట్టిన 220 మిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది దాదాపు ఆరు రెట్లు అధికం. మొత్తం పీఈ పెట్టుబడుల్లో దేశీయ పెట్టుబడిదారుల వాటా 48 శాతంగా ఉంది. ఇక విదేశీ పెట్టుబడిదారులు ఆరు డీల్స్ ద్వారా సుమారు 1.4 బిలియన్ డాలర్లను పెట్టుబడి పెట్టారు.

# ఐపిఒ ధర కంటే దిగువకు ఎన్‌ఎస్ఇ షేరు..

### గరిష్ట స్థాయి నుంచి పతనం

### రూ.41,000 కోట్ల మార్కెట్ విలువ ఆవిరి

**ముంబై, అక్టోబరు 6 :** స్టాక్ మార్కెట్‌లో లిస్టయిన రెండు వారాలు కూడా పూర్తికాకముందే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ షేరు ఒత్తిడికి లోనైంది. షేరు ధర ఐపీఓ ధర కంటే దిగువకు పడిపోవడంతో లిస్టింగ్ రోజు వచ్చిన లాభాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. దీంతో ఎన్‌ఎస్ఇ మార్కెట్ విలువ గరిష్ఠ స్థాయి నుంచి దాదాపు రూ.41 వేల కోట్లు తగ్గింది. సెప్టెంబర్ 24న ఎన్‌ఎస్ఇ షేర్లు బీఎస్‌ఈలో ఒక్కో షేరుకు రూ.1,800 ధర వద్ద లిస్టయ్యాయి. ఇది ఐపీఓ ధర రూ.1,785తో పోలిస్తే 1 శాతానికంటే తక్కువ ప్రీమియం. లిస్టింగ్ అనంతరం తొలుత షేరులో కొనుగోళ్ల జోరు కనిపించింది. ట్రేడింగ్ ప్రారంభమైన తొలి గంటలోనే షేరు 5 శాతానికి పైగా పెరిగి ఇంట్రాడే గరిష్ఠం రూ.1,878ను తాకింది. ఈ స్థాయిలో ఎన్‌ఎస్ఇ మార్కెట్ క్యాపిటలైజేషన్



సుమారు రూ.4.64 లక్షల కోట్లకు చేరింది. ఈ జోరు ఎక్కువ కాలం కొనసాగలేదు. ఆ తర్వాత షేరు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. సోమవారం ఎన్‌ఎస్ఇ షేరు రూ.1,712కు పడిపోయింది. లిస్టింగ్ తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. లిస్టింగ్ రోజు నమోదైన గరిష్ఠ ధరతో పోలిస్తే షేరు దాదాపు 9 శాతం, ఐపీఓ ధరతో పోలిస్తే సుమారు 4 శాతం దిగువన ఉంది. షేరు ధరలో వచ్చిన ఈ దిద్దుబాటు ప్రభావం ఎన్‌ఎస్ఇ ర్యాంకుపైనా పడింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు రూ.4.27 లక్షల కోట్లకు తగ్గడంతో దేశంలో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీల టాప్10 జాబితా నుంచి ఎన్‌ఎస్ఇ బయటకు వచ్చింది. ప్రస్తుతం 12వ స్థానంలో ఉంది. ఎన్‌ఎస్ఇ కంటే ముందు రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతి ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ టూబ్రో, ఎల్ఐసీ, హిందుస్తాన్ యూనిలీవర్, సన్ ఫార్మా ఉన్నాయి. మంగళవారం ఎన్‌ఎస్ఇ షేరు కొంత కోలుకుంది. షేరు ధర 1.53 శాతం లేదా రూ.26.35 పెరిగి రూ.1,749.85 వద్ద ఇంట్రాడే సెషన్‌ను ముగించింది.

## ఆటో రిటైల్ విక్రయాలు ఆల్‌టైమ్ స్పీడ్‌గేర్..

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** దేశీయ ఆటోమొబైల్ రిటైల్ విక్రయాలు సెప్టెంబర్‌లో రికార్డు స్థాయికి చేరుకు న్నాయి. పండుగల సీజన్‌లో పెరిగిన డిమాండ్‌తో పాటు గత ఏడాది తక్కువ బేస్ కారణంగా సెప్టెంబర్‌లో వాహనాల రిటైల్ విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 31.82 శాతం పెరిగి 25,36,920 యూనిట్లకు చేరుకున్నాయి. పరిశ్రమ సంస్థ ఫెడరేషన్ ఆఫ్ ఆటో మొబైల్ డీలర్స్ అసోసియేషన్స్‌ఫాడా మంగళవారం విడుదల చేసిన డేటాలో ఆగస్టుతో పోలిస్తే సెప్టెంబర్‌లో వాహనాల రిటైల్ విక్రయాలు 4.69 శాతం పెరిగాయి. దీంతో సెప్టెంబర్ ఆటో పరిశ్రమలో ఇప్పటివరకు నమోదైన అత్యుత్తమ నెలగా నిలిచింది. వార్షిక వృద్ధి గణాంకాలను జాగ్రత్తగా పరిశీలించాలని ఫాడా సూచించింది. 2025 సెప్టెంబర్‌లో జీఎస్టీ 2.0 అమ లుకు ముందు కొనుగోళ్లను వాయిదా వేయడం వల్ల విక్రయాలు ప్రభావితమయ్యాయని తెలిపింది. 2027 తొలి అర్ధభాగంలో రిటైల్ విక్రయాలు 20.77 శాతం పెరిగి 1,55,12,319 యూనిట్లకు చేరుకుని రికార్డు సృష్టించాయి. ద్విచక్ర వాహనాలు 33.08 శాతం పెరిగి 17,90,188 యూనిట్లు ప్యాసింజర్ వాహనాలు 32.10 శాతం పెరిగి 4,27,213 యూనిట్లు, కమర్షియల్ వాహనాలు37.62 శాతం పెరిగి 1,03,557 యూనిట్లు సేల్స్ జరిగాయి. మూడు చక్రాల వాహనాలు 22.25 శాతం పెరిగి 1,32,570 యూనిటు అమ్మకాలు జరిగాయి. ట్రాక్టర్లు: 13.75 శాతం పెరిగి 76,906 యూనిట్లు, వీల్డ్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్: 38 శాతం పెరిగి 6,486 యూనిట్లు విక్రయాలుజరిగాయి. సెప్టెంబర్‌లో ప్యాసింజర్ వాహనాల రిటైల్ విక్రయాల్లో ఆల్టర్నేటివ్‌ఫ్యూయల్ వాహనాల వాటా 41 శాతానికి చేరుకుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.